thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 85 | కరీంనగర్ బుధవారం, 4 జూన్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## పంజాబ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు పాఠాలు

పంజాబ్ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు పాఠాలను చెబుతున్నారు. ఆశ్చర్యంగా ఉందా.. కానీ ఇది అక్షరాలా నిజం. కేంద్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు దేశంలోని అన్ని సర్కారీ బడుల్లో భారతీయ భాషా వేసవి శిబిరాలను నిర్వహించారు. ఇందులో భాగంగానే పంజాబ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆ క్యాంపుల్లో హాజరైన విద్యార్థులకు టీచర్లు తెలుగు నేర్పిస్తున్నారు. విద్యార్థులకు తెలుగు ఓనమాలు నేర్పించి, పాఠాలు బోధించారు. కేంద్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు పంజాబ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో మే 26వ తేదీ నుంచి వారం రోజుల పాటు సమ్మర్ క్యాంప్స్ జరిగాయి. ఈ శిబిరాలకు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు హాజరయ్యారు. వారికి యూట్యూబ్‌లో చూసి తెలుగు వర్ణమాల నేర్పించారు. తెలుగులో కూరగాయల పేర్లు, పండ్లు, వంటకాలు ఇలా చాలా వాడుకపదాలను విద్యార్థులు నేర్చుకున్నారు.

# కాలం కలసి రావట్లేదబ్బా!

# బీఆర్ఎస్‌కు 'జూన్' గండం?

## గులాబీ దండులో టెన్షన్.. టెన్షన్...!!



బీఆర్ఎస్ కు జూన్ నెల చాలా కీలకంగా మారబోతోంది. ఎలాగంటే ఈనెలలోనే ముగ్గురు అగ్రనేతలు విచారణలకు హాజరవబోతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అవకతవకలపై 11వ తేదీన పీసీ ఘోష్ కమిషన్ ముందు కేసీఆర్ విచారణకు హాజరుకాబోతున్నారు. 9వ తేదీన మాజీమంత్రి హరీష్ రావు కూడా ఇదే విచారణకు హాజరవుతున్నారు. అలాగే ఫార్ములా ఈ కార్ రేసు కేసులో ఏసీబీ విచారణకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారు. మే నెలలోనే విచారణకు హాజరవ్వాల్సున్నా విదేశీ టూర్ నుండి వచ్చిన తర్వాత హాజరవుతానన్న కేటీఆర్ విజ్ఞప్తికి ఏసీబీ అధికారులు ఓకే చెప్పారు. దాంతో కేటీఆర్ విదేశాల నుండి రాగానే విచారణకు హాజరవ్వక తప్పదు. ఇదేసమయంలో కేసీఆర్ కు అత్యంత సన్నిహితుడు, ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ టీ ప్రభాకరరావు టెలిఫోన్ ట్యాపింగ్ కేసు విచారణకు 5వ తేదీన హాజరవుతున్నారు. తెలంగాణలో సంచలనం సృష్టించిన టెలిఫోన్ ట్యాపింగ్ కేసులో సూత్రదారిగా కేసీఆర్ పైన చాలా ఆరోపణలున్నాయి. ట్యాపింగ్ కేసులో కీలక పాత్రదారి టీ. ప్రభాకరరావు గనుక విచారణలో నోరిప్పితే కేసీఆర్ తో పాటు కేటీఆర్ కు కూడా కష్టాలు తప్పేట్లు లేదు. టెలిఫోన్ ట్యాపింగ్ కు తనకు ఏమిటి సంబంధమని కేసీఆర్ ఒక మీడియా ఇంటర్వ్యూలో ఆమధ్య ఎదురుదాడిచేశారు. ట్యాపింగ్ అంశం పూర్తిగా పోలీసు శాఖకు సంబందించిన విషయమని తేలికగా కొట్టేసేందుకు ప్రయత్నించిన విషయం తెలిసిందే. కేసీఆర్ చెప్పింది ఎలాగుందంటే ప్రభుత్వానికి పోలీసు శాఖకు ఎలాంటి సంబంధంలేదన్నట్లుగా ఉంది. ప్రభుత్వంలోని అనేక శాఖల్లో పోలీసుశాఖకు కూడా ఒకటని, దానికి కూడా తానే అధిపతి అన్న విషయం జనాలకు తెలీదన్నట్లుగా కేసీఆర్ మాట్లాడుతున్నారు. దీంతోనే ట్యాపింగ్ విచారణపై కేసీఆర్ లో పెరిగిపోతున్న టెన్షన్ అర్థమైపోతోంది. క్షేత్రస్థాయిలోని పరిస్థితులను గమనిస్తే బీఆర్ఎస్ కు జూన్ గండం తప్పేట్లు లేదనే అనిపిస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, అవకతవకలకు కేసీఆరే బాధ్యుడన్న విషయం పీసీ ఘోష్ కమిషన్ విచారణకు హాజరైన 110 మందిలో అత్యధికులు అఫిడవిట్లు సమర్పించినట్లుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ఈవిషయాన్ని కేసీఆర్ ఎలాగూ అంగీకరించరు. టెలిఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై చెప్పినట్లే ఇపుడు కూడా కాళేశ్వరంలో అవినీతి, అవకతవకలు జరిగుంటే అందుకు అధికారులు, నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ దే బాధ్యతన్నట్లుగా వాదిస్తారు. ప్రాజెక్టులో అవినీతి జరగలేదని చెప్పేందుకు లేదు. అవినీతి జరిగింది కాబట్టే మేడిగడ్డ బ్యారేజి పిల్లర్లు మూడు కుంగిపోయాయి. పిల్లర్లు కుంగిపోయిన ఫలితంగానే బ్యారేజీ ప్లాట్ ఫారమ్ లో పగుళ్ళొచ్చేశాయి. దీంతోనే కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజీలో నీటినిల్వ సమస్యగా మారింది. అవినీతి, అవకతవకలు జరిగాయి కాబట్టి వేలకోట్ల రూపాయలు వ్యయంతో నిర్మించిన ప్రాజెక్టు, బ్యారేజీలు పనికిరాకుండా పోయాయి. కేసీఆర్, హరీష్ రావు, ఈటల రాజేందర్ విచారణ తర్వాత వీళ్ళపాత్రపై కమిషన్ ఎలాంటి రిపోర్టు ఇవ్వబోతోందన్నది ఆసక్తిగా మారింది. కమిషన్ ఇవ్వబోయే ఫైనల్ రిపోర్టు మీద రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏ విధంగా ? ఎవరిపైన యక్షన్ తీసుకుంటుందన్నది ఆధారపడుంది. ఇక ఫార్ములా ఈ కార్ రేసు విచారణకు కేటీఆర్ హాజరవ్వాల్సుంది. విదేశాల నుండి తిరిగిరాగానే వర్కింగ్ ప్రెసిడెంట్ ఏసీబీ విచారణకు హాజరవుతారు. ఈ కేసులో కేటీఆర్ అవినీతికి పాల్పడ్డారన్న విషయంలో ఆధారాల సంగతేమో కాని అధికారదుర్వినియోగానికి పాల్పడ్డారనేందుకు చాలా ఆధారాలున్నాయి. అవేమిటంటే అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే కేంద్ర ఎన్నికల కమీషన్ అనుమతి తీసుకోకుండా బ్రిటన్ కంపెనీకి హెచ్ఎండీఏ ఖాతానుండి పౌండ్లలో రు. 45 కోట్లు చెల్లించటం. నిధుల చెల్లింపుకు ముందు క్యాబినెట్ అనుమతి తీసుకోలేదు, చివరకు రిజర్వ్ బ్యాంక్ అనుమతి కూడా తీసుకోలేదు. విదేశాలకు విదేశీ కరెన్సీలో చెల్లింపులు చేయాలంటే ముందుగా ఆర్బీఐ అనుమతి తప్పనిసరి. విషయం తెలిసిన తర్వాత ఆర్బీఐ తెలంగాణ ప్రభుత్వానికి రు. 8 కోట్ల జరిమానా విధించింది. మంత్రి హోదాలో కేటీఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడితే తెలంగాణ ప్రభుత్వం రు. 8 కోట్ల జరిమానాను చెల్లించాల్సొచ్చింది. తెలంగాణ ప్రభుత్వం కోట్లరూపాయల జరిమానాను చెల్లించింది అంటేనే తప్పుచేసినట్లు అంగీకరించిందని అర్థం. తప్పు ఎందుకు చేసిందంటే కేటీఆర్ కారణంగానే అన్నది క్లియర్. అధికార దుర్వినియోగం ఇంత స్పష్టంగా బయటపడింది కాబట్టి అందుకు బాధ్యత అధికారులదే అని కేటీఆర్ వాదించి బాధ్యతనుండి తప్పించుకునే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యమంత్రి కొడుకు, మున్సిపల్ శాఖ మంత్రి హోదాలో కేటీఆర్ ఆదేశాలు పాటించటం కుదరదని ఏ అధికారి అయినా చెప్పగలరా ? కేటీఆర్ ఫోన్లో ఆదేశిస్తేనే హెచ్ఎండీఏ నుండి నిధులు చెల్లించినట్లు అప్పట్లో మున్సిపల్ శాఖ ప్రిన్సిపుల్ సెక్రటరీ, హెచ్ఎండీఏ కమీషనర్ గా పనిచేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ చెప్పినట్లు సమాచారం. ఈ కేసులో కేటీఆర్ ను ఇప్పటికే ఏసీబీ, ఈడీ రెండుసార్లు విచారించాయి. మరి మూడోసారి విచారణలో ఏసీబీ ఎలాంటి యాక్షన్ తీసుకుంటుందన్నది ఆసక్తిగా మారింది. ఇక టెలిఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ కూడా చాలా కీలకమనే చెప్పాలి. బీఆర్ఎస్ హయాంలో వేలాది మొబైల్ ఫోన్లు ట్యాపింగ్ అయ్యాయి. ఇదంతా కూడా నియమ, నిబంధనలకు విరుద్ధంగానే జరిగింది. బీఆర్ఎస్(%దీ=ూ%) ప్రత్యర్థిపార్టీల నాయకులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, సెలబ్రిటీలు, జర్నలిస్టులు, అనుమానం ఉన్న సొంతపార్టీ నేతలు, చివరకు కొందరు జడ్జీలతో పాటు వారి కుటుంబసభ్యుల ఫోన్లు కూడా ట్యాపయ్యాయి. వేలాది మొబైల్ ఫోన్ల ట్యాపింగ్ కు ప్రధాన కారకుడు కేసీఆర్ హయాంలో ఇంటెలిజెన్స్ చీఫ్ గా పనిచేసిన టీ ప్రభాకరరావు. ప్రభాకరరావు చెబితేనే తాము మొబైల్ ఫోన్లను ట్యాప్ చేసినట్లు అరెస్టయిన పోలీసు అధికారులు ప్రణీత్ రావు, తిరుపతన్న, కిషన్ రావు, భుజంగరావు 'సిట్' విచారణలో ఇప్పటికే అంగీకరించారు. అయితే వేలాది ఫోన్లను ట్యాప్ చేయాలని ప్రభాకరరావుకు ఆదేశాలిచ్చింది ఎవరన్న విషయం మాత్రమే తేలాలి.

విచారణ నుండి తప్పించుకునేందుకు అమెరికాలో కూర్చుని 14 మాసాలు ప్రయత్నించిన నిందితుడు చివరకు ఇండియాకు వచ్చి సిట్ విచారణకు హాజరుకాక తప్పలేదు. 5వ తేదీన సిట్ విచారణకు ప్రభాకరరావు హాజరవుతున్నారు. నిందితుడు గనుక అప్రూవర్ గా మారిపోతే కేసీఆర్, కేటీఆర్ కు తిప్పలు తప్పవన్న విషయం అర్థమైపోతోంది. ఈ డెవలప్మెంట్లన్నీ గమినిస్తుంటే బీఆర్ఎస్ కు జూన్ నెల గడ్డునెలన్న విషయం అర్థమైపోతోంది. కాళేశ్వరం విచారణకు కేసీఆర్, హరీష్ రావు హాజరై తన వాదన ఏమైనా వినిపించుకోవచ్చు. అయితే వాళ్ళ వాదన తర్వాత కమిషన్ ఏమి రిపోర్టు ఇస్తుందన్నదే ఇక్కడ కీలకం. ఇప్పటికే కమిషన్ విచారణకు హాజరైన వారిలో అత్యధికులు అవినీతి, అవకతవకలకు పూర్తి బాధ్యత కేసీఆర్, హరీష్, నిర్మాణ కంపెనీదే అని అఫిడవిట్లు దాఖలుచేసిన విషయం తెలిసిందే. కాబట్టి విచారణకు హాజరవ్వటం ఒక ఎత్తయితే విచారణ తర్వాత జరగబోయే పరిణామాలు మరింత కీలకంగా మారబోతున్నాయి. చివరకు ఏమి జరుగుతుందో చూడాలి.



## నేడు మోడీ అధ్యక్షతన కేబినెట్ భేటీ.. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలి భేటీ

ప్రధాని మోడీ అధ్యక్షతన బుధవారం కేంద్ర కేబినెట్ సమావేశం కానుంది. పాకిస్థాన్‌పై భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన తర్వాత తొలిసారి ఈ మంత్రివర్గం సమావేశం అవుతోంది. కేబినెట్ మంత్రులతో పాటు సహాయమంత్రులు, స్వతంత్ర మంత్రులు కూడా ఈ సమావేశానికి హాజరుకానున్నారు. మూడోసారి ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి త్వరలోనే తొలి ఏడాది పూర్తికానుంది. ఈ తరుణంలో ప్రధాని అధ్యక్షతన కేంద్రమంత్రి మండలి సమావేశం కానుండడం ప్రాధాన్యత సంతరించుకోనుంది. సుష్మా స్వరాజ్ భవన్‌లో జరగనున్న కేబినెట్ సమావేశంలో ఆపరేషన్ సిందూర్‌కు దారితీసిన పరిస్థితులు, తదనంతర పర్యవసానాలను సహచర మంత్రులకు ప్రధాని మోడీ వివరించే అవకాశం ఉంది. తీవ్రవాదానికి వ్యతిరేకంగా త్రివిధ దళాలు చేపట్టిన ఆపరేషన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎన్డీఏ ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో కేబినెట్ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. అలాగే జనాభా లెక్కలతో పాటు కుల గణన కూడా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై కూడా చర్చ జరిగే అవకాశం ఉంది. గత వారం సమావేశమైన ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా కుల గణనపై చర్చించారు. తాజాగా జరగబోయే కేబినెట్ సమావేశంలో కూడా ఈ అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## తెలంగాణలోని కొత్త మున్సిపాలిటీల్లో వార్డుల విభజనకు కసరత్తు



హైదరాబాద్: తెలంగాణలోని కొత్త మున్సిపాలిటీల్లో వార్డుల విభజనకు కసరత్తు మొదలైంది. ప్రతిపాదనలు తయారు చేసిన పురపాలకశాఖ బుధవారం నోటిఫికేషన్ ఇవ్వనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 18 నూతన మున్సిపాలిటీలను ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసింది. మరో 5 కార్పొరేషన్లు, 7 మున్సిపాలిటీల్లో సమీప గ్రామాలు విలీనమయ్యాయి. కొత్త మున్సిపాలిటీలు, విలీనమైన ప్రాంతాల్లో వార్డుల ఏర్పాటు కోసం జూన్ 4న నోటిఫికేషన్ విడుదల చేసి.. 19 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేసేలా షెడ్యూల్ నిర్ణయించారు. గురువారం నుంచి ఈనెల 11 వరకు ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఈనెల 12 నుంచి 16 వరకు అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరిస్తారు. ఈనెల 17, 18 తేదీల్లో వార్డుల విభజనను ఆమోదించేందుకు కలెక్టర్లకు పంపనున్నారు. కలెక్టర్లు ఆమోదించిన జాబితాను ఈనెల 18న పురపాలకశాఖ కమిషనర్‌కు, 19న ప్రభుత్వానికి నివేదిక పంపిస్తారు. కొత్త వార్డులపై ఈనెల 21న తుది నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న మున్సిపాలిటీల్లో వార్డుల విభజనను పక్కన పెట్టారు. ఓఆర్ఆర్ వరకు ఉన్న మున్సిపాలిటీలను కార్పొరేషన్లుగా ఏర్పాటు చేసి.. పట్టణ పునర్వ్యవస్థీకరణ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నందున అక్కడ వార్డుల విభజనను వాయిదా వేయాలని నిర్ణయించారు. కోహిర్, కేసముద్రం, అశ్వరావుపేట, స్టేషన్ ఘనపూర్, మద్దూర్, ఎదులాపురం, దేవరకద్ర, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, చేవెళ్ల, మొయినాబాద్, ములుగు, బిచ్కుంద, కల్లూరు, అలియాబాద్, మూడుచింతలపల్లె, ఎల్లంపేట మున్సిపాల్టీల్లో వార్డుల విభజన జరగనుంది. మహబూబ్ నగర్, మంచిర్యాల, కరీంనగర్, రామగుండం, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లు, నర్సంపేట, పరిగి, కొల్లాపూర్, ఆలేరు, బాన్సువాడ, జగిత్యాల, హాలియా మున్సిపాలిటీల్లో విలీనమైన ప్రాంతాల్లోనూ కొత్త వార్డుల ఏర్పాటు కానున్నాయి. కొత్త మున్సిపాల్టీల్లో వార్డుల విభజన తర్వాత జూన్ నెలాఖరు వరకు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పురపాలక శాఖ భావిస్తోంది.




# తెలంగాణ కాంగ్రెస్‌లో

# మళ్లీ ఎమ్మెల్యేల చేరికలు?

## ఊహాకందని రీతిలోనే...!

హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో చేరిన పది మంది ఎమ్మెల్యేలు ఉక్కపోతకు గురవుతున్నారని అటు కాంగ్రెస్ పార్టీలో ఉండలేక%ౌ%ఇక బీఆర్ఎస్ లోకి పోలేక ఇబ్బంది పడుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. కానీ అనూహ్యంగా ఇప్పుడు రాజకీయం మారుతోంది. గ్రేటర్ హైదరాబాద్ తో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన మరికొంత మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరేందుకు సిద్ధమవుతున్నారన్న ప్రచారం ఊపందుకుంటోంది.

**కాంగ్రెస్ లోకి ఆలంపూర్ ఎమ్మెల్యే...** ఉమ్మడి మహబూబ్ నగర్‌లో బీఆర్ఎస్ గెలిచిన స్థానాల్లో ఒకటి ఆలంపూర్.

రిజర్వుడు నియోజకవర్గం అయిన ఆలంపూర్ నుంచి విజయుడు అనే అభ్యర్థికి చివరి క్షణంలో కేసీఆర్ టిక్కెట్ ఇచ్చారు. గెలిచారు. ఇప్పుడు ఆయన కాంగ్రెస్‌తో సన్నిహితమయ్యారు. ఆ పార్టీ నేతలతో కలిసి తిరుగుతున్నారు. నిజానికి ఈ విజయుడికి యజమాని ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి. ఆయన ఏం చెబితే అది చేస్తారు. ఆ వెంకట్రామిరెడ్డి ఇప్పటికే రేవంత్ రెడ్డికి సన్నిహితమయ్యారు. దీంతో విజయుడు అనధికారికంగా కాంగ్రెస్ తో కలిసిపోయారు.

**గ్రేటర్ పరిధిలో మరికొంత మంది ఎమ్మెల్యేలు...** గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్ పార్టీలో చేరిన దానం నాగేందర్ ఇటీవల పార్టీకి దూరంగా ఉంటున్నారు. విమర్శలు చేశారు కానీ ఇప్పుడు ఆపేశారు. పెద్దగా బయట కనిపించడం లేదు. కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్లోనూ కనిపించడం లేదు. ఆయనకు అనర్హతా భయం ఉంది. ఆ విషయం పక్కన పెడితే గ్రేటర్ ఎన్నికలు రానున్న సమయంలో కొంత మంది చేయి పట్టుకునేందుకు రెడీ అయినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యేగా పట్టు నిలుపుకోవాలంటే తమ అనుచరులు కార్పొరేటర్లుగా ఉండాలి. ప్రభుత్వం అధికారంలో ఉండాలి. లేకపోతే పనులు జరగవు. అందుకే వారు కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారని అంటున్నారు.

**బీఆర్ఎస్ పరిణామాలతో ఆందోళన...** భారత రాష్ట్ర సమితిలో ఎం జరుగుతుందో బీఆర్ఎస్ నేతలకూ అర్థం కావడం లేదు. పార్టీ ఉనికిపై సందేహాలు వస్తున్నాయి. బీజేపీలో కలుపుతారని జరుగుతున్న ప్రచారానికి బలమైన ఘటనలు కళ్ల ఎదురుగా కనిపిస్తూండటంతో చాలా మంది పక్క చూపులు చూసుకుంటున్నారు. బీజేపీలో చేరితే.. గ్రేటర్ బీఆర్ఎస్ నేతలకు గడ్డు పరిస్థితి వస్తుంది. ఈ పరిణామాలన్నీ కలిసి కాంగ్రెస్ లో చేరికలకు మార్గాన్ని సుగమం చేస్తున్నాయి. కానీ అక్కడ చేరిన తర్వాత ఉక్కపోతను తట్టుకోగలరా అన్నదే పెద్ద సమస్య.




ఖమ్మం: రైతులకు ఎంతో ఉపయోగపడేలా 'భూభారతి' చట్టాన్ని జాగ్రత్తగా రూపకల్పన చేశామని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.

ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమాడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగా భూభారతి చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. కొత్త చట్టాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మనుషులకు ఆధార్ లాగే భూములకు త్వరలో భూధార్‌ను తీసుకొస్తామని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భూభారతి చట్టం తెచ్చామన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించి భూములను సర్వే చేయిస్తామని తెలిపారు. గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 3,500 మంది రెవెన్యూ అధికారులను నియమిస్తున్నామని పొంగులేటి చెప్పారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విప్లవాత్మక చట్టాన్ని తమ ప్రభుత్వం తెచ్చిందన్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా.. భూముల సమస్యలు పరిష్కారం కాలేదని చెప్పారు. భూభారతితో రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.

## బనకచర్ల ప్రాజెక్టును ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకోం: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టును తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సముద్రంలో కలిసే నీళ్లే వాడుకుంటామని ఏపీ నేతలు ఎలా చెబుతారని ప్రశ్నించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ "బనకచర్లను అడ్డుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు, కేంద్ర మంత్రి సి.ఆర్. పాటిల్‌కు లేఖలు రాశాం. ఈ అంశంపై కేంద్ర మంత్రితో నేరుగా మాట్లాడాం. ప్రాజెక్టును అడ్డుకోవాలని కోరాం. మా అభ్యంతరాలను కేంద్రానికి తెలియజేశాం. ఈ అంశంపై సరైన సమయంలో స్పందిస్తాం" అని ఉత్తమ్ తెలిపారు.








హైదరాబాద్: మిస్ వరల్డ్ పోటీలకు చాలా దేశాలతో పోటీ పడి హైదరాబాద్ అవకాశం దక్కించుకుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ పోటీలతో తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలు, హస్తకళల గొప్పతనం ప్రపంచానికి తెలిసిందని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో జూపల్లి మాట్లాడారు. భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన ఆరోపణలపై మంత్రి స్పందించారు. "భారాస చేసిన ప్రతి ఆరోపణపై బహిరంగ చర్చకు నేను సిద్ధం. మిస్ వరల్డ్ పోటీల ఖర్చుపై హరీశ్‌రావు తప్పుడు ఆరోపణలు చేశారు. రూ.31కోట్ల ఖర్చులో 21 కోట్లు స్పాన్సర్ల ద్వారానే వచ్చింది. మరో 12 కోట్ల ఆదాయంపై ఒప్పందాలు ఉన్నాయి. రూ.200 కోట్లు ఖర్చు చేసినట్లు హరీశ్‌రావు ఆరోపిస్తున్నారు. ఆ ఆరోపణలను ఆయన నిరూపిస్తారా? అని సవాల్ విసురుతున్నా. మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు 30 తులాల బంగారం ఇచ్చారనేది అబద్ధం. 30 తులాలు కాదు.. 3 గ్రాములు కూడా ఇవ్వలేదు" అని జూపల్లి అన్నారు.

## అధికారం లేకపోతే రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనరా?: ఆది శ్రీనివాస్

హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద పండగలా నిర్వహించినట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. జూన్ 2న భారాస మాత్రమే ఈ వేడుకలను నిర్వహించలేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం గుర్తుంటుందా? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. "జూన్ 2న కేసీఆర్ బయటికి రాలేదు. కనీసం అమరవీరులకు నివాళులర్పించలేదు. కేటీఆర్ అమెరికాకు వెళ్లారు.. ఆయనా రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనలేదు. అధికారం లేకపోతే ఈ వేడుకల్లో పాల్గొనరా? అధికారం ఇవ్వకుంటే ప్రజల్లోకి వచ్చేది లేదని భారాస నేతలు ఒక సంకేతం ఇచ్చారు. రాష్ట్రంలో 25.35 లక్షల మంది రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణ మాఫీ చేసింది. గతంలో భారాస ప్రభుత్వం రుణమాఫీని సక్రమంగా ఎప్పుడూ పూర్తి చేయలేదు" అని ఆది శ్రీనివాస్ విమర్శించారు.




## కేటీఆర్, హరీష్‌రావులకు మంత్రి పొన్నం సవాల్..

తెలంగాణ ఖ్యాతి ఖండాంతరాలు దాటుతుంటే చూసి ఓర్వలేకపోతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెల నుంచే విపక్షాలు పిల్లి శాపనార్థాలు పెడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్‌మండిపడ్డారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. అంతర్జాతీయ అతిథులు రాష్ట్రానికి వస్తే విమర్శలు చేయడం తగదని అన్నారు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్‌రావులకు సవాల్ చేస్తున్నా.. దీనిపై చర్చకు ఎక్కడకు రావాలి.. తెలంగాణ భవన్‌కు రావాలా? అబిడ్స్ చౌరస్తాకు రావాలో చెప్పాలన్నారు. రూ. 200 కోట్లు ఖర్చు ఎక్కడ అయ్యాయో చెప్పాలని.. ఖర్చు అయినట్లు నిరూపించాలని.. లేదంటే ముక్కు నెలకు రాయాలని మంత్రి సవాల్ చేశారు.

**వారం రోజులు టైమ్ ఇస్తున్నా...** కేటీఆర్, హరీష్‌రావు చెప్పిన టైమ్‌కు చర్చకు ఎక్కడికైనా వస్తానని దీనికి వారం రోజులు సమయం ఇస్తున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ధైర్యం ఉంటే బహిరంగ చర్చకు వారు రావాలని మరోసారి ఆయన సవాల్ చేశారు.







'థగ్ లైఫ్' విడుదలను నిషేధించాలని కోరుతూ కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (కేఎఫ్‌సీసీ) కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. నేడు దీన్ని విచారించిన హైకోర్టు కమల్ హాసన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎంత పెద్ద నటుడైనప్పటికీ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఆయనకు లేదని హెచ్చరించింది. ఈ అంశంపై తీవ్రంగా స్పందించింది. అతడి వ్యాఖ్యలకు ఆధారాలను అడిగింది. 'ఒక్క క్షమాపణ చెబితే అన్నీ పరిష్కారమయ్యేవని' వ్యాఖ్యానించింది. "మీరు కమల్‌హాసన్ కావచ్చు లేదా మరెవరైనా కావచ్చు. ప్రజల మనోభావాలను దెబ్బతీయలేరు. ఒక ప్రజాప్రతినిధిగా అలాంటి ప్రకటన చేయకూడదు. మీ కామెంట్స్ వల్ల అశాంతి ఏర్పడింది. కన్నడ ప్రజలు మిమ్మల్ని క్షమాపణలు మాత్రమే అడిగారు. మీరు ఏ ప్రాతిపదికన ఆ ప్రకటన చేశారు? మీరు ఏమైనా చరిత్రకారులా? లేక భాషావేత్తనా? ఎందుకు అలాంటి వ్యాఖ్యలు చేశారు?" అని కమల్‌హాసన్‌ను హైకోర్టు ప్రశ్నించింది. "క్షమాపణ చెప్పని పక్షంలో కర్ణాటకలో సినిమాను ఎందుకు ప్రదర్శించాలనుకుంటున్నారు? వదిలేసేయండి. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ హద్దులు దాటి, ప్రజల మనోభావాలను దెబ్బతీయకూడదు కదా. మీరు క్షమాపణ చెబితే ఏ సమస్యా ఉండదు. మీ సినిమాను ప్రదర్శించటం ద్వారా కర్ణాటక నుంచి కూడా మీరు రూ.కోట్లలో ఆదాయాన్ని పొందవచ్చు" అని కోర్టు పేర్కొంది. కమల్‌హాసన్ ఉద్దేశ పూర్వకంగా ఆ వ్యాఖ్యలు చేయలేదని ఆయన తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకురాగా, 'పరిస్థితుల కారణంగా బాధితుడయ్యే వ్యక్తికీ, వాటిని సృష్టించే వ్యక్తికీ మధ్య చాలా తేడా ఉంది. ఇప్పటికే కమల్‌హాసన్ బాహాటంగా తన అభిప్రాయాన్ని ప్రకటించారు. దాన్ని మీరు ఇప్పుడు కప్పిపుచ్చలేరు. మిగిలింది క్షమాపణలు చెప్పడమే' అని కోర్టు వ్యాఖ్యానించగా, కమల్‌హాసన్ పరిస్థితిని చక్కబరిచేందుకే ప్రయత్నించినా, అది పక్కదారి పట్టిందని ఆయన తరఫు న్యాయవాది అన్నారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ 'కావచ్చు. కానీ, కారణం ఎవరు? మీరే పరిస్థితి చేయిదాటిపోయేలా చేశారు. ఇప్పుడు మీ సినిమాను రక్షించాలని కోరుతున్నారు' అని కోర్టు వ్యాఖ్యానించింది. ఇటీవల జరిగిన 'థగ్ లైఫ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తమిళం నుంచి కన్నడ పుట్టిందంటూ కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి కారణమయ్యాయి. దీంతో ఆయన వ్యాఖ్యలపై అధికార, విపక్ష పార్టీలతో పాటు కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కూడా తీవ్రంగా స్పందించాయి. ఈ క్రమంలోనే 'థగ్‌లైఫ్'ని కర్ణాటకలో నిషేధించాలని కోరుతూ కేఫ్‌సీసీ హైకోర్టును ఆశ్రయించింది.




భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అమెరికా పర్యటన కొనసాగుతోంది. దీనిలో భాగంగా డాలస్‌లో అమెరికాలోనే అతి పెద్దదైన మహాత్మాగాంధీ విగ్రహాన్ని సందర్శించారు. అక్కడ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ అహింస, సత్యాగ్రహమే ఆయుధాలుగా భారతీయులందరినీ గాంధీ సమాయత్తం చేశారన్నారు. బ్రిటిష్ బానిస సంకెళ్ల నుంచి దేశాన్ని విడిపించి స్వాతంత్ర్యం తీసుకొచ్చేందుకు కృషి చేశారని కొనియాడారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా నేటికీ గాంధీని ప్రశంసిస్తూనే ఉంటారని చెప్పారు. అలాంటి విశ్వనాయకుడి విగ్రహాన్ని ఇంత పెద్ద ఎత్తున డాలస్ (ఇర్వింగ్)లో నెలకొల్పడంలో మహాత్మాగాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ వ్యవస్థాపక అధ్యక్షులు డా.ప్రసాద్ తోటకూర, కార్యవర్గ సభ్యుల కృషిని కేటీఆర్ అభినందించారు. అనంతరం ఆ సంఘం వ్యవస్థాపక కార్యదర్శి రావు కల్వాల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు, దశాబ్దకాలం పాటు రాష్ట్ర అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, వారి కుటుంబసభ్యులు చేసిన కృషి, త్యాగాలను రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరువలేరని చెప్పారు. గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం కేసీఆర్ మార్గనిర్దేశంలో కేటీఆర్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. కేసీఆర్ విజన్ తెలంగాణకు ఒక గళాన్ని ఇచ్చిందన్నారు. డా.ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ అమెరికాలో అతి పెద్దదైన గాంధీ స్మారకస్థలిని నిర్మించి 10 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఈ నిర్మాణం ప్రవాస భారతీయుల సమష్టి కృషి, ఐకమత్యానికి నిదర్శనమని చెప్పారు. దీన్ని సాకారం చేసేందుకు అనుమతులు ఇచ్చిన నగర అధికారులు, దాతలు, కార్యవర్గ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా డాలస్ సందర్శనకు వచ్చినవారు ఈ గాంధీ స్మారకస్థలిని సందర్శిస్తూనే ఉన్నారని చెప్పారు. అనంతరం కేటీఆర్‌ను బోర్డు సభ్యులు రావు కల్వాల, బీఎన్ రావు, తైయాబ్ కుండావాలా, మురళి వెన్నం, రాజేంద్ర వంకావాలా, అనంత్ మల్లవరపు, వినోద్ ఉప్పు, షబ్నం మాడ్గిల్‌తో కలిసి డా.ప్రసాద్ తోటకూర ఘనంగా సన్మానించారు. వందలాది ప్రవాస భారతీయులు హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో కోపెల్ సిటీ కౌన్సిల్ మెంబర్ రమేశ్ ప్రేమ్ కుమార్, ఎన్ఆర్ఐ భారాస అమెరికా విభాగం అధ్యక్షుడు తన్నీరు మహేశ్, ఎన్ఆర్ఐ భారాస గ్లోబల్ కన్వీనర్ బిగాల మహేశ్, నేతలు ఎల్.రమణ, తాతా మధు, గ్యాదరి బాలమల్లు, నవీన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, బాల్క సుమన్, గువ్వల బాలరాజు, గండ్ర వెంకటరమణారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గాదరి కిశోర్, క్రాంతి కిరణ్, పైలట్ రోహిత్‌రెడ్డి, కోరుకంటి చందర్, నోముల భగత్, బానోతు చంద్రావతి, గండ్ర జ్యోతి, దామోదర్, జాన్సన్ నాయక్, అమరేందర్‌రెడ్డి, రఘువీర్‌సింగ్, యుగంధర్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, అభిలాష్ రంగినేని, సోమ ఉపేందర్‌రెడ్డి, వంశీరెడ్డి, అరవింద్‌రావు తక్కెళ్లపల్లి తదితరులు పాల్గొన్నారు.

## టీ.బీజేపీలో రాజాసింగ్ కల్లోలం



హైదరాబాద్, జూన్ 3: తెలంగాణ బీజేపీలో ఎమ్మెల్యే రాజాసింగ్ ఎపిసోడ్ కల్లోలం రేపుతోంది. తరుచుగా టీ.బీజేపీ నాయకత్వంపై ఆయన విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. నోటీసులు కాదు దమ్ముంటే సస్పెండ్ చేయాలంటూ ఎమ్మెల్యే సవాల్ విసిరారు. హిజ్రాలు అంటూ రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ బీజేపీ నాయకత్వం సీరియస్‌గా ఉంది. ఎమ్మెల్యే వ్యవహారంపై ఢిల్లీ పెద్దలతో టీ.బీజేపీ నాయకత్వం చర్చించనుంది. రాజాసింగ్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. హైకామండ్‌తో చర్చించి ఎమ్మెల్యేపై చర్యలకు స్టేట్ పార్టీ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. రోజు రోజుకు రాజాసింగ్ ఎపిసోడ్ చిలికిచిలికి గాలివానగా మారుతోంది. ఈరోజు సాయంత్రం జాతీయ నాయకత్వంతో రాష్ట్ర నాయకత్వం మాట్లాడి ఆయనను సస్పెండ్ చేసే దిశగా చర్యలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. బీజేపీలో పనిచేస్తున్న సీనియర్ నేతలపై ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. వాళ్లతో పనిచేయడానికి బదులు తనను సస్పెండ్ చేయాలంటూ రాజాసింగ్ సవాల్ విసిరారు. ఆ సవాల్‌ను అటు హైకమాండ్.. ఇటు స్టేట్ బీజేపీ చాలా సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. ముందు నుంచి కూడా బీజేపీలో రెబల్ క్యాండిడేట్‌గా రాజాసింగ్ ఉన్నారు. గత కొద్దిరోజులుగా బీజేపీ రాష్ట్ర నాయకత్వంతో రాజాసింగ్‌కు పొసగని పరిస్థితి. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ మధ్యవర్తిత్వం వహించి పార్టీ రాష్ట్ర నాయకత్వానికి, రాజాసింగ్‌కు మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేశారు. అయితే హైదరాబాద్ లోకల్ బాడీ ఎన్నికలు ముగిసే వరకు బాగానే ఉన్నట్లు కనిపించినప్పటికీ కొద్దిరోజులుగా రాజాసింగ్ స్వరం పెంచారు. ముఖ్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చిట్‌చాట్ అనంతరం జరిగిన పరిణామాల తర్వాత తెలంగాణ బీజేపీపై రాజాసింగ్ పలు వ్యాఖ్యలు చేస్తూ రెబల్‌గా మారే ప్రయత్నం చేశారు. పార్టీ లైన్ క్రాస్ చేసి ఎవరైనా మాట్లాడినా, పార్టీకి కట్టుబడి ఉండకపోతే వారిపై చర్యలు తప్పవని ఇటీవల హైకమాండ్, స్టేట్ పార్టీ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో దమ్ముంటే సస్పెండ్ చేయాల్సిందిగా సవాల్ విసురుతూ ఎమ్మెల్యే ప్రెస్‌నోట్ విడుదల చేశారు. ఈ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్న హైకమాండ్.. ఏ క్షణమైనా రాజాసింగ్‌కు షోకాజ్ నోటీసులు ఇవ్వడం లేదా, పార్టీ నుంచి సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

హైదరాబాద్ : హైడ్రా ప్రజావాణికి సోమవారం 23 ఫిర్యాదులు రాగా, ఇందులో 70 శాతం వరకు నాలాల సమస్యలపైనే వచ్చాయి. కంప్లయింట్స్?ను అడిషనల్ కమిషనర్ పాపయ్య స్వీకరించారు. సికింద్రాబాద్, తిరుమలగిరి, భూదేవినగర్‌లోని సాయిదత్తా గార్డెన్స్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఉద్దేశించిన 225 గజాల స్థలం కబ్జా అయ్యిందని స్థానికులు ఫిర్యాదు చేశారు. 2004లోనే బల్దియాకు ఆ స్థలాన్ని ఇచ్చి కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరినా.. ఫలితం లేదన్నారు. శేరిలింగంపల్లి మండలంలోని ఖానామెట్ విలేజ్‌లో 11/20, 11/21 సర్వే నంబర్లలో 1983లో గురుకుల ట్రస్ట్?లేఅవుట్ వేశారు. అందులోని ప్లాట్లతో పాటు రోడ్లు కబ్జాకు గురయ్యాయని స్థానికులు ఫిర్యాదు చేశారు.

**నాలాల కబ్జాలపై..** బేగంపేటలోని చికోటి గార్డెన్స్ ప్రాంతంలో నాలా కుంచించుకుపోవడంతో బృందావన్ అపార్టుమెంట్‌లోకి వరద వచ్చి చేరుతోందని, 2020లో వరదలకు సెల్లార్ నీట మునిగిందని, ఇలా వర్షాకాలం వచ్చిందంటే ఇబ్బందులు పడుతున్నామని అపార్టుమెంటు వాసులు ఫిర్యాదు చేశారు. అలాగే, కూకట్‌పల్లి లోని రంగధాముని చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణలతో పాటు ఈ చెరువు నుంచి ఐడీఎల్ చెరువుకు వెళ్లే నాలా కూడా కబ్జాకు గురైందని స్థానికులు కంప్లయింట్ చేశారు. భారీ వర్షాలు పడితే ఏడు కాలనీలకు వరద ముప్పు పొంచి ఉంటోందని వాపోయారు. ఆక్రమణలు తొలగించి వరద సాఫీగా వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. హస్మత్‌పేట నాలా–, పికెట్ నాలాలు కుంచించుకుపోవడంతో బేగంపేట పరిసరాల్లో పాయిగా కాలనీ, విమాన్ నగర్, బీహెచ్ ఈఎల్ కాలనీ, అవంతి కాలనీ, రసూల్‌పురా బస్తీ వరదలో చిక్కుకుంటున్నాయని ఫిర్యాదు వచ్చింది. సైదాబాద్, బాలాజీనగర్‌లో మురుగు, వరద కాలువలు కబ్జాకు గురయ్యాయని బాలాజీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా దృష్టికి తెచ్చారు.

ఓవైసీ దవాఖాన వద్ద చెరువు నిండితే వరద ఆదర్శనగర్ మీదుగా సరూర్‌నగర్ చెరువుకు చేరాల్సి ఉండగా.. వరద కాలువ కుంచించుకుపోవడంతో బస్తీలు నీట మునుగుతున్నాయని పేర్కొన్నారు.



చురకలు



# మారిషస్ దీవిలో తెలుగు దివ్వె సర్ అనిరుధ్ జగన్నాథ్



ప్రపంచ దేశాలలో తెలుగు కుటుంబాల మూలాలుగల అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన వారు ఎందరో ఉన్నారు. ఆంధ్రావని నుండి వలస వెళ్ళి, పలు దేశాలలో రాజకీయాలలో రాణిస్తూ వివిధ పదవులు పొందిన, పొందుతున్న వారెందరో ఉన్నారు. అయితే ఒక దేశ రాజకీయాలను ప్రభావితం చేసి, రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగి, ఆ దేశ సర్వోన్నత అధ్యక్ష పదవి పొందడం సామాన్య విషయం కానేకాదు. అలాంటి నేపద్యం కలిగిన మహోన్నత వ్యక్తి అనిరుధ్ జగన్నాథ్. మారిషస్ దేశానికి పదేళ్ళపాటు అధ్యక్షుడుగా, పద్దెనిమిదేళ్ళ పాటు ప్రధాన మంత్రిగాను పనిచేసిన అరుదైన, అపూర్వమైన, అనితర సాధ్యమైన ఘనత సర్ అనిరుధ్ జగన్నాథ్ కే దక్కింది. మారిషసు ఆఫ్రికా ఆగ్నేయ తీరంలో 2,000 కి.మీ (1,200 మై) దూరంలో ఉంది. 19 ళీ 58.8 'నుండి 20 ళీ 31.7' దక్షిణ అక్షాంశం, 57 ళీ 18.0 'నుండి 57 ళీ 46.5' తూర్పు రేఖాంశం మధ్య ఉంటుంది. ఇది 65 కి.మీ(40 మై) పొడవు, 45 కి.మీ (30 మై) వెడల్పు ఉంటుంది. ప్రారంభంలో డచ్చి కాలనీ (1630–1710) తరువాత ఫ్రెంచి కాలనీ (1715–1810)గా ఉండి తరువాత బ్రిటిషు కాలనీగా మారి 1968 వరకు బ్రిటిషు ఆధీనంలో ఉండి తరువాత స్వతంత్రం పొందింది. 1835లో బానిసత్వ నిర్మూలన నిర్ణయం జరిగాక, మారిషస్ సమాజం, ఆర్థిక వ్యవస్థ, ప్రజా జీవితాలపై ప్రభావం చూపాక, చాలామంది వ్యవసాయ కూలీలుగా, చెరుకు తోటలో పని చేసేందుకు మారిషస్ కు తీసుకెళ్ల బడినారు. 1834 –1921 మధ్య కాలంలో దాదాపు ఐదు లక్షల మంది ఇలా బ్రతుకు తెరువు కోసం వెళ్లారు. వారు చక్కెర ఎస్టేట్ లలో, కర్మాగారాలలో, రవాణా, నిర్మాణ రంగాలలో పని చేశారు. బ్రిటిష్ ప్రభుత్వానికి సేవలు చేసేందుకు, ఒప్పంద సేవకులుగా పని చేసేందుకు ప్రవేశించిన తొలి దేశం మారిషస్ కావడం గమనార్హం. అలా కుటుంబం 1850లో ఉత్తర ప్రదేశ్ లోని బల్లియా జిల్లాలోని రాస్డా పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని అతిల్పురా గ్రామానికి చెందిన కొందరు మారిషస్ ద్వీపానికి వ్యవసాయ కూలీలుగా వలస వెళ్ళారు. బ్రిటిష్ ప్రభుత్వం చెరకు సాగు కోసం ఓడ ద్వారా తీసుకెళ్లిన వారిలో విదేశీ యాదవ్ ఒకరు. విదేశీ యాదవ్ కార్మికుడి కుమారుడైన అనిరుధ్ జగన్నాథ్1930 మార్చ్ 29న ఒక యాదవ కుటుంబంలో జన్మించారు. అనిరుధ్ జగన్నాథ్ రాజకీయ జీవితం 1963లో ప్రారంభమైంది. తొలిసారిగా 1963లో లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు ఎన్నికయ్యారు. మారిషస్ స్వాతంత్ర్యానికి సంబంధించిన అంశాలపై చర్చించేందుకు లండన్ వేదికగా 1965లో జరిగిన రాజ్యాంగ సదస్సులో ఆయన పాల్గొన్నారు. 1968లో బ్రిటిషు ఆధీనంనుండి విముక్తి కలిగి స్వతంత్ర దేశంగా గుర్తింపు పొందింది. అనిరుధ్ మిలిటెంట్ సోషలిస్ట్ మూవెంట్ పార్టీని స్థాపించి, మారిషస్ రాజకీయాలలో సుస్థిర స్థానం ఏర్పరచు కున్నారు. మారిషస్ రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగి, ఆధునిక మారిషస్ నిర్మాతగా చరిత్రకెక్కారు. అనిరుద్ 1982 నుంచి 2017 మధ్య ఆరుసార్లు మారిషస్ ప్రధాని పదవిని చేపట్టారు. తొలిసారి 1985 నుంచి 1995, తర్వాత 2000 నుంచి 2003, 2014 నుంచి 2017 వరకు ప్రధానిగా ఉన్నారు. 2003 నుంచి 2012 వరకు అధ్యక్షుడిగా పనిచేశారు. 2017లో కుమారుడు ప్రవింద్‌కు మార్గం సుగమం చేస్తూ ఆయన పదవి నుంచి తప్పుకొన్నారు. అలా ప్రస్తుత మారిషస్ ప్రధాని ప్రవీంద్ కుమార్ అనిరుధ్ జగన్నాథ్ కుమారుడే కావడం గమనార్హం. మారిషసు ప్రజలలో బహుళ సంప్రదాయాలు, బహుళ మతాలు, బహుళ సంస్కృతులు, బహుళ భాషలకు చెందిన ప్రజలు ఉన్నారు. ద్వీప దేశ ప్రభుత్వం వెస్టు మినిస్టరు పార్లమెంటరీ సిస్టం విధానంలో రూపొందించ బడింది. అక్కడ ఉన్న 12.5 లక్షలకు పైగా జనాభాలో లక్ష మందికి పైగా తెలుగువాళ్లు ఉంటారు. అనిరుధ్ జగన్నాథ్‌కు తమ పూర్వీకుల జన్మభూమి అయిన భారత దేశమంటే అమితమైన ప్రేమాభిమానాలుండేవి. భారత్ – మారిషస్ దేశాల మైత్రీ బంధానికి ఆయన బంగారు బాటలు వేశారు. అనిరుధ్ జగన్నాథ్ నాయకత్వంలో మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు 1980 డిసెంబర్ 10వ తేది నుంచి 13వ తేది వరకు మారిషస్?లోని మోకా నగరంలో మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూటులో ఘనంగా జరిగాయి. ఆశించిన రీతిలో ఆనాడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహాసభలకు సరిగా సహకరించ కున్నా, చేయూత అందించక పోయినా, మారిషస్ ప్రభుత్వమే మొత్తం బరువు బాధ్యతలను తలకెత్తుకుని అపూర్వంగా ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించడానికి కారకుడు అనిరుధ్ జగన్నాథ్. మారిషస్?లో ఏటా జరిగే తెలుగు పండుగలకు, ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవాలకు, జాతీయ నాటికల పోటీలకు స్వయంగా హాజరయ్యేవారు. 1981లో మారిషస్ తెలుగు కల్చరల్ ట్రస్టును ఏర్పాటు చేశారు. తెలుగు భవనం నిర్మించడానికి పది ఎకరాల స్థలం కేటాయించారు. భగవాన్ శ్రీ సత్య సాయిబాబా భక్తుడైన జగన్నాథ్ చాలాసార్లు పుట్టపర్తి వచ్చి వెళ్ళారు. ఆయన నేత్ర చికిత్సకు హైదరాబాద్? లోని ఎల్.వి.ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూటును ఎంపిక చేసుకోవడం విశేషం.

భారత ప్రభుత్వం ఆయనకు పద్మ విభూషణ్ పురస్కారాన్ని అందజేసి, భారత సంతతికి చెందిన ఒక విదేశీ నేతను గౌరవించింది. మారిషస్ దేశానికి పదేళ్ళపాటు అధ్యక్షుడుగా, పద్దెనిమిదేళ్ల పాటు ప్రధాన మంత్రిగా పనిచేసిన సర్ అనిరుధ్ జగన్నాథ్ 2021 జూన్ 3న తమ 91వ ఏట పరమ పదించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**




అమరావతి : సినిమా మేకింగ్‌కు ఓ కష్టం. రిలీజ్ చేయాలంటే ఎన్నో అవస్థలు. తీరా విడుదల తర్వాత బాక్సాఫీస్ దగ్గర సీన్ సితార అవుతుంది. ప్రొడ్యూసర్ నష్టపోతున్నారు. డిస్ట్రిబ్యూటర్స్ రోడ్డుక్కుతున్నారు. ఇలా టాలీవుడ్ ఇండస్ట్రీలో చాలా సమస్యలు ఉన్నాయ్. అన్నీ సాల్వ్ చేసుకోవాలని ఫిక్స్ అయిపోయారట స్టార్ హీరోలు. పెద్ద హీరోలు సంవత్సరానికి ఒక్క సినిమా కూడా చేయకపోవడం, షూటింగ్‌లలో జాప్యం, భారీ రెమ్యూనరేషన్ డిమాండ్‌లు వంటి అంశాలు నిర్మాతలకు, డిస్ట్రిబ్యూటర్లకు తలనొప్పిగా మారాయట. ఈ నేపథ్యంలో టాలీవుడ్ స్టార్ హీరోలందరూ ఒకే వేదిక మీదకు రాబోతున్నారట. టాలీవుడ్ స్టార్ హీరోలు మీటింగ్‌కు, ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నాయకత్వం వహరిస్తారట. స్టార్ హీరోలంతా ఏడాదికి కనీసం రెండు సినిమాలు చేయాలని, ఒక్కొక్కరూ తమ ప్రాజెక్ట్‌లను స్పీడప్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. అంతేకాదు భారీ రెమ్యూనరేషన్‌లకు బదులు ప్రాఫిట్ షేరింగ్ పద్ధతిలో పనిచేయాలని, దీంతో ప్రొడ్యూసర్లకు ఆర్థిక భారం తగ్గడమే కాక, సినిమాల నాణ్యతపై నా హీరోలు బాధ్యత తీసుకునే అవకాశం ఉంటుందని ఆలోచిస్తున్నారట. స్టార్ హీరోలు ఒకే వేదికపైకి వస్తే చాలా ప్రాబ్లమ్స్ పరిష్కారం అవుతాయని అనుకుంటున్నారట. హీరోలు, ప్రొడ్యూసర్ల ప్రాబ్లమ్స్ సాల్వ్ అయితే టాలీవుడ్‌లో కొత్త ఉత్సాహం వస్తుందని, మరిన్ని లోబడ్జెట్ మూవీస్‌కు అవకాశాలు పెరుగుతాయని అంటున్నారు. ఈ విషయంపై చర్చించేందుకు త్వరలోనే టాలీవుడ్ స్టార్ హీరోలంతా ఒక కీలక సమావేశానికి హాజరకాబోతున్నారని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ మీటింగ్‌ను పవన్ కల్యాణ్ లీడ్ చేస్తారని అంటున్నారు. సినిమా ఇండస్ట్రీ పట్ల ఆయన చూపిస్తున్న చొరవ, ఆలోచనలు ఈ సమావేశానికి ఊపు తెస్తాయని టాక్. ఇందులో చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్, బాలకృష్ణ వంటి సీనియర్ స్టార్స్‌తో పాటు, యంగ్ హీరోలు కూడా పాల్గొనే అవకాశం ఉందని అంటున్నారు. ఈ ప్లాన్ వర్కౌట్ అయితే టాలీవుడ్‌లో కొత్త ఒరవడి సృష్టించే అవకాశం ఉంది. మరి ఈ మీటింగ్ ఎప్పుడు, ఎక్కడ జరుగుతుంది.? హీరోలంతా ఈ ప్రతిపాదనలను ఒప్పుకుంటారా? అనేది చూడాలి.




# తెనాలిలో వైఎస్ జగన్ పర్యటనపై నిరసనలు

గుంటూరు: గుంటూరు జిల్లా తెనాలిలో మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇవాళ(మంగళవారం) పర్యటిస్తున్నారు. జగన్ పర్యటన కోసం స్థానిక కేడర్ అన్ని ఏర్పాట్లు చేసింది. అయితే జగన్‌కు మాత్రం నిరసనల రూపంలో ఊహించని షాక్ తగిలింది. జగన్ పర్యటనను వ్యతిరేకిస్తూ దళిత, ప్రజాసంఘాలు రాస్తారోకో నిర్వహించాయి. తెనాలి మార్కెట్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ఆందోళన చేపట్టారు. వైసీపీ హయాంలో హత్యకు గురైన నూతక్కి కిరణ్‌ను జగన్ పరామర్శించలేదని... రౌడీషీటర్లకు మద్దతుగా నిలవడం దారుణమంటూ దళిత, ప్రజాసంఘాలు నినాదాలు చేశాయి. తెనాలిలో జగన్‌కు నిరసనల సెగ తగలడంతో వైసీపీ నేతలు డైలామాలో పడ్డారు. అలాగే ఐతానగర్ సెంటర్‌లో జగన్‌ను ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. జగన్ గో బ్యాక్ అంటూ ఆందోళనకారులు నినాదాలు చేశారు. తెనాలిలో ఎర్ర బడి వద్ద జగన్ కాన్వాయ్‌ను ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నేతలు అడ్డుకున్నారు. దళితులపై ఇప్పుడు ప్రేమ పుట్టుకొచ్చిందా అంటూ నిరసన వ్యక్తం చేశారు. హత్యలు చేసిన వారిని, రౌడీషీట్లు ఉన్నవారిని, పోలీసులను కొట్టిన వారిని జగన్మోహన్‌రెడ్డి ఎలా పరామర్శిస్తారని ఎమ్మార్పీఎస్ నేతలు నిలదీశారు. నల్ల బెలూన్లు ఎగురవేసి నిరసన తెలిపారు. అయితే రోడ్డు మీదకు వస్తున్న దళిత సంఘాలను పోలీసులు అడ్డుకున్నారు. తెనాలిలో భారీగా పోలీసులు మోహరించారు. దీంతో తెనాలిలో హై టెన్షన్ వాతావరణం నెలకొంది.

# ఎస్-400: రష్యాలో వైఫల్యం.. భారత్ లో విజయం ఎందుకంటే..?



రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్లతో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... రష్యాలోని వైమానిక స్థావరాలే లక్ష్యంగా ఉక్రెయిన్ తన డ్రోన్ లతో పెద్ద ఎత్తున దాడులకు తెగబడింది. ఈ క్రమంలో.. దాదాపు 41 యుద్ధ విమానాలు ధ్వంసమయ్యాయి. ఈ సమయంలో.. రష్యా భూభాగంలోకి చొచ్చుకెళ్లి నిర్వహించారంటూ డ్రోన్ దాడిని జెలెన్ స్కీ కొనియాడారు. ఈ సమయంలో ఎస్–400 క్షిపణిపై చర్చ తెరపైకి వచ్చింది. అవును... రష్యా ఎస్–400 క్షిపణి వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత అధునతన గగనతల రక్షణ వ్యవస్థలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ప్రధానంగా ఆపరేషన్ సిందూర్ అనంతరం ఈ క్షిపణి వ్యవస్థ గురించిన చర్చ మరింత ఎక్కువగా జరిగింది. ఈ వ్యవస్థ.. విమానం, క్షిపణులు, డ్రోన్లు వంటి వైమానిక దాడులను అడ్డుకోగలదు. ఆపరేషన్ సిందూర్ లో పాకిస్థాన్ డ్రోన్ లు, క్షిపణులను దీని సాయంతో భారత్ సక్సెస్ ఫుల్ గా తిప్పికొట్టింది. అయితే... తాజాగా ఉక్రెయిన్ డ్రోన్లు ఆ స్థాయిలో తమపై విరుచుకుపడుతుంటే రష్యా ఎందుకు వాటిని ఆపలేకపోయింది? అనేది పెద్ద ప్రశ్నగా ఉంది. ఈ సమయంలో రష్యాలోని ఎస్–400 వైఫల్యానికి పలు కారణాలున్నాయని అంటున్నారు నిపుణులు. ఇందులో భాగంగా... రష్యా రెగ్యులర్ గా స్వల్ప శ్రేణి వైమానిక రక్షణ వ్యవస్థల సపోర్ట్ లేకుండా ఎస్–400 ను ఒంటరిగా మోహరించిందని.. దీనివల్ల డ్రోన్లు వంటి తక్కువ ఎత్తులో ఎగురుతున్న లక్ష్యాలను అడ్డగించడం కష్టమైందని చెబుతున్నారు. ఇదే సమయంలో.. ఎస్–400ను నాశనం చేయడానికి ఉక్రెయిన్ సంక్లిష్టమైన వ్యూహాన్ని అనుసరించిందని.. ఇందులో భాగంగా వారు మొదట డ్రోన్ యొక్క రాడార్, యాంటెన్నాను లక్ష్యంగా చేసుకుంటారని.. అనంతరం, క్షిపణులతో దాడి చేస్తారని చెబుతున్నారు.

ఈ విధానంవల్ల రష్యా రక్షణ వ్యవస్థలను చొచ్చుకునిపోవడంలో సక్సెస్ అయ్యిందని చెబుతున్నారు. ఇదే సమయంలో ఎలక్ట్రానిక్ వార్ ఫేర్ పద్ధతులను ఉపయోగించి ఎస్–400 రాడార్ సిగ్నల్స్ ను ఉక్రెయిన్ జామ్ చేసిందని అంటున్నారు. దీనివల్ల రక్షణ వ్యవస్థ ఈ లక్ష్యాలను ట్రాక్ చేయలేకపోయిందని చెబుతున్నారు. అదేవిధంగా.. భారత్ చేసినట్లుగా రష్యా ఎస్–400 ను రక్షించడానికి తరచూ తరలించడం లేదా నకిలీ వ్యవస్థలను ముందు పెట్టడం వంటి చర్యలు తీసుకోలేదని.. ఈ నిర్లక్ష్యాన్ని ఉక్రెయిన్ సద్వినియోగం చేసుకుందని అంటున్నారు. ఈ సందర్భంగా స్పందించిన నిపుణులు... ఎస్–400 ఇప్పటికీ శక్తివంతమైన వ్యవస్థ అని.. విమానాలు, క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణులను అడ్డగించగలదని చెబుతున్నారు. అయితే.. దీన్ని సమర్థవంతంగా చేయడానికి సరైన మద్దతు వ్యవస్థలతో పాటు వ్యూహం అవసరమని అంటున్నారు. ఈ విషయంలో రష్యా బలహీనతలు ఉక్రెయిన్ సద్వినియోగం చేసుకోగా.. భారత్ మాత్రం ఎస్–400 ని పక్కా వ్యూహాలతో ఉపయోగించుకుందని చెబుతున్నారు.

# కొలెస్ట్రాల్, బీపీ, షుగర్ కంట్రోల్.. జపాన్ 'వాకింగ్' పద్ధతితో అదిరే ఫలితాలు!

నడవడం అంటే మనం రోజూ చేసేదే కదా? మన ఫోన్లలో ఉండే హెల్త్ యాప్స్ కూడా రోజుకు 10 వేల అడుగులు నడవండి అని చెబుతుంటాయి. కానీ, జపాన్ శాస్త్రవేత్తలు ఈ మామూలు నడకను ఒక కొత్త పద్ధతిగా మార్చారు. ఇప్పుడు ఈ పద్ధతి ప్రస్తుతం ప్రపంచమంతా ఫేమస్ అవుతోంది. దీని పేరు ఇంటర్వెల్ వాకింగ్ ట్రైనింగ్. దీని వల్ల చాలా మంచి లాభాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గడానికి గంటల తరబడి ట్రెడ్‌మిల్‌పై పరుగెత్తాల్సిన పనిలేదు. ఈ IWT పద్ధతిలో మనం కొద్దిసేపు వేగంగా, కొద్దిసేపు నెమ్మదిగా నడవాలి. జపాన్‌కు చెందిన డాక్టర్ హిరోషి నోస్ అనే శాస్త్రవేత్త దీన్ని కనిపెట్టారు. ఈ పద్ధతిలో మూడు నిమిషాలు వేగంగా నడవాలి (మీరు మాట్లాడలేనంత వేగంగా). ఆ తర్వాత మూడు



నిమిషాలు నెమ్మదిగా నడవాలి (మామూలుగా మాట్లాడగలిగేంత వేగంగా). ఇలా 30 నిమిషాల పాటు మొత్తం ఐదు సార్లు చేయాలి. దీని వల్ల మీ గుండె బలంగా మారుతుంది.

కాళ్లు గట్టిపడతాయి. ఇంకా మీరు చిన్నవాళ్లు అయినట్లు కూడా అనిపిస్తుందని చెబుతున్నారు. మామూలుగా గంటల తరబడి నెమ్మదిగా నడిచేదాని కంటే, ఈ IWT పద్ధతి మన శరీరాన్ని చాలా చురుకుగా ఉంచుతుంది. మీ శరీరం కొవ్వును బాగా కరిగించుకుంటుంది. ఇంకా గుండె ఆరోగ్యం కూడా బాగా మెరుగుపడుతుంది.

**జపాన్‌లో పరిశోధనలు ఏం చెబుతున్నాయి?....** జపాన్‌లో శాస్త్రవేత్తలు ఈ నడక పద్ధతిపై కొన్ని పరిశోధనలు చేశారు. ఈ పద్ధతిని వారానికి నాలుగు సార్లు, మూడు నెలల పాటు పాటించిన వారిలో చాలా మంచి మార్పులు కనిపించాయి. కొలెస్ట్రాల్, బీపీ (రక్తపోటు), షుగర్ (రక్తంలో చక్కెర) స్థాయిలు తగ్గాయి. కండరాలు బలంగా మారాయి. బరువు తగ్గారు. నిరాశ (డిప్రెషన్) కూడా తగ్గింది. ఈ వాకింగ్ పద్ధతిని మీరు ఇంట్లో, తోటలో, టెర్రస్‌పై, లేదా పార్కులో ఎక్కడైనా చేయొచ్చు. పెద్దవాళ్లు, చిన్నవాళ్లు, ఇంకా వ్యాయామం కొత్తగా మొదలుపెట్టేవాళ్లు కూడా దీన్ని సులభంగా చేయవచ్చు.

**కేవలం నడకతోనే ఆరోగ్యం...** ఖరీదైన జిమ్‌లకు వెళ్లాల్సిన పనిలేదు, ప్రత్యేక పరికరాలు అవసరం లేదు. మీకు కావాల్సిందల్లా కేవలం 30 నిమిషాలు, ఒక మంచి జత బూట్లు, ఇంకా ఆరోగ్యంగా ఉండాలనే కోరిక ఉంటే చాలు. కాబట్టి, మీరు తదుపరిసారి వ్యాయామం చేయకూడదని అనుకుంటే.. ఈ 'జపనీస్ వాకింగ్' పద్ధతిని పాటించవచ్చు. ఇది మిమ్మల్ని ఎక్కువ కాలం ఆరోగ్యంగా, బలంగా, ఇంకా చురుగ్గా ఉంచుతుంది.

# పాక్ గొంతు ఎండుతోంది... షాకింగ్ గా ఐఆర్ఎస్ఏ లెక్కలు!

పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఆపరేషన్ సిందూర్ సైనిక చర్యకంటే ముందు భారత్ పలు దౌత్యపరమైన సంచలన నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... భారత్ – పాక్ మధ్య అత్యంత కీలకమైన సింధూ నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేసింది. ఈ క్రమంలో తాజాగా పెరుగుతోన్న వేడి నేపథ్యంలో పాక్ గొంతు ఎండుతోందని అంటున్నారు. అవును... సింధు, జీలం, చీనాబ్ లతో కూడిన సింధు నదీ వ్యవస్థలో నీటి కొరత తీవ్రంగా ఉన్నందున పాకిస్థాన్ లోని పంజాబ్ ప్రావిన్స్ కఠినమైన ఖరీఫ్ సీజన్ ఎదుర్కొంటోందని అంటున్నారు! ఇప్పటికే ఇస్లామాబాద్ తన రెండు ముఖ్య ప్రాంతాలైన సింధు నదిపై తర్బెలా, జీలం నదిపై మంగ్లాలో నీరు తగ్గిపోతోందని అంటున్నారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారతదేశం సరఫరాలో స్వల్ప తగ్గుదల తర్వాత చీనాబ్ నది ఇన్ ఫ్లో లో ఆకస్మిక తగ్గుదల కలిగిందని చెబుతున్నారు. తాజాగా పాకిస్థాన్



ప్రభుత్వం విడుదల చేసిన డేటా ప్రకారం.. పాకిస్థాన్ పంజాబ్ ప్రావిన్స్ లోపల సింధూ నదీ వ్యవస్థలో నీటి లభ్యత 2025 జూన్ 2 నాటికి.. 2024తో పోలిస్తే 10.3 శాతం తగ్గింది. పైగా ఇంకా నైరుతి రుతుపవనాల ప్రారంభానికి ఇంకా కనీసం నాలుగు వారాల సమయం ఉన్నందున రాబోయే రోజుల్లో ఈ పరిస్థితి మరింత దిగజారొచ్చని చెబుతున్నారు. ఇదే సమయంలో.. పాక్ లోపల సింధు నదీ వ్యవస్థలో నీటి పంపిణీని నిర్వహించడానికి నియంత్రణ సంస్థగా ఉన్న ఇస్లామాబాద్ లోని ఇండస్ రివర్ సిస్టమ్ అథారిటీ (ఐఆర్ఎస్ఏ) స్పందించింది. దాని లెక్కల ప్రకారం.. పంజాబ్ ప్రావిన్స్ లో 2024 జూన్ నాటికి నీటి లభ్యత 1,43,600 క్యూసెక్కులు కాగా.. ఈ ఏడాది జూన్ 2 నాటికి దక్కిన మొత్తం నీటి లభ్యత 1,28,800 క్యూసెక్కులు మాత్రమే. అంటే.. గత ఏడాది ఇదే నెలలో అందుబాటులో ఉన్న నీటికంటే ఇది 14,800 క్యూసెక్కులు తక్కువన్నమాట.

ఈ నేపథ్యంలో ఖరీఫ్ లో విత్తనాలు వేసే సీజన్ ప్రారంభమైనందున, జూన్ చివరి వరకూ నైరుతి రుతుపవనాలు పంజాబ్ ప్రావిన్స్ కు చేరుకునే అవకాశం లేనందున.. తీవ్రమైన వేది వాతావరణం మధ్య నీటిపారుదల సమస్యలు తీవ్రంగా తలెత్తుతున్నాయని అంటున్నారు. దీంతో.. పాక్ రైతు గొంతు ఎండుతుందని అంటున్నారు.

చురకలు

## సంపాదకీయం

# భారత్ చేతిలో చైనా పిలక... మాకూ ఇవ్వమంటున్న 7 దేశాలు!


పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్ లోని ఉగ్రశిబిరాలపై భారత్ సైన్యం ఆపరేషన్ సిందూరు పేరుతో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. అనంతరం పాక్ సైనిక శిబిరాలపైనా భారత్ దాడి చేసింది. ఫలితంగా అటు ఉగ్రవాదులకు, ఇటు వారిని పెంచి పోషితోన్న పాకిస్థాన్ కు ఊహించని దెబ్బ కొట్టింది. ఆ విధంగా ఆపరేషన్ సిందూర్ విజయవంతమైంది. అయితే.. ఈ ఆపరేషన్ సందర్భంగా జరిగిన నాలుగు రోజుల యుద్ధంలో పాకిస్థాన్ ఏ పరిస్థితుల్లోనూ పైచేయి సాధించలేకపోయింది. ప్రధాని మోడీ చెప్పినట్లు ప్రతీ రౌండ్ లోనూ భారత్ గెలిచింది. ఆ సమయంలో చైనా నుంచి తెచ్చుకున్న పీఎల్-15ఈ క్షిపణికి పాకిస్థాన్ జే-10సి, జే-ఎఫ్17 జెట్స్ ద్వారా భారత్ పైకి ప్రయోగించింది. అయితే భారత్ తన దుర్భేధ్యమైన గగనతల రక్షణ వ్యవస్థతో వాటిని విజయవంతంగా కూల్చేసింది. ఈ క్రమంలో వీటికి సంబంధించిన ఓ క్షిపణి పంజాబ్లోని హోషియార్ పూర్ జిల్లాలో గల కమాహీ దేవి గ్రామం సమీపంలో పడిపోయాయి. వాటిని సైన్యం తీసుకుంది. ఈ సందర్భంగా చైనా పిలక భారత్ చేతికి చిక్కిందనే చర్చ మొదలైంది! అవును... ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ పైకి చైనా నుంచి తెచ్చుకున్న క్షిపణిని ప్రయోగించింది పాక్. ఈ క్రమంలో ఈ పీఎల్-15ఈ క్షిపణి శిథిలాలు భారత సైన్యానికి లభించాయి. ఈ నేపథ్యంలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇందులో భాగంగా... ఈ క్షిపణి శిథిలాలను పరిశీలించిన నిపుణులకు పలు కీలక విషయాలు తెలిశాయని అంటున్నారు. ఇదే సమయంలో... ఈ క్షిపణిలోని ముఖ్యభాగాలు, దాని ప్రొపల్షన్, ఇనర్షియల్ యూనిట్, డేటా లింక్, అడ్వాన్స్డ్ యక్టివ్ ఎలక్ట్రానికి స్కాన్ అండ్ అర్రే స్పీకర్ సహా పలు భాగాలు చెక్కుచెదరకుండా లభించాయని అంటున్నారు. ప్రస్తుతం వాటిని డీకోడ్ చేసే పనిలో ఉన్నారు. దీంతో.. చైనా మేడ్ క్షిపణి శిథిలాలు పలు ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించాయని అంటున్నారు. ఈ సమయంలో భారత్ తో పాటు మరో ఏడు దేశాలు కూడా ఈ క్షిపణికి సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని అంటున్నారు. ఇందులో భాగంగా... అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా తో పాటు జపాన్, దక్షిణ కొరియా కూడా ఈ విషయంలో ఆసక్తి చూపిస్తున్నాయని చెబుతున్నారు. ఈ విషయంలో తమ నిపుణులకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు.. చైనా క్షిపణుల శిధిలాలు భారత్ కి దొరకడంపై చైనా ఆందోళన చెందుతోందని తెలుస్తోంది. భారత రక్షణ శాస్త్రవేత్తలు వీటిని అధ్యయనం చేస్తుండటంపై ఆందోళన చెందుతుందని అంటున్నారు. ఈ సమయంలో.. పీఎల్-15ఈ క్షిపణిని రివర్స్ ఇంజినీరింగ్ చేసే అవకాశం ఉందనే టెన్షన్ ఇప్పుడు డ్రాగన్ కు విపరీతంగా పెరిగిందని చెబుతున్నారు.

# బూదరాజు రాధాకృష్ణ జీవితం.. తెలుగు భాషకు అంకితం - జూన్ 4...బూదరాజు రాధాకృష్ణ వర్ధంతి



తెలుగు భాషకు తన జీవనాన్ని అంకితంగా సమర్పించుకున్న వారు అరుదు. వారిలో బూదరాజు రాధాకృష్ణ ప్రముఖులు. వాక్ నిపుణత, వ్యాకరణ విలాసం, పదబంధాల పరిపుష్టతతో కూడిన ఆయన రచనలు పరిశుద్ధమైన భాషా సేవకు నిలువెత్తు నిదర్శనాలు. 'తెలుగు భాషా భక్తుడు' అనే పదం ఆయనకు అక్షరార్థంగా అంకితమవుతుంది. బూదరాజు రాధాకృష్ణ తెలుగు సాహితీ ప్రపంచంలో ఒక విశిష్టమైన వ్యక్తి. వారు కేవలం ఒక భాషా శాస్త్రవేత్తగానే కాకుండా, సీనియర్ పాత్రికేయులుగా, రచయితగా, అనువాదకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారు. తెలుగు భాషకు, పాత్రికేయ రంగానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవి తెలుగు సాహితీ సముద్రంలో ఎన్నో మాణిక్యాలు వెలుగుతూనే ఉన్నాయి. అటువంటి అమూల్య వెలుగులు ప్రసాదించిన మణి మాణిక్యాలలో ఒకరు బూదరాజు రాధాకృష్ణ. భాషపై అపారమైన ప్రేమ, పరిశోధనా దృక్పథం, పాత్రికేయ శ్రద్ధ, రచనా నైపుణ్యంఈ నాలుగు మణిపూసలతో ఆయన నిర్మించిన జీవన మార్గం తెలుగు భాషాభిమానులకు మార్గదర్శిగా నిలిచింది. బూదరాజు రాధాకృష్ణ 1932 మే 3న ప్రకాశం జిల్లా వేటపాలెం గ్రామంలో జన్మించారు. ప్రాథమిక విద్య చీరాలలో, ఉన్నత విద్య విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సాగింది. భాషపై ఆసక్తితో "Historical Grammar of Early Telugu Inscriptions" అనే విషయంపై 1965లో డాక్టరేట్ పొందారు. ఇది ఆంధ్ర విశ్వవిద్యాలయం అందించిన భాషా అధ్యయనానికి చెందిన అపూర్వ కీర్తిగా గుర్తించబడింది. చీరాల వి.ఆర్.ఎస్. కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా తన ఉపాధ్యాయ జీవితం ప్రారంభించిన రాధాకృష్ణ , తర్వాత తెలుగు అకాడమీలో డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. భాషా ప్రామాణికతకు తోడ్పడే అనేక పుస్తకాలను ఈ సమయంలో సమీకరించారు. 1988లో పదవీ విరమణ చేసిన తర్వాత కూడా ఆయన సేవా ధర్మం ముగిసి పోలేదుకావలసిన చోటా, అవసరమైన సమయంలో రచన ద్వారా ఆయన శబ్దజీవితమై మిగిలారు. పదవీ విరమణ అనంతరం "ఈనాడు" జర్నలిజం సంస్థలో ప్రాచార్యులుగా పదేళ్ల పాటు సేవలందించారు. ఎంతోమంది యువ పాత్రికేయులకు భాషా శాస్త్రం, రచనా వ్యాకరణం బోధించి, వారిని సామాజిక పరిణతితో కూడిన రచయితలుగా తీర్చిదిద్దారు. "పుణ్యభూమి" శీర్షికతో 'సి. ధర్మారావు' కలం పేరుతో వందలాది వ్యాసాలు రాసారు. భాషా విలువ, సంస్కృతి పరంపర, చరిత్ర సంక్రమణ, సమకాలీన సమీక్ష వంటి అనేక అంశాలు ఆయన వ్యాసాల్లో పదునైన పరిశీలనతో కూడుకున్నవి. ఈ వ్యాసాలు ప్రజలలో పాఠనాభిరుచి పెంచేలా, ఆలోచనలను పెంచేలా ఉండేవి. తెలుగు భాషా శాస్త్ర పరిశోధనకు బూదరాజు కృషి విలువైనదిగా గుర్తించబడింది. "వాస్తు పదకోశం", "వ్యవహార కోశం", "తెలుగు దినపత్రికల భాష" వంటి ప్రామాణిక రచనలు ఆయన మేధస్సుకు నిదర్శనాలు. నన్నయ పూర్వకాలపు శాసన భాషను అధ్యయనం చేసి, మాండలికాల వ్యాప్తిపై చేసిన విశ్లేషణ భాషా పరిశోధకులకు గొప్ప వనరుగా నిలిచింది. వ్యాకరణ నియమాలు, వినియోగ నిబంధనలు, భాషా అభివృద్ధిలో సమాజ పాత్ర వంటి అంశాలపై ఆయన వ్యాఖ్యానాలు అత్యంత విలువైనవిగా భావించ బడుతున్నాయి. రాధాకృష్ణ రచయితగా తెలుగుని ప్రభావవంతమైన భావ ప్రకటనకు ఒక పటిష్ఠమైన రూపకర్త. పాత్రికేయులకు మార్గదర్శకంగా "రచన రీతులు", "తెలుగుబడి" వంటి పుస్తకాలు రచించారు. మహాకవి శ్రీశ్రీ జీవితాన్ని ఆంగ్లంలో రచించి, స్వయంగా తెలుగులోకి అనువదించారు. "మరవరాని మాటలు" అనే గ్రంథంలో తెలుగు సాహిత్యంలోని అమూల్య సూక్తులను సంకలనం చేశారు. అంతేకాక, నోమ్ చాంస్కీ, కార్ల్ మార్క్స్, గుల్జార్ వంటి రచయితల రచనలను తెలుగులోకి అనువదించి భావానువాదానికి అర్థవంతమైన ప్రమాణాలు నెలకొల్పారు. జ్ఞానం, వినయం, మిత భాషణం, శ్రద్ధ అనే నాలుగు గుణాలతో ఆయన మానవీయత వెలిసింది. నుకల నారాయణ, కాళోజీ నారాయణరావు, న్యాపతి సుబ్బారావు వంటి ప్రముఖులతో ఉన్న సన్నిహిత సంబంధాలు ఆయన సమాజాభిముఖ దృక్పథానికి ప్రతీకలుగా నిలిచాయి. విశేషమైన విషయ పరిపక్వత, పదాలను నాణ్యంగా ఉపయోగించే నైపుణ్యం ఆయన రచనలకు స్ఫూర్తినిచ్చాయి. బూదరాజు రాధాకృష్ణ జీవితం తెలుగు భాషకు అంకితమై, పరిశోధనతో నిండి, శ్రద్ధతో నడిచిన ఆత్మసాక్షాత్కార యాత్ర. ఆయన రచనలు నేటికీ తెలుగు అధ్యాపకులకు, పాత్రికేయులకు, తర్జుమకారులకు మార్గదర్శిగా నిలుస్తున్నాయి. తెలుగు భాషే తన ముక్తిపథం అని నమ్మి జీవితాంతం అదే వైపు నడిచిన బూదరాజు రాధాకృష్ణ , సాహిత్యాన్ని మానవీకరించిన సాహితీ వేత్త గానే నిలిచారు. ఆయన రచనలు భాషానురాగులకు ఆదర్శంగా, పాత్రికేయులకు పాఠశాలలా నిలిచాయి. తెలుగు భాషా పట్ల ఆయన కలిగిన భక్తిసజీవంగా శబ్దంలో, వాక్యంలో, వ్యాసంలోఇప్పటికీ స్పందిస్తోంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర ఆరుద్ర - జూన్ 4... ఆరుద్ర వర్ధంతి



తెలుగు సాహిత్యంలో ఆరుద్రది ప్రత్యేక స్థానం. అపరాధ పరిశోధక నవలలనుంచి సమగ్ర ఆంధ్ర సాహిత్యం సంపుటాల వరకు ఆరుద్ర స్పృశించని సాహితీ శాఖ లేదంటే అతిశయోక్తి కాదేమో. కవిగా, రచయితగా, కథకునిగా, పరిశోధకునిగా, నాటక కర్తగా, విమర్శకునిగా ఆరుద్ర సాహితీ సేవనం అనితరసాధ్యం. నిరంతరం నవ్యత కోసం పరితపించిన నిత్య శోధనా సక్తులు ఆరుద్ర. శ్రీశ్రీ తర్వాత యువతరంపై ఎక్కువ ముద్ర పడిన కవిగా పేరు పొందిన ఆరుద్ర 'అభ్యుదయ రచయితల సంఘం' వ్యవస్థాపకుల్లో ఒకరు. తెలుగు సినిమా పాటకు ఓ కొత్త ఒరవడి సృష్టించిన ఆరుద్ర సంగీత దర్శకులిచ్చిన బాణీలకు అనుకూలంగా, సునాయాసంగా, సరళంగా పాటలు రాయగలిగారు. ఆరుద్ర అసలు పేరు భాగవతుల సదాశివ శంకర శాస్త్రి. 1925 ఆగస్టు 31న విశాఖ పట్టణంలో ఆరుద్రా నక్షత్రాన జన్మించిన ఆరుద్రపండిత వంశంలో పుట్టడం భూమికగా బాల్యం నుంచీ సాహిత్యంపై మక్కువ కలిగి, పట్టు చిక్కించు కున్నారు. తెలుగుతో పాటు అనేక భాషల్లోనూ పాండిత్యం సంపాదించారు. విశాఖపట్నం ఎ.వి.యన్. కాలేజీ ఉన్నత పాఠశాల లో, విజయనగరంలో యం.ఆర్.కళాశాలలో ఆరుద్ర విద్యాభ్యాసం చేశారు. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో చదువుకు స్వస్తి పలికి 1943-47 మధ్యకాలంలో రాయల్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్?లో గుమ్మస్తాగా పనిచేశారు. మద్రాస్ కు మకాం మార్చి, ఆనందవాణి అనే పత్రికకు రెండేళ్ళు సంపాదకునిగా పనిచేసారు. 1949 లో సినీరంగ ప్రవేశం చేసి, అనేక సినిమాలకు మాటలు, పాటలు వ్రాసారు. 1954 లో ప్రఖ్యాత రచయిత్రి అయిన రామలక్ష్మిని వివాహ మాడారు. చిత్తూరు నాగయ్య నటించిన 'బీదలపాట్లు' చిత్రంలో తొలిసారి ఆరుద్రకు సినీ పాటల రచనకు అవకాశం వచ్చింది. అందులో ఆయన రాసిన "ఓ చిలుకరాజా నీ పెళ్ళెపుడయ్యా%?%" పాట అలరించింది. ఆరుద్ర గురించి తెలిసిన ప్రఖ్యాత హిందీ నటులు రాజ్ కపూర్ తన 'ఆహ్' చిత్రాన్ని తెలుగులో డబ్బింగ్ చేస్తూ, ఆయననే రచయితగా ఎంచుకోగా, రాజ్ కపూర్ 'ప్రేమలేఖలు' తెలుగులోనూ మంచి ఆదరణ పొందింది. అందులో ఆరుద్ర పలికించిన పాటలన్నీ జనాన్ని మురిపించాయి. "పందిట్లో పెళ్ళవుతున్నాదీ%?% కనువింద వుతున్నాదీ%?%" పాట విశేషాదరణ పొందింది. నాటి రోజుల్లో పెళ్లి పందిళ్ళలో బాజా భజంత్రీల ద్వారా బాగా వినిపించేది. ఆరుద్ర వందలాదిగా గేయాలు, గేయ నాటికలు, కథలు, నవలలు, సాహిత్య పరిశోధక వ్యాసాలు, వ్యంగ వ్యాసాలు, పుస్తకాలకు పీఠికలు, పుస్తకాలపై విమర్శలు... ప్రధానంగా సినీ గీతాలు ఒక్కటేమిటి, సకల సాహితీ ప్రక్రియల్లో వైవిధ్య రచనల్లో సాటిలేని మేటి అనిపించు కున్నారు. త్వమేవాహం, సినీవాలి, కూనలమ్మ పదాలు, ఇంటింటి పద్యాలతో పాటు వెన్నెల - వేసవి, దక్షిణ వేదం, జైలు గీతాలు వంటి అనువాద రచనలు రాదారి బంగళా, శ్రీకృష్ణదేవరాయ, కాటమరాజు కథ వంటి అనేక రూపకాలుతో పాటు కథలనూ, నవలలనూ కూడా రాశారు. మేధస్సునే కాక, ఆరోగ్యాన్ని కూడా ఫణంగా పెట్టి రచించిన సమగ్ర ఆంధ్ర సాహిత్యం ( 14 సంపు టాలు) ఆరుద్ర పరిశోధనా దృష్టికి పరాకాష్ఠ. వేమన వేదం, మన వేమన, వ్యాస పీఠం, గురజాడ గురుపీఠం, ప్రజాకళలో ప్రగతి వాదులు వంటివి ఆరుద్ర సాహిత్య విమర్శనా గ్రంథాలు. రాముడికి సీత ఏమౌతుంది?, గుడిలో సెక్స్ వంటి రచనలు ఆరుద్ర పరిశీలనా దృష్టికి నిదర్శనాలు. సంగీతం పైనా, నాట్యం, ఇతర కళలపై సాధికారికంగా రచించిన వ్యాసాలు, చదరంగం అంశాన్ని దశాబ్దాలకు పూర్వమే ఒక గ్రంథస్థం చేయడం ఆరుద్రలోని ప్రత్యేకతకు నిదర్శనం. అంతేకాదు, ఆరుద్ర క్లబ్ పాటలు కూడా విశేష సినీ ప్రేక్షకుల ఆదరణకు పాత్రాలు అయినాయి. %?%మ్ము మ్ము మ్ము ముద్దంటే చేదా ఇపుడా ఉద్దేశం లేదా?, తీస్కో కోకాకోలా ఏస్కో రమ్ము సారాబీ మసక మసక చీకటిలో మల్లెతోట వెనకాలబీ మొదటి పెగ్గులో మజా - వేడి ముద్దులో నిషా లాంటి పాటలెన్నో ఆరుద్రనే రాశారా అన్న అనుమానం కలిగేలా చేశాయి. తెలంగాణ పోరాట ఇతివృత్తం నేపథ్యంలో రాసిన త్వమేవాహం క చదివి ఇక నేను పద్యాలు రాయక పోయినా పరవాలేదు అని మహాకవి శ్రీశ్రీ ప్రశంస పొందిన ఆరుద్ర...ఇతను 'ఆరుద్ర' కాదు, 'ఆరో రుద్రుడు' అని శ్రీశ్రీ చేత శ్లాఘించ బడిన గొప్ప వ్యక్తి ఆయన. తెలుగు సాహితీ పుస్తకంలో చెరగని సంతకం చేసిన ఆరుద్ర... మహాకవి శ్రీశ్రీకి మేనల్లుడు, ప్రఖ్యాత తెలుగు రచయిత్రి కె.రామలక్ష్మికి పతి దేవుడు. 1998 జూన్ 4న ఆరుద్ర ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతోనే బాల్యానికి స్వేచ్ఛ - జూన్ 4... అంతర్జాతీయ పీడిత బాలల దినోత్సవం.




ఇష్టం లేని పనిని వివిధ కారణాల వల్ల బలవంతంగా చేయిస్తూ శ్రమ దోపిడీకి గురి చేయడమే బానిసత్వం. పిల్లలవద్ద బలవంతంగా పని చేయించుకోవడం, బలవంతపు పెళ్ళిళ్ళు, ఇళ్ళల్లో వెట్టి చాకిరి, వ్యవసాయ కూలీలు, పిల్లలను అమ్మడం, ఇటుక బట్టీలు, బలవంతపు పడుపు వృత్తి, పిల్లల అక్రమ రవాణా లాంటి వివిధ రూపాలలో బానిసత్వం కనిపిస్తున్నది. భయ పెట్టీ, హింసించి, మోసగించి, బెదిరించి, వివిధ రకాలుగా శ్రమ దోపిడీ జరగడం అనునిత్యం జరుగుతున్నదే. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి జరిగితే తప్ప పరిష్కారం లేదని విజ్ఞుల భావన. ప్రభుత్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విధి లేక బాలకార్మికులు గానే ఉండి పోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవి ఉన్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరికొందరు బాలలు తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారమయం చేసుకుంటున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడివడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్థోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హొటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. వ్యవసాయ పను లకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధ రంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులను సైతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించు కుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధాకరం. యజమానులు చెప్పిందే చట్టంగా, వారు చేసేదే సంక్షేమంగా పరిస్థితులున్నా కార్మికశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ - ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగం లోని 24వ నిబంధన స్పష్టం చేస్తున్నా అది కాగితాలకే పరిమితమవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసి పిల్లల బంగారు కలలు చెదిరి పోతున్నాయి. పాలబుగ్గల లేత వయసులో వారు కార్మికులుగా మారడం బాధాకరం. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పిల్లల చేత పని చేయించుకునే యాజమాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసే చోట తగిన రీతిలో భద్రతా సౌకర్యాలను కల్పించక పోవడం ఆక్షేపణీయం. ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగజేస్తున్నది. 28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించు కోవడం అపరా ధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాల లోపు పిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాదకరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధించింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని, శక్తికి మించిన పనులలో నియమించ రాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియ మించడం నిషేధించాలని రాజ్యాంగం ఆదేశించింది. 1959 నవంబర్ 20న బాలల హక్కుల ప్రకటనను ఐరాస సర్వసభ్య సభ రూపొందించిన సందర్భంగా బాలల దినోత్సవాన్ని ప్రపంచ మంతటా జరుపుకోవాలని నిర్ణయించారు. 1989లో పిల్లల హక్కులపై నవంబర్ 14న ఓ బిల్లును ఐరాస ఆమోదించింది. ఈ బిల్లును ఆమోదిస్తూ 191 దేశాలు సంతకాలు పెట్టాయి కూడా. బాలల హక్కుల సంబంధిత కఠిన చట్టాలు ఎన్ని ఉన్నా చాలామంది పిల్లలు బాల కార్మికులు గానే మిగిలి పోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య ఈనాటికీ ఫలించని కలగానే మిగిలి పోతున్నది. ప్రపంచ బాలకార్మి కుల్లో మూడవ వంతు మంది మన దేశంలోనే ఉన్నారని ఒక అంచనా. దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. 5 నుండి 15 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు. పాఠశాలలో నమోదు కాని, మధ్యలో మాని వేసిన, అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1 నుండి 10వరకూ, 2003 సంవత్సరం నవంబర్ 24 నుండి 29వరకూ బడి బయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఏటా ఆ కార్యక్ర మాన్ని అమలు చేస్తునే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాల కార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించ డానికి, నిర్బంధ ప్రాథ మిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువు పట్ల అవ గాహన కలిగించాలి. బాలకార్మికులకు వసతి సైతం కల్పించేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాదనపై ఆధార పడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# కోట్లు వెచ్చించినా దుర్వాసనే

కోరుట్ల : పట్టణం మధ్యనున్న ప్రధాన చెరువును మినీట్యాంక్ బండ్‌గా అభివృద్ధిచేసి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు రూ.కోట్ల ప్రజాధనం వెచ్చించారు. 9 ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తికాకపోవడంతో మురుగు కూపంలా తయారై దుర్వాసన వెదజల్లుతోంది. చెరువు పరిసరాలలో నివసించే ప్రజలు దుర్గంధంతో ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని మద్దుల చెరువును మినీట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం రూ.3.20 కోట్లు కేటాయించగా 25.04.2016లో అప్పటి నీటిపారుదలశాఖమంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు పనులు ప్రారంభించారు. చెరువులో పూడికతీసి, కట్ట ఎత్తుపెంచారు. కట్టపై సిమెంట్‌రోడ్, మత్తడి, కట్టపై ఇనుప రెయిలింగ్, గేట్‌లను ఏర్పాటు చేశారు. వీటితోపాటు కట్టపై ఇతర కట్టడాలు, అభివృద్ధి పనులు చేపట్టారు. నిధులు సరిపోకపోవడంతో 2019లో టీయూఎఫ్ఐడీసీ కింద రూ.3.55 కోట్లు కేటాయించారు. పైప్రాంతం నుంచి వచ్చే మురుగు నీరు చేరకుండా ప్రత్యేక కాలువల నిర్మాణం, కట్టపై స్వాగతతోరణం, చెరువులో బోట్ల ఏర్పాటు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటివరకు పనులు పూర్తిచేయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు.

**కప్పేసిన గుర్రపుడెక్క**

మద్దుల చెరువు(మినీట్యాంక్ బండ్)లో పైప్రాంతంలోని కాలనీల నుంచి వచ్చే మురుగు చేరడంతో గుర్రపుడెక్క భారీగా పెరిగి చెరువుంతా విస్తరించింది. గతేడాది పురపాలక సంఘం నిధులు రూ.14 లక్షలు వెచ్చించి గుర్రపుడెక్కను తొలగించారు. తర్వాత చెరువులోకి మురుగు నీరు రావడంతో మరోమారు పూర్తిగా గుర్రపుడెక్క కప్పేసింది.



కొన్నిరోజులుగా పట్టణంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో పైనున్న కాలనీల నుంచి వర్షపు నీరంతా చెరువులోకి చేరుతుండటంతో మత్తడి దూకుతోంది. చెరువు పరిసరాల్లోని చిన్నతోటవాడ, అయిలాపూర్‌రోడ్, ప్రకాశంరోడ్, ఆదర్శనగర్ కాలనీలకు దుర్గంధం వెదజల్లడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు వాపోతున్నారు.

**నిధుల దారి మళ్లింపు**

ఏఖీన్‌పూర్ స్తంభాల చెరువు నిండిన తర్వాత నీరు గొలుసుకట్టు కాలువ ద్వారా కంచరకుంటలోకి తర్వాత మద్దుల చెరువు(మినీట్యాంక్ బండ్)లో వచ్చి చేరుతోంది. ఏటా మద్దుల చెరువులో సమృద్ధిగా నీరు చేరడంతో చెరువు కళకళలాడేది. కొన్నేళ్లుగా మద్దుల చెరువు పైప్రాంతంలో ఆదర్శనగర్, ముత్యాలవాడ, రాంనగర్, బిలాల్‌పురా, ఏసుకోనిగుట్ట, అర్బన్‌కాలనీలు వెలిశాయి. కాలనీలో ఇళ్ల నుంచి వెలువడే మురుగు నీరంతా వచ్చి మద్దుల చెరువులో చేరి మురుగు కూపంలా తయారైంది. పైనుంచి వచ్చే మురుగు నీరు చేరకుండా ప్రత్యేక కాలువలు నిర్మించేందుకు టీయూఎఫ్ఐడీసీ నిధుల్లోంచి సుమారు రూ.2 కోట్లకుపైగా కేటాయించారు. చెరువు పైప్రాతంలోని భూముల యజమానుల, స్థిరాస్తి వ్యాపారుల ఒత్తిడితో మురుగు కాలువను నిర్మించకుండా నిధులను దారి మళ్లించారు.

విస్తీర్ణం 29.28 ఎకరాలు
ఎఫ్‌టీఎల్ 50.11 మీటర్లు
బఫర్‌జోన్ 30 మీటర్లు

# సర్కారు కళకళలాడేలా.. బాలలందరూ బడికొచ్చేలా..!

చౌటుప్పల్ : సర్కారు బడులను పిల్లలతో కళకళలాడేలా చేసేందుకు చౌటుప్పల్ మండలంలోని కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. మిగతా పాఠశాలలకు భిన్నంగా పని చేస్తున్నారు. గ్రామ ప్రజలను భాగస్వాములను చేస్తున్నారు. దాతల సహకారం పొందుతున్నారు. సమష్టి కృషితో నాణ్యమైన విద్యనందిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే పిల్లలందర్నీ ప్రభుత్వ బడిబాట పట్టించేందుకు వ్యూహాలు రూపొందిస్తున్నారు.

పాఠశాలకు యూట్యూబ్ ఛానల్..తంగడపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నారు. బడిలో నిర్వహించే వినూత్న కార్యక్రమాలను తమ పాఠశాల ఛానల్ ద్వారా ప్రజలందరికీ తెలియజేస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడిగా విధుల్లో చేరిన ప్రసాద్ ఈ ఛానల్‌కు రూపకల్పన చేశారు. విద్యార్థులకు తన సొంత ఖర్చుతో గుర్తింపు కార్డులు తయారు చేయించారు. అయిదుగురు ఉపాధ్యాయులు కలిసికట్టుగా పనిచేస్తూ విద్యార్థుల్లో భాషా నైపుణ్యం పెంచేందుకు ప్రార్థన సమావేశంలో హరివిల్లు పేరుతో కథలు చెప్పిస్తున్నారు. మంచు లక్ష్మి ఫౌండేషన్ ద్వారా స్మార్ట్ తరగతిని, దాతల సహకారంతో డిజిటల్ తరగతులను నిర్వహిస్తూ 111 మంది విద్యార్థులకు వినూత్న బోధనను అందిస్తున్నారు. గురుకుల ప్రవేశ పరీక్షకు ప్రత్యేక శిక్షణనిస్తున్నారు.

**తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ..**

కొయ్యలగూడెంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను విద్యార్థులను ఆకట్టుకునేలా చూడముచ్చటగా ముస్తాబు చేస్తున్నారు. ప్రైవేటు పాఠశాలను తలదన్నేలా నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రధానోపాధ్యాయుడు మేడి యాదయ్య నేతృత్వంలో ఉపాధ్యాయులు కృషి చేస్తుండడంతో 123 మంది విద్యార్థులు ఇక్కడ చదివేందుకు ఉత్సాహంగా వస్తున్నారు. విద్యార్థులకు పాటలతోపాటు క్షేత్ర పర్యటనలకు తీసుకెళ్తున్నారు. ప్రతి వారం పరీక్షలు నిర్వహించి మూల్యాంకనం చేసి విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసి ప్రత్యేక శిక్షణనిచ్చి ప్రోత్సహిస్తున్నారు. డిజిటల్ తరగతుల్లో దృశ్య, కృత్యాధారంగా బోధన చేస్తున్నారు. నోష్ ల్యాబ్ సహకారంతో ఇద్దరు విద్యా వాలంటీర్లను నియమించుకున్నారు.

**ఇతర గ్రామాల నుంచి ఆటోల్లో..**

ఆరెగూడెం గ్రామంలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో పన్నెండేళ్ల క్రితం 30 మంది విద్యార్థులుండేవారు. ఇప్పుడు 137 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. పాఠశాల మూతబడే పరిస్థితి రాగూడదని అప్పట్లో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన బత్తుల దశరథ గ్రామస్థుల, దాతల సహకారంతో కృషి చేశారు. ఎక్కడా లేని విధంగా ఈ పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీ పూర్వ ప్రాథమిక విద్యను డీఈవో అనుమతితో ఆంగ్ల మాధ్యమంలో ప్రారంభించారు. ఇద్దరే ఉపాధ్యాయులతో బోధన సక్రమంగా జరగదని గుర్తించి పరిసరాల్లో ఉన్న దివిస్, నైల్, సౌభాగ్య పరిశ్రమల సీఎస్సార్ నిధితో అయిదుగురు విద్యా వాలంటీర్లను నియామకం చేయించుకున్నారు. డిజిటల్ తరగతులు ప్రవేశపెట్టారు. నాణ్యమైన విద్యను అందిస్తుండడంతో ఏటికేడు విద్యార్థుల సంఖ్య 137కు పెరిగింది.

# కమిషనర్ నిర్ణయం.. బల్దియాకు భారం




హైదరాబాద్: "వీధి దీపాల నిర్వహణను ప్రైవేటుకు అప్పగించాం. ఖాళీగా ఉన్న ఎస్ఈ (సూపరింటెండెంట్ ఇంజినీరు) పోస్టును భర్తీ చేసుకుంటే సరిపోతుంది. మిగిలిన ఖాళీలను ప్రస్తుతమున్న ఇంజినీర్లతో సర్దుబాటు చేసుకోవచ్చు. ఇంజినీర్లు వెళ్లి లైట్లను బిగించరు. స్విచ్చులు వేయడం, ఆపేయడం ఏజెన్సీ పని. మన ఇంజినీర్లతో పోలిస్తే విద్యుత్తుశాఖ ఇంజినీర్ల జీతం రెండు, మూడు రెట్లు ఉంది. అంతంత జీతాలు ఇచ్చి.. నామమాత్రపు పని కోసం వారిని జీహెచ్ఎంసీకి డిప్యుటేషన్‌పై తీసుకోవాల్సిన అవసరం లేదు."అని రెండు నెలల కిందట ముగ్గురు అదనపు కమిషనర్లతో ఏర్పాటైన కమిటీ తీర్మానించింది. ఆ నిర్ణయాన్ని అప్పటి కమిషనర్ ఇలంబర్తి అంగీకరించారు. నెల క్రితం కొత్త కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న ఆర్.వి.కర్ణన్ ప్రారంభంలో కమిటీ నిర్ణయంతో ఏకీభవించినా తర్వాత ఆయన నిర్ణయం మారింది. ఒక ఎస్ఈ, ఐదుగురు ఈఈలు, 28 మంది డీఈలు, 70 మంది ఏఈలను కలిపి 104 మంది ఇంజినీర్లను జీహెచ్ఎంసీకి కేటాయించాలంటూ విద్యుత్తుశాఖకు లేఖ రాశారు. ఈ నిర్ణయంతో బల్దియా ఖజానాపై ప్రతి నెలా జీతాల రూపంలో రూ.2.5కోట్ల భారం పడనుంది. జీతాల భారం భరించలేక గత కమిషనర్లు కూడా పలువురు విద్యుత్తు శాఖ ఇంజినీర్లను వారి మాతృసంస్థకు పంపించారు.

**రూ.1,200 కోట్లతో ప్రైవేటు సంస్థకు!...** వీధి దీపాల నిర్వహణను జీహెచ్ఎంసీ 2017లోనే ప్రైవేటుకు అప్పగించింది. ఏప్రిల్, 2025 వరకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ ఆ పనిని నిర్వహించింది. అందుకుగాను జీహెచ్ఎంసీ ఆ సంస్థకు రూ.వందల కోట్ల రుసుం చెల్లించింది. ఇప్పుడు మరింత పెద్ద సంస్థకు అప్పగించాలని కమిషనర్ నిర్ణయించారు. ఆయన రూపొందించిన విధానం అమలు చేయాలంటే దాదాపు రూ.1,200కోట్ల ఖర్చు అవుతుందని అంచనా. ఆ ప్రక్రియ పూర్తయితే.. గుత్తేదారు సంస్థనే అన్ని పనులు నిర్వర్తిస్తుంది. వెలుగుతోన్న లైట్లు ఎన్ని, వెలగనివి ఎన్ని అని చూసుకోవడమే జీహెచ్ఎంసీ పని.

**ఇసుజు వాహనాలతోనూ..**

జీహెచ్ఎంసీ వర్షాకాల అత్యవసర బృందాలు, సత్వర మరమ్మతు బృందాలకు 150 ఇసుజు వాహనాలను కేటాయించాలని కమిషనర్ తీసుకున్న నిర్ణయం కూడా విమర్శలకు తావిస్తోంది. ఇందుకు జీహెచ్ఎంసీ గతంలో ట్రాక్టర్లను ఉపయోగించేది. ట్రాక్టర్‌లో మూడు క్యూబిక్ మీటర్ల సరకును, వ్యర్థాలను తరలించేవారు. ఇసుజు వాహనం ట్రాలీలో ఒక క్యూబిక్ మీటరు వ్యర్థాలనూ తరలించలేరు. ట్రాక్టర్ అద్దెతో పోలిస్తే.. మూడింతలు అదనంగా చెల్లిస్తామంటూ సీటీఓ శ్రీనివాస్ టెండరు నోటిఫికేషన్ ఇచ్చారు. రెండు సంస్థలకు మాత్రమే టెండరులో పాల్గొనే అవకాశాన్ని సృష్టించారని, వారికి పోటీగా టెండరు వేయడంతో తమను సీటీఓ బెదిరించారని గుత్తేదారులు శనివారం ప్రకటన విడుదల చేశారు.

# సిబ్బంది కొరత.. నిఘా అంతంతే

కరీంనగర్ :కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ)లో నియామకాలు చేపట్టి సుమారు ఎనిమిదేళ్లయ్యింది. రాష్ట్రవ్యాప్తంగా 41 పోస్టులు అత్యవసరంగా భర్తీ చేయాల్సి ఉండగా అందులో 70 శాతం ఖాళీలు రాజధాని పరిధిలోనే ఉన్నాయి. సిబ్బంది కొరత, పనిభారం పెరగడంతో అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలను తగ్గించేశారు. తనిఖీలు సకాలంలో జరగకపోవడంతో పరిశ్రమల నిర్వాహకులు వ్యర్థాలను ఇష్టానుసారంగా డంప్ చేస్తున్నారు.

**రాజధాని పరిధిలో 3 పెట్రోలింగ్ వాహనాలే..**

రాత్రిపూట రసాయన ఘాటువాసనలు వెదజల్లే పరిశ్రమలు, హానికర వ్యర్థాలను జలాశయాలు, డ్రైనేజీల్లో వదిలే వారిపై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత నైట్ పెట్రోలింగ్ సిబ్బందిపై ఉంది. కానీ తూతూమంత్రంగానే నిఘా ఉందన్న విమర్శలున్నాయి. పీసీబీ కేంద్ర కార్యాలయం, హైదరాబాద్, ఆర్సీపురం జోన్ కార్యాలయాల పరిధిలో ప్రస్తుతం 3 నైట్ పెట్రోలింగ్ వాహనాలు తిరుగుతున్నాయి. ఒక్కో వాహనంలో ఒక అనలిస్ట్, ఏఈ, ఈఈ స్థాయి అధికారులు, సెక్యూరిటీగార్డులు ఉంటున్నారు. వీరు రాత్రంతా తిరిగి.. గుర్తించిన పరిశ్రమలపై నివేదిక ఇవ్వాలి. దీనిపై 'పీసీబీ సభ్య కార్యదర్శి' సమీక్షించి సూచనలు, మార్గదర్శకాలు జారీ చేస్తారు. ఆశించిన స్థాయిలో నైట్‌పెట్రోలింగ్ సిబ్బంది నుంచి స్పందన లేదని, ఫిర్యాదు చేసిన 2గంటల తర్వాత బృందం అక్కడికి చేరుకుంటోందన్న విమర్శలున్నాయి. 5వేలకు పైగా పరిశ్రమలున్న రాజధాని పరిధిలో కనీసం 6–10 పెట్రోలింగ్ వాహనాలు అవసరం.

**గడువులోగా తేల్చేయాలి..:** పరిశ్రమల్లో గ్రీన్, ఆరెంజ్, రెడ్ కేటగిరీలుండగా.. గ్రీన్ కేటగిరీ పరిశ్రమకు వారం రోజుల్లో, ఆరెంజ్ పరిశ్రమకు 14రోజులు, రెడ్ కేటగిరీకి 21రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలి. గడువులోపే అనుమతివ్వడమా? రద్దు చేయడమా అనే నిబంధనలున్నాయి. కానీ అనుమతుల జారీకే 6 నెలల సమయం పడుతుందంటూ పరిశ్రమలవర్గాలు గగ్గోలు పెడుతున్నాయి. ప్రాంతీయ కార్యాలయాల పరిధిలో నమోదయ్యే ఫిర్యాదులను పరిశీలించాలన్నా, ఆయా కార్యాలయాల్లోని పర్యావరణ ఇంజినీర్లు, అనలిస్టులు పరిశ్రమల్లో తనిఖీలుచేసి శాంపిళ్లను ల్యాబ్‌కు పంపి నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ సిబ్బంది కొరతతో ఈ ప్రక్రియ ఆలస్యమవుతోంది.

**ప్రక్షాళన అవసరమే..**

23 ఏళ్లు.. 18 ఏళ్లు.. 16ఏళ్లు.. ఇలా ఒకేజోనల్ పరిధిలో ఒకే చోట పనిచేస్తున్న (హైదరాబాద్‌లో) అధికారులు 10 మంది ఉన్నారు. మిగిలిన వారు ఇక్కడికి రాకుండా, వీరు వెళ్లకుండా పైరవీలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. తాము చెప్పిందే వేదం అన్నట్టు ప్రవర్తిస్తూ కొన్ని పరిశ్రమలకు మేలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒకే వ్యక్తికి ఏళ్ల తరబడి ఒకే చోట పోస్టింగ్ ఇవ్వడం నిబంధనలకు విరుద్ధం అయినా ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడం గమనార్హం.

# అధికారుల నిర్ణయం.. చిన్నారులకు శాపం




కరీంనగర్ : జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల బలవంతపు తరలింపు ప్రక్రియ కొనసాగుతోంది. దీంతో అర్హులైన లబ్ధిదారులకు పౌష్టికాహారం అందని ద్రాక్షలా మారుతుంది. సమీపంలో ఉన్న కేంద్రాలకు వచ్చి పోషకాహారం తీసుకునే గర్భిణులు, బాలింతలకు కేంద్రాల తరలింపు నిర్ణయం మింగుడు పడట్లేదు. ఇప్పటి వరకు తమ చిన్నారులను పూర్వ ప్రాథమిక విద్య కోసం ఇంటి దగ్గర్లో ఉన్న కేంద్రానికి పంపించే వారు. కానీ కేంద్రాల తరలింపుతో వారి హాజరు శాతం తగ్గిపోయే అవకాశముంది. ఈ నేపథ్యంలో కేంద్రాల తరలింపుపై జిల్లా వ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో ఎక్కడా అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ఉండకూడదు. అద్దె భవనాల్లో ఉన్న కేంద్రాలను వెంటనే సమీపంలో ఉన్న ప్రభుత్వ, అద్దె చెల్లించనవసరం లేని సామాజిక భవనాల్లోకి మార్చాలని జిల్లా ఉన్నతాధికారి హుకుం జారీ చేశారు. నెల రోజులుగా ప్రతిరోజు ఎన్ని కేంద్రాలను మార్చారని ప్రగతి నివేదిక సమర్పించాలన్నట్లు సమాచారం. పైగా కొత్తగా మార్చుతున్న కేంద్రాల్లో 25 వాటిల్లో భవనాలను మరమ్మతు చేస్తే కానీ నిర్వహణకు ఉపయోగపడని పరిస్థితి ఉన్నట్లు తెలిసింది.

**పాఠశాలల్లో గదుల కొరత..**

కరీంనగర్ అర్బన్, గ్రామీణం, గంగాధర, హుజూరాబాద్ నాలుగు ప్రాజెక్టుల పరిధిలో 777 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో 310 కేంద్రాలకు సొంత భవనాలున్నాయి. మిగిలిన వాటిలో నెల రోజుల కిందటి వరకు మరో 200 కేంద్రాలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, ఇతర సామాజిక భవనాల్లో ఉండగా, కొత్తగా మరో 65 కేంద్రాలను మార్చడానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశారు.

ఇవి పోగా మరో 202 కేంద్రాలు అద్దె భవనాల్లో ఉన్నాయి. వాటన్నింటినీ మార్చాలని వస్తున్న ఒత్తిళ్లతో ఉద్యోగులకు పాలుపోని పరిస్థితి ఏర్పడింది. ఒక్కో కేంద్రం ఎందుకు మార్చడానికి అవకాశం లేదో వివరాలను నమోదు చేసి నివేదికలు సమర్పిస్తున్నారు.

అందులో చాలా చోట్ల కేంద్రాలను రెండు కిలోమీటర్లకు దూరంగా మార్చడానికి సిద్ధపడ్డా.. ఆ మండల ఎంఈవోలు తమ పాఠశాల భవనాల్లో గదులు లేవని సమాధానం చెప్పినట్లు నివేదికలు సమర్పించారు.

తరలింపులో అలసత్వం వహిస్తే చర్యలు

కరీంనగర్ మంకమ్మతోట : మరో పది రోజుల్లో అద్దె భవనాల్లో ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. శనివారం స్థానిక సుడా కార్యాలయంలో ఐసీడీఎస్, పలు శాఖల ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 63 అంగన్‌వాడీ కేంద్రాలను తరలించారని, మిగిలిన అన్ని కేంద్రాలను సైతం తప్పనిసరిగా తరలించాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతితోపాటు పలు శాఖల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్ ఇక సులభతరం...!

మిర్యాలగూడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ విధానం విజయవంతం కావడంతో రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 నుంచి జిల్లాలోని అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ ఏడాది మార్చిలో పైలట్ ప్రాజెక్టు కింద ఉమ్మడి జిల్లాలోని బీబీనగర్, చౌటుప్పల్, భువనగిరి కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయగా ఇక మీదట మిర్యాలగూడ, నల్గొండ, చండూరు, దేవరకొండ, నిడమనూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చేవారు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుండటంతో దీనికి ప్రత్యామ్నాయంగా స్లాట్ బుకింగ్ విధానం అమలు చేస్తున్నారు.

**స్లాట్ బుకింగ్ సౌకర్యం ఇలా..**

రిజిస్ట్రేషన్ల శాఖ వారి పబ్లిక్ డాటా ఎంట్రీ సిస్టమ్‌లోని అధికారిక వెబ్‌సైట్‌లో స్లాట్ బుకింగ్ ప్రక్రియ ఉంటుంది. మరో వైపు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు స్లాట్ బుకింగ్ విధానంతో సమయం ఆదా కావడంతో పాటు, నకిలీ రిజిస్ట్రేషన్లకు పూర్తిగా అడ్డుకట్ట వేయవచ్చు రిజిస్ట్రేషన్ల కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. స్లాట్ బుకింగ్‌లో ఉన్న సమయానికి కార్యాలయానికి వెళ్తే 15 నిమిషాల్లో పని పూర్తి చేసేలా 'డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ విధానం'




అమలు చేస్తున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునికీకరిస్తుండగా కృత్రిమ మేధ, చాట్ జీపీ విధానంతో మరింత సులువుగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేసేలా సన్నాహాలు చేస్తున్నారు.

నిషేధిత జాబితాలోని భూములను రిజిస్ట్రేషన్లు చేయకుండా 'భూ భారతి' పోర్టల్ తరహాలో నిషేధిత ఆస్తుల సర్వే నెంబర్ల వివరాలను పొందుపరుస్తున్నారు. నిషేధిత జాబితాలోని భూములు రిజిస్ట్రేషన్ చేస్తే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం వెళ్లే విధంగా సమాంతర వ్యవస్థను అభివృద్ధి పరుస్తున్నారు. స్లాట్ బుకింగ్ విధానంలో ఆన్‌లైన్‌లో స్కాన్ చేసిన డాక్యుమెంట్లను కొనుగోలు చేసే వారికి అదే రోజు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానానికి ఏర్పాటు చేస్తున్నామని, ఎప్పటి నుంచి ప్రారంభించాలనే విషయం ఖచ్చితమైన తేదీ రాగానే స్లాట్ బుకింగ్ అమలు చేస్తామని జిల్లా రిజిస్ట్రార్ ప్రకాశ్ తెలిపారు.

# సొరంగ మార్గం తవ్వకాల్లో సందిగ్ధం!

దేవరకొండ : దేశంలో అతి పెద్ద సొరంగ మార్గపు ప్రాజెక్టు గా గుర్తింపు పొందిన శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ పథకం నిర్మాణ పనులు ఒక అడుగు ముందుకు పడితే మరో రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా సాగుతోంది. తాజాగా రూ.కోట్లు వెచ్చించి అమెరికా నుంచి ఎస్సెల్బీసీ సొరంగ మార్గం తవ్వకాలకు తెప్పించిన టన్నెల్ బోరింగ్ మిషన్‌తో పని చేయడం శ్రేయస్కరం కాదని ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంకేతిక కమిటీ సూచించినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో టీబీఎం పరిస్థితి ఇక తెల్లగుర్రమేనా అనే సందేహం వ్యక్తం అవుతుంది.

**డ్రిల్లింగ్.. బ్లాస్టింగ్.. టీబీఎంతోనా..?**

శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ సొరంగం పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టాలు ఎక్కించేందుకు దోమలపెంటలోని ఇన్‌లెట్ వైపు నుంచి పనులు ప్రారంభించింది. ఇవి ప్రారంభమైన నాలుగు రోజులకే ఫిబ్రవరి 22న సొరంగం పైకప్పు కూలి ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ సమయంలో ఎనిమిది మంది జాడ నేటికీ బయటికి రాలేదు. ఈ క్రమంలో సమయం వృథా చేయకుండా మన్నెవారిపల్లిలోని ఎస్సెల్బీసీ ఔట్‌లెట్ ఏప్రిల్ 18న టీబీఎం బేరింగ్ ఇక్కడికి చేరుకోవడంతో మరికొన్ని విడి భాగాలను కెనడా నుంచి తెప్పించాల్సి ఉంది. ఈ సమయంలోనే ప్రభుత్వం జియో సాంకేతిక కమిటీని ఏర్పాటు చేశారు. శనివారం ఎస్సెల్బీసీ ఔట్‌లెట్ వద్దకు చేరుకొని అక్కడి పరిస్థితులు గమనించారు. సొరంగం పనులు టీబీఎంతో తవ్వకాలు అసాధ్యమని, డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో తవ్వకాలు చేపట్టాలని ఇప్పటికే ప్రభుత్వానికి సూచించారు. దీంతో ఎస్సెల్బీసీ టన్నెల్‌కు రూ.కోట్లు వెచ్చించి తీసుకొచ్చిన టీబీఎం మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, ప్రభుత్వానికి ఆర్థిక భారంతో తెల్లగుర్రంలా మిగిలిపోతుందని సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. మొత్తం సొరంగం 43.93 కిలోమీటర్లు పొడవు కాగా ఇన్‌లెట్ వైపు నుంచి 13.93 కిలోమీటర్లు పూర్తయ్యింది. ఔట్‌లెట్ వైపు నుంచి 20.49 కిలోమీటర్లు తవ్వారు. మిగిలిన 9.53 కిలోమీటర్లు ఇంకా తవ్వాల్సి ఉండగా ప్రస్తుత పరిస్థితుల్లో ఈ సొరంగం పనులు ఆలస్యంగా సాగుతున్నాయని పలువురు వాపోతున్నారు. **నిపుణుల కమిటీ చేరుకుంది : చక్రపాణి, డీఈ** ఎస్సెల్బీసీ ఔట్‌లెట్ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. టీబీఎంతో డ్రిల్లింగా లేదా బ్లాస్టింగ్‌తో డ్రిల్లింగా.. ఏది ఉత్తమం అనే అంశంపై చర్చలు జరుగుతున్నాయి. టీబీఎంతో ఎంత వరకు పని చేయాలో అంత వరకు చేయాలా అనేది నిపుణుల కమిటీ చర్చిస్తుంది.

# మీనం..మౌనం

భానుపురి : జిల్లాలో మత్స్యకారులకు ఈ ఏడాది ఉపాధి కరవైంది. వర్షాకాలంలో సమృద్ధిగా వానలు పడి చెరువులు, కుంటలు నీటితో పరవళ్లు తొక్కాయి. కానీ గతంలో మాదిరిగా ఈసారీ ప్రభుత్వం చెరువులు, కుంటల్లో చేప పిల్లలను వదిలి ఉపాధి కల్పిస్తుందని భావించినా మత్స్యకారులకు నిరాశే మిగిలింది. వాటిని వదలకపోవడంతో మత్స్యకారుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.మత్స్యకారులు చెరువులు, కుంటల్లో చేపల వేట సాగిస్తూ ఉపాధి పొందుతున్నారు. జిల్లాలో 1086 చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిలో అనువైన చెరువులు 648 ఉన్నాయి. ప్రభుత్వం ఏటా వాటిలో వదిలేందుకు వందశాతం రాయితీపై ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసేది. 3 కోట్లకుపైగా పిల్లలను చెరువుల్లో వదిలేవారు. ఈ ఏడాది పంపిణీ చేసేందుకు మత్స్యశాఖ అధికారులు గుత్తేదారుల నుంచి టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు. దీంతో పూర్తిస్థాయిలో పంపిణీ కాలేదు. ఈ ఏడాది కేవలం 315 చెరువుల్లో 1.01 కోట్ల చేప పిల్లలను మాత్రమే వదిలారు.

జిల్లాలో ఈసారి చేపల ఉత్పత్తి తగ్గింది. గతేడాది 3.38 కోట్ల చేప పిల్లలు వదలగా.. ఈ సారి 1.01 కోట్లు మాత్రమే విడుదల చేశారు. ప్రభుత్వం మారటం.. గుత్తేదారులకు పెండింగ్ బిల్లులు ఉండటంతో ఎవరూ టెండర్లకు ముందుకు రాలేదు. దీంతో ఆలస్యం కారణంగా జిల్లాలో చేపల ఉత్పత్తి తగ్గింది. గతేడాది కంటే ఈసారి 2.37 కోట్ల మేర చేపల ఉత్పత్తి తగ్గింది. ఈసారి ఇంకా లక్ష్యం ఖరారు చేయలేదు. ప్రస్తుతం చేపల దిగుబడి అంతగా లేకపోవడంతో మత్స్యకారులు నష్టపోతున్నారు.ఉత్పత్తి పెంచుతాం..జిల్లాలో ఈసారి చేపల ఉత్పత్తిని పెంచుతాం. గతంలో కంటే అధికంగా విడుదల చేసేలా కృషి చేస్తాం. ప్రభుత్వం ఇంకా లక్ష్యం ఖరారు చేయలేదు. ఏమైనా ఆదేశాలు వచ్చిన వెంటనే నిత్యం నీరుండే చెరువులను ఎంపిక చేసి విడుదల చేస్తాం.నాగులు నాయక్, జిల్లా మత్స్యశాఖ అధికారి, సూర్యాపేట

# పాడి భారం.. పాలు కలుషితం

కరీంనగర్: పాల ఉత్పత్తి ఉమ్మడి జిల్లాలో క్రమేణా తగ్గుతోంది.. వినియోగానికి తగినట్లుగా ఉత్పత్తి ఉండటం లేదు.. వాతావరణ పరిస్థితులు, డెయిరీ ఏర్పాట్లలో లోపాలు, నిర్వహణ భారం, రాయితీల తోడ్పాటు లోపం ఇందుకు కారణమవుతోంది. ఒకప్పుడు 3.80 లక్షల లీటర్లు ఉత్పత్తి అయిన చోట ఇప్పుడు 1.87 లక్షల నుంచి 2.20 లక్షల లీటర్ల ఉత్పత్తి కష్టసాధ్యమైన ప్రక్రియగా మారుతోంది. ఫలితంగా ఇతర ప్రాంతాల నుంచి జిల్లాలకు వస్తున్న ప్యాకెట్ పాలనే తప్పనిసరిగా వాడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. పదేళ్ల కిందట 8 లక్షలకుపైగా ఉన్న ఆవులు, గేదెల సంఖ్య ఇప్పుడు 5.12 లక్షలకు తగ్గిపోవడం ప్రధాన కారణమని చెప్పొచ్చు.

**'కల్తీ'కలవరం**సామాన్యుడి నుంచి సంపన్నుల వరకు వాడే పాలు కల్తీ అవుతూ కలవరం కలిగిస్తున్నాయి. డిమాండ్‌కు అనుగుణంగా పాల ఉత్పత్తి లేకపోయినా.. కాసుల కక్కుర్తితో కొందరు పాలను కల్తీ చేయడం ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. యూరియా, వరి పిండి, సోడావంటి పదార్థాల్ని పాలల్లో కలుపుతూ యథేచ్ఛగా అమ్ముతున్నారు.

కొన్ని డెయిరీల్లో దిగుబడి అధికంగా రావడానికి పశువులకు ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు ఇస్తున్నారు. దీనివల్ల ఆ పాలను తాగిన చిన్నారుల ఆరోగ్యం కనబడకుండా దెబ్బతింటోంది. డిటర్జెంట్ కలిపిన వాటిని తాగితే ఉదర సంబంధ సమస్యలు తలెత్తి కాలేయంపైనా ప్రభావాన్ని చూపుతోంది.కల్తీ పాలను గుర్తించడానికి తనిఖీ వ్యవస్థను అధికార యంత్రాంగాలు పటిష్ఠం



చేయాల్సిన అవసరం ఉంది.

పట్టణాల్లో ప్రజారోగ్యశాఖ, ఇతర ప్రాంతాల్లో ఆహార తనిఖీ శాఖ అధికారులు తరచూ తనిఖీలు చేపడితే పరిస్థితిలో మార్పు వస్తుంది.

**ప్రోత్సహిస్తే ప్రగతి**

33 లక్షల జనాభా ఉన్న నాలుగు జిల్లాల్లో సగటున ప్రతి వ్యక్తి 100 మిల్లీలీటర్ల పాలు వినియోగించినా నిత్యం 3.30 లక్షల లీటర్లు అవసరం. ఇళ్లలో ఒకట్రెండు పాడి పశువులతో పాల ఉత్పత్తి చేసే కుటుంబాలు తగ్గుతున్నాయి. డెయిరీల ఏర్పాటు దిశగా మరింత ప్రోత్సాహం అందాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో వివిధ పథకాలతో రాయితీలనందించేవి. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా అయిదు గేదెల కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షలు అందించేది. ఇందులో 25 నుంచి 50 శాతం రాయితీ ఉండేది. ఇప్పుడా పథకం అమలుకు నోచుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉమ్మడి జిల్లాకు 400-500 యూనిట్ల ద్వారా పాడి పశువుల పంపిణీ పథకం గతంలో అమలయ్యేది. ఇప్పుడా ఊసే లేదు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగామ్ (పీఎంఈజీపీ) ద్వారా పెద్ద డెయిరీ యూనిట్ల ఏర్పాటుకు అవకాశముంది. రూ.20 లక్షల నుంచి ఆపై స్థాయి పెట్టుబడితో ఏర్పాటు చేసే వాటికి ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీల వారీగా రూ.5 నుంచి 7 లక్షల రాయితీ లభిస్తుంది. కానీ ఇది సామాన్య మధ్య తరగతి ప్రజలకు అందుబాటు పెట్టుబడి కాకపోవడం ఇబ్బందిగా ఉంది.

ఉమ్మడి జిల్లాలో

గేదెలు : 4.20 లక్షలు

ఆవులు : 1.12 లక్షలు

పాడి రైతులు : 2.10 లక్షలురుగ్మతలకు మూలం ఎసిడిటీ, జీర్ణకోశ వ్యాధులు కల్తీ పాల వల్లనే వస్తున్నాయి. ప్యాకెట్ పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు కలిపే రసాయనాలూ ఇబ్బందిని పెంచుతాయి. పాలల్లో కలిపే కలుషిత నీళ్ల వల్ల కూడా ముప్పు ఉంటుంది. స్వచ్ఛమైన పాలను తాగితేనే ఆరోగ్యానికి మంచిది. స్వచ్ఛమైన పాలు అందితే మాత్రం చిన్నారుల్లో రక్తహీనత, పోషకాహార సమస్యలు తలెత్తవు. డాక్టర్. బి. శంకర్, సీనియర్ జనరల్ ఫిజిషియన్, జగిత్యాల

# విజిలెన్స్ విచారణ ముమ్మరం

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కాళేశ్వరం 9వ ప్యాకేజీ, మధ్యమానేరు జలాశయం నిర్మాణాల్లో అక్రమాలు జరిగాయని వచ్చిన ఫిర్యాదులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణను ముమ్మరం చేసింది. 2024 సెప్టెంబరులో కరీంనగర్ ఈఎన్‌సీ కార్యాలయం నుంచి రెండు ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని పూర్తి అధ్యయనం చేశాక క్షేత్ర స్థాయిలో జరిగిన పనులను పరిశీలిస్తున్నారు.

**పరిశీలిస్తూ.. కొలతలు తీస్తూ..**

అధికారులు నెల రోజుల్లో రెండుసార్లు వేర్వేరుగా విచారణ చేశారు. 2015లో కాళేశ్వరం ప్రాజెక్టుల రీడిజైన్‌లో గత ప్రభుత్వం దీని సామర్థ్యం పెంచి నిర్మాణ వ్యయాన్ని రూ.911 కోట్లుగా నిర్ణయించింది. మల్కపేట జలాశయానికి 12 కిలోమీటర్ల సొరంగం తవ్వకాల పనుల్లో జరుగుతున్న జాప్యాన్ని తగ్గించేందుకు 2018లో సిరిసిల్ల శివారు చంద్రపేట వద్ద సొరంగం అదనపు అడిట్ ప్రాంతాన్ని పరిశీలించారు. మల్కపేట జలాశయం పక్కన ప్రారంభించి వదిలేసిన పంపుహౌస్ ప్రాంతంలో కొలతలు తీసుకున్నారు. దీంతోపాటు కొత్తగా ఏర్పాటు చేసిన కంట్రోల్ భవనం అందులోని వ్యవస్థను పరిశీలించారు. మొత్తంగా ఈ అదనపు నిర్మాణాలకు కలిపి ప్రాజెక్టు వ్యయం రూ.996 కోట్లకు పెరిగిన తీరును పరిశీలించారు. దీనిపై అప్పటి ఇంజినీర్లను కూడా విచారించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

**ఆ తర్వాతే స్పష్టత**

మధ్యమానేరు జలాశయం ఎడమ మట్టికట్ట పనుల ఒప్పందంలో నిబంధనలు పాటించకపోవడంతో రూ.224 కోట్ల ప్రజాధనం పక్కదారి పట్టిందనే ఫిర్యాదుపైనా వారంలో రెండ్రోజులు జలాశయం పనులను పరిశీలించారు. 2016 సెప్టెంబరులో భారీగా వరదలకు స్పిల్‌వే ఎడమవైపు మట్టికట్ట కొట్టుకుపోయింది. గండి పూడ్చి మిగతా వాటిని పూర్తి చేసేందుకు టెండర్లు పిలవగా రెండు గుత్తేదారు సంస్థలతో ఏర్పడిన జాయింట్ వెంచర్ పనులు దక్కించుకుంది. గండిపడిన చోట పనులు చేసినందుకు 2016లోని ధరల ప్రకారం చెల్లింపులు జరపడం ఇంజినీర్లు గుత్తేదారు సంస్థకు అనుకూలంగా వ్యవహరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు విజిలెన్స్ అధికారులు జలాశయం ఎడమవైపు కట్టను కొలతలు తీసుకున్నారు. వీటికి సంబంధించి ప్రాజెక్టుల స్టాండింగ్ కమిటీ తీర్మానాలు, ఆర్థిక సంఘం నిధుల మంజూరు తదితర దస్త్రాలను విజిలెన్స్ బృందం సేకరించింది. విచారణ తర్వాత గుత్తేదారులకు చెల్లించిన అదనపు నిధులపై ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా? ఇంజినీర్ల ప్రమేయం ఏ మేరకు ఉందనే దానిపై స్పష్టత రానుంది.

# పాఠశాల బస్సు భద్రమేనా..?



హైదరాబాద్: త్వరలో కొత్త విద్యా సంవత్సరం మొదలుకానుంది. విద్యార్థులు బడిలో అడుగుపెట్టడానికి సన్నద్ధమవుతున్నారు. మరి పాఠశాలకు వెళ్లే బస్సు విషయంలో తల్లిదండ్రులు ఆలోచించారా..? అది ఎంతవరకు భద్రమో ఎప్పుడైనా గమనించారా..? రూ.వేలు, రూ.లక్షల్లో ఫీజులు కట్టడమే కాదు.. భద్రత విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. యాజమాన్యాలే వీటిపై భరోసా కల్పించాలి. పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోగా సామర్థ్య (ఫిట్‌నెస్) పరీక్షలు చేయించి లోటుపాట్లను సవరించాలి.

**ప్రథమ చికిత్స కిట్**

ప్రతీ బస్సులో ప్రథమ చికిత్స కిట్ తప్పనిసరిగా ఉండాలి. ప్రతి వారం పాఠశాల ప్రిన్సిపల్ ఆ కిట్‌ని తనిఖీ చేసి, ఎప్పటికప్పుడు మార్చుకోవాలి. ఏదైనా అగ్నిప్రమాదం సంభవించినప్పుడు మంటలార్పేందుకు ముందు జాగ్రత్తగా అగ్నిమాపక పరికరం ఉండాలి.

త్వరలో కొత్త విద్యా సంవత్సరం మొదలుకానుంది. విద్యార్థులు బడిలో అడుగుపెట్టడానికి సన్నద్ధమవుతున్నారు. మరి పాఠశాలకు వెళ్లే బస్సు విషయంలో తల్లిదండ్రులు ఆలోచించారా..? అది ఎంతవరకు భద్రమో ఎప్పుడైనా గమనించారా..? రూ.వేలు, రూ.లక్షల్లో ఫీజులు కట్టడమే కాదు.. భద్రత విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. యాజమాన్యాలే వీటిపై భరోసా కల్పించాలి. పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోగా సామర్థ్య (ఫిట్‌నెస్) పరీక్షలు చేయించి లోటుపాట్లను సవరించాలి.

**ప్రథమ చికిత్స కిట్**

ప్రతీ బస్సులో ప్రథమ చికిత్స కిట్ తప్పనిసరిగా ఉండాలి. ప్రతి వారం పాఠశాల ప్రిన్సిపల్ ఆ కిట్‌ని తనిఖీ చేసి, ఎప్పటికప్పుడు మార్చుకోవాలి. ఏదైనా అగ్నిప్రమాదం సంభవించినప్పుడు మంటలార్పేందుకు ముందు జాగ్రత్తగా అగ్నిమాపక పరికరం ఉండాలి.

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో 13,421 స్కూలు బస్సులు ఉండగా.. వీటిలో 60 శాతం వాహనాలకే ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయ్యాయి.

**ఇవి తప్పనిసరి**

డ్రైవర్‌తో పాటు ఒక సహాయకుడు(అటెండెంట్) ఉండాలి. అతను ఎట్టి పరిస్థితిలోనూ డ్రైవింగ్ చేయకూడదు.

పాఠశాల పేరు, చిరునామా, ఫోన్ నంబర్లు బస్సుకు ఎడమ వైపున ఉండాలి. 60 ఏళ్లలోపు వారు మాత్రమే ఈ వాహనాలు నడపడానికి అర్హులు.బస్సు కండీషన్‌తో పాటు బ్రేక్ వేసినప్పుడు నాలుగు వైపులా లైట్లు వెలగాలి.అయిదేళ్లు భారీ వాహనం నడిపిన అనుభవం ఉన్నవారినే ఎంపిక చేయాలి. డ్రైవర్ హెల్త్ కార్డు ఉండాలి. బీపీ, షుగర్, దృష్టి సంబంధిత సమస్యలపై ఎప్పటికప్పుడు రికార్డు నిర్వహించాలి. పాఠశాలలోని తల్లిదండ్రుల కమిటీకి డ్రైవర్ నియామకంపై సమాచారం ఇవ్వాలి.

ప్రిన్సిపల్‌తోపాటు తల్లిదండ్రుల కమిటీ బస్సు కండీషన్‌ని ప్రతినెలా తనిఖీ చేయాలి. : కిటికీలకు ఇరువైపులా మూడు ఇంచులకు మించకుండా ఉండే మూడు పైపులను అమర్చాలి.

కంప్లైంట్ బాక్సు ఉండాలి.


ప్రతి బస్సుకు 'అత్యవసర నిష్క్రమణ ద్వారం' ఉండాలి. దీన్ని గుర్తించేలా పెద్ద అక్షరాలతో రాయాలి.

ఫిట్‌నెస్ పరీక్షల తర్వాతే రోడ్లపైకి

"పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోపు విద్యా సంస్థలు బస్సులన్నీ తప్పనిసరిగా సామర్థ్య పరీక్షలు చేయించుకోవాలి. ఆ తర్వాతే రోడ్లపైకి రావాలి. బడులు మొదలయ్యాక ఈ బస్సుల తనిఖీకి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం. ఆ సమయంలో సరైన ధ్రువపత్రాలు లేకుంటే కఠినంగా వ్యవహరిస్తాం. ఇప్పటికే డ్రైవర్లకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. త్వరలోనే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో విద్యా సంస్థల యాజమాన్యాలకు సైతం అవగాహన కల్పిస్తాం".

– సి.రమేష్, సంయుక్త రవాణా కమిషనర్

# ప్రతిపాదనలకే పరిమితం.. ముందుకెళ్లని వైనం




హైదరాబాద్: హైదరాబాద్ మహా నగరాభివృద్ధి పరిధిలోని ప్రధాన చెరువుల సుందరీకరణ ప్రతిపాదనలు దాటడం లేదు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో దాదాపు 20 చెరువులను అభివృద్ధి చేయాలని హెచ్ఎండీఏ గతంలో నిర్ణయించింది. అవసరమైతే కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కొన్ని సంస్థలను ఎంపిక చేసి వాటికే ఈ బాధ్యతను అప్పగించాలని భావించారు. మరికొన్ని చెరువులను స్వయంగా సుందరీకరణ చేయాలని హెచ్ఎండీఏ నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలి విడతలో కొన్నింటిని గుర్తించారు. బండ్లగూడ సూరారం చెరువు, మహేశ్వరంలోని రావిర్యాల పెద్దచెరువు, భువనగిరిలోని పెద్దచెరువు, మరికొన్నింటిని ఎంపిక చేశారు. మరోవైపు మూడు జిల్లాల్లో అనేక చెరువుల ఎఫ్‌టీఎల్‌ను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ప్రధాన నగరంలో 60 శాతం ఎఫ్‌టీఎల్ ఆక్రమణలు పాలైనట్లు స్వయంగా ప్రభుత్వమే తేల్చింది. ఆక్రమణలు అరికట్టడంతోపాటు చెరువు చుట్టూ పచ్చదనం అభివృద్ధి చేయడం.. మురుగు చేరకుండా మళ్లించడం తదితర పనులు చేపట్టాలనే ఉద్దేశంతో సుందీకరణ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. అయితే ఆ దిశగా ఇంతవరకు అడుగులు మాత్రం పడలేదు.

**ఈ పనుల కోసం ప్రణాళిక...**

హెచ్ఎండీఏ 7200 చదరపు మీటర్ల మేరకు విస్తరించింది ఉంది. ఏడు జిల్లాల పరిధిలో 3,532 చెరువులు ఉన్నట్లు ఆ సంస్థ సర్వే ద్వారా ఇప్పటికే తేల్చింది. ఇందులో 2,933 చెరువులకు ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్) లెక్క తేల్చారు. ప్రాథమిక నోటిఫికేషన్ సైతం జారీ చేశారు. సుందరీకరణ పనుల్లో భాగంగా ఎఫ్‌టీఎల్ పరిధి వరకు మార్కింగ్ ఇచ్చి.. ఆ లోపు అక్రమ నిర్మాణాలు ఉంటే కూల్చివేయడం.. భవిష్యత్తులో అక్కడ కట్టడాలు రాకుండా చర్యలు తీసుకోవడం ప్రధానం. లేఅవుట్లు రాకుండా హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేపట్టాలని నిర్ణయించారు.

చెరువుల కట్టలను పటిష్ఠం చేసి, లోపలకు నీళ్లు వచ్చే కాల్వలను శుభ్రం చేయాలని ప్రణాళిక సిద్ధం చేశారు. చెరువు కట్టలపై వాకింక్ ట్రాక్‌లు, గార్డెనింగ్ లాంటి కార్యక్రమాలను ప్రతిపాదించారు.

ప్రస్తుతం ఉన్న చెట్లు మొక్కలు తొలగించకుండా కొత్త పార్కులు లాంటివి ఏర్పాటుకు ప్రణాళిక రచించారు. మురుగు చేరుతుంటే ప్రత్యేక పైపులైన్ ద్వారా దారి మళ్లించడం, అవసరమైతే మినీ ఎస్టీపీల నిర్మాణం ఇందులో భాగం చేశారు.


అక్కడ వివిధ కార్యక్రమాలు చేపట్టడం ద్వారా స్థానికులను కూడా భాగస్వామ్యం చేయాలనేది ప్రణాళిక. ఫలితంగా పట్టణాలు, కాలనీలకు చెరువులకు మధ్య కంచె నిర్మించి లోపల ఆక్రమణ నిర్మాణాలు రాకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. అయితే నిధుల కొరత ఇతరత్రా కారణాలతో ఈ పనులు తాత్కాలికంగా పక్కనపెట్టినట్లు తెలుస్తోంది.

# చిన్న జబ్బుకే పెద్దాసుపత్రికి!

గోదావరిఖని: సింగరేణి రెఫరల్స్ ద్వారా సంస్థపై మూడేళ్లలో భారీగా భారం పడింది. మూడేళ్ల క్రితం రూ.30 కోట్లు వెచ్చించగా.. ప్రస్తుతం రూ.100 కోట్లకు పెరిగింది. చిన్న రోగానికే కార్పొరేట్ ఆస్పత్రులకు పంపిస్తున్నారు. దీన్ని తగ్గించుకొని ఎక్కడికక్కడే ఆస్పత్రుల్లో వైద్యం అందించేందుకు వైద్యులు నైపుణ్యం పెంచుకోవాలి.ఏ చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా కార్పొరేట్ ఆస్పత్రులకు పంపించడంతో సింగరేణిపై వైద్య ఖర్చుల భారం పెరుగుతోంది. ఈ క్రమంలో సింగరేణి ఆస్పత్రుల్లో ఉన్న సౌకర్యాలు, వైద్యుల అనుభవాన్ని వినియోగించుకొని స్థానికంగానే చికిత్స అందించేందుకు ప్రయత్నించాలని భావిస్తుంది. కేవలం వైద్యం, అందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు సింగరేణి ఏటా రూ.400 కోట్లు వెచ్చిస్తోంది. ప్రధాన ఆస్పత్రులు ఐదు ఉండగా మరో 21 డిస్పెన్సరీలను సొంతంగా నిర్వహిస్తుంది. అందులో వంద మందికి పైగా వైద్యులు సేవలందిస్తున్నారు. ఇందులో కొంతమంది నిపుణులున్నారు. ఆస్పత్రుల్లో ఏయే అవసరాలున్నాయి? ఇతర సౌకర్యాలపై ప్రతిపాదనలు పంపించేలా చూడాలని సీఎండీ సూచించారు.

**వారంలో ఒకట్రెండు రోజులుండేలా..**

సింగరేణిలో వైద్య నిపుణుల కొరత తీర్చేందుకు యాజమాన్యం సిద్ధమవుతోంది. ప్రధానంగా ఎముకలు, చిన్న పిల్లలు, కంటి, జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్‌లను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచడంపై దృష్టి సారించింది. గుండె వైద్య నిపుణులతోపాటు న్యూరో విభాగానికి సంబంధించినవారిని తాత్కాలిక ప్రాతిపదికన



తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. వీరు వారంలో ఒకట్రెండు రోజులు అందుబాటులో ఉండేలా యాజమాన్యం కసరత్తు చేస్తోంది. వాస్తవానికి పూర్తిస్థాయిలో ఈ విభాగాలకు చెందిన వైద్యులను నియమించుకోవడానికి చాలాకాలంగా ప్రయత్నిస్తున్నా.. ఎవరూ ఆసక్తి చూపడంలేదు.

**మందులు, సాంకేతిక సిబ్బందిపై దృష్టి**

సింగరేణి ఆస్పత్రుల్లో ఎక్కడా మందుల కొరత లేకుండా చూడనున్నారు. ఇందుకు సంబంధించి ఎప్పటికప్పుడు ఉన్న నిల్వలు.. ఏ ఏ మందులు అవసరం ఉందనే విషయాలను గుర్తించి ప్రతిపాదనలు పంపించడంతోపాటు.. అత్యవసరమైతే స్థానికంగా కొనుగోలు చేయాల్సిందిగా యాజమాన్యం సూచించింది. ముఖ్యంగా ఎక్స్‌రే, రేడియోలజీ, ల్యాబ్‌లకు సంబంధించిన సాంకేతిక వైద్య సిబ్బంది కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి నియమించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకోనుంది. వీటి ద్వారా సింగరేణి ఆస్పత్రుల్లోనే సాధ్యమైనంత మేర స్థానికంగానే వైద్యం అందించే దిశగా ప్రణాళికలు చేస్తోంది.

# తుది దశకు ధాన్యం సేకరణ

పెద్దపల్లి : జిల్లాలో యాసంగి ధాన్యం సేకరణ తుది దశకు చేరింది. చిన్న చిన్న సమస్యలు మినహా ప్రక్రియ సజావుగా సాగింది. హమాలీల కొరత తీర్చేందుకు కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో బిహార్ కూలీలను తెప్పించడం, లారీలు, గన్నీ సంచులు సరిపడా సమకూర్చడం కలిసొచ్చింది. డబ్బుల చెల్లింపులో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. ఒకటి, రెండ్రోజుల్లో కొనుగోళ్లు ముగియనున్నాయి.

**90 శాతం చెల్లింపులు**

ఈ యాసంగిలో జిల్లాలో 2.12 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేశారు. మొత్తం 315 కేంద్రాలు నిర్వహించగా ఇప్పటివరకు 56,193 రైతుల నుంచి రూ.907.23 కోట్ల విలువైన 3,93,009.384 టన్నులు సేకరించారు. 3,77,338 టన్నుల ధాన్యం వివరాలను ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్(ఓపీఎంఎస్)లో నిక్షిప్తం చేశారు. ఇందులో 53,838 మంది రైతులకు రూ.817.42 కోట్లు జమ కాగా 90 శాతం చెల్లింపులు నమోదయ్యాయి. మొత్తం 315 కేంద్రాలకు ఇప్పటి వరకు 309 చోట్ల మూసేశారు.

**బోనస్‌కు నిరీక్షణ**



సన్న ధాన్యానికి ప్రభుత్వం చెల్లిస్తున్న బోనస్ కోసం రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. మొత్తం 74,828.820 టన్నులు కొనుగోలు చేయగా రూ.3.74 కోట్లు చెల్లించాల్సి ఉంది. వానాకాలంలో ఎప్పటికప్పుడు బోనస్ చెల్లించినా ఈ సీజన్‌లో ఎదురుచూపులు తప్పడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా ఎవరికీ బోనస్ జమ కాలేదని అధికారులు చెబుతున్నా వస్తుందా? రాదా? అన్న సందిగ్ధం నెలకొంది.

**వర్షాలకు ఇబ్బందులు**

కుమ్మరికుంటలో ఇప్పటివరకు 15,500 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా మరో 1500 క్వింటాళ్లు సేకరణకు సిద్ధంగా ఉంది. జూలపల్లిలో 20,400 క్వింటాళ్లను కొనుగోలు చేయగా మరో 600 క్వింటాళ్లు తరలింపునకు సిద్ధంగా ఉంది. మండలంలో అబ్బాపూర్, జూలపల్లి, కుమ్మరికుంట గ్రామాల్లో వరి కోతలు ఆలస్యం కావడంతో సేకరణలో జాప్యం జరుగుతోంది. వర్షాలకు రేగడి నేలలు, లోతట్టు ప్రాంతాల్లో కోతలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని రైతులు తెలిపారు. వరి నాట్లు ఆలస్యం కావడంతోనే కోతలు ఆలస్యమవుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

**తరలింపునకు సిద్ధం**

ధర్మారం: పత్తిపాక ప్యాక్స్ పరిధిలోని కమ్మర్‌ఖాన్‌పేట, అబ్బాపూర్ కేంద్రాలు మినహా అన్ని చోట్లా సేకరణ పూర్తయింది. కమ్మర్‌ఖాన్‌పేటలో ఇప్పటివరకు 10,100 క్వింటాళ్లు సేకరించగా మరో రెండు లారీల ధాన్యం మిల్లులకు తరలించాల్సి ఉంది. అబ్బాపూర్‌లో 25,400 క్వింటాళ్ల ధాన్యం సేకరణ పూర్తి కాగా మరో 3 వేల క్వింటాళ్లు తరలించాల్సి ఉంది. కమ్మర్‌ఖాన్‌పేటలో 900 క్వింటాళ్ల ధాన్యం మిల్లులకు తరలించాల్సి ఉంది. ఎస్సారెస్పీ నీటిని వదిలాక జనవరిలో నార్లు పోసిన రైతులు ఫిబ్రవరి చివరి వారం వరకూ నాట్లేయడంతో కోతలు ఆలస్యమవుతున్నాయి.

జిల్లాలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో..

సేకరించిన ధాన్యం : 3,93,009.384 టన్నులు

విలువ : రూ.907.23 కోట్లు

చెల్లించిన డబ్బులు : రూ.817.42 కోట్లు

దొడ్డు రకం : 3,18,180.564 టన్నులు

సన్న ధాన్యం : 74,828.820 టన్నులు

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాం

యాసంగి ధాన్యం సేకరణను పకడ్బందీగా చేపట్టాం. కలెక్టర్ పర్యవేక్షణలో వివిధ శాఖల సమన్వయంతో సమస్యలను పరిష్కరించాం. వర్షాలకు ధాన్యం తడిసినప్పటికీ నష్టం జరగలేదు.

శ్రీకాంత్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

# మోయలేం.. ఈ ఆస్తి పన్ను భారం

ధర్మపురి: భువన్ సర్వే ఆధారంగా ఆస్తి పన్ను నిర్ణయిస్తుండగా.. విపరీతంగా పెరగడంతో జిల్లాలోని మధ్య తరగతి ప్రజలపై భారం పడుతోంది. చాలామంది తమ ఇంటి పన్ను పెరిగిందని, దీనిని తగ్గించాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు కొన్నేళ్లుగా ఐదు పురపాలికల్లో వివిధ పథకాల కింద ప్రారంభించిన పనులు అలాగే నిలిచిపోయాయి. ఓ వైపు నిధుల లేమితో ఆశించిన మేరకు అభివృద్ధి పనులు మందగించాయి. దీంతో పారిశుద్ధ్యం, రహదార్లు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టక సౌకర్యాలు కరవయ్యాయి.

**ఇష్టారాజ్యంగా భువన్ సర్వే**

జిల్లాలోని జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీలో నియమ నిబంధనలతో భువన్ సర్వే చేయాల్సి ఉండగా ఇష్టారాజ్యంగా చేపట్టారనే విమర్శలున్నాయి. జియో ట్యాగింగు కొలతల ఆధారంగా ఇంటిని గుర్తించి ప్రత్యేక భువన్ యాప్‌లో నమోదు చేశారు. పురపాలక సిబ్బంది నూతన నిర్మాణాలతోపాటు పాత భవనాలు, వ్యాపార సంస్థల నమోదును ఆదరాబాదరగా చేపట్టడంతోనే ఒకేసారి పెద్దఎత్తున ఆస్తి పన్ను పెరిగింది. దీంతోపాటు ఇంటి నంబర్ల నమోదు, సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఈ పరిస్థితి తలెత్తిందని భావిస్తున్నారు.

ధర్మపురిలో ఓ ఇంటికి పన్ను గతంలో రూ.2 వేలు ఉంటే ప్రస్తుతం రూ.6,900ల వరకు పెరిగింది. పట్టణానికి చెందిన ఓ పెంకుటిల్లుకు మామూలుగా రూ.300 వరకు గతంలోరాగా, ప్రస్తుతం భువన్ సర్వే ఆధారంగా రూ.2 వేల వరకు పెరిగింది.

ధర్మపురి బస్టాండు సమీపంలోని ఓ ఇంటికి గతంలో రూ.1090 ఉండగా ప్రస్తుతం రూ.5,500 వరకు పెరిగింది. ప్రతి కుటుంబంపై అధికభారం పడటంతో ఐదు మున్సిపాలిటీల్లో మధ్య తరగతివారికి భారంగా మారింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 60 వేల ఇళ్లు ఉండగా.. సుమారుగా రూ.18 కోట్లకు పైగానే ఆస్తి పన్ను ద్వారా ఆదాయం సమకూరుతోందని గణాంకాల ద్వారా తెలుస్తోంది.

దృష్టికి తీసుకువస్తే న్యాయం చేస్తాం

పెద్దఎత్తున ఆస్తిపన్నును పెంచినా అభివృద్ధి అంతంతమాత్రంగానే ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. ఈ క్రమంలో సర్వేపై పునరాలోచించి పన్ను వసూళ్లలో న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పురపాలక కమిషనర్ రాజశేఖర్ దృష్టికి తీసుకెళ్లగా.. లిఖిత పూర్వకంగా తమ దృష్టికి తీసుకువస్తే పరిశీలించి న్యాయం చేస్తామన్నారు.

చురకలు

బుధవారం 4 జూన్ 2025

# సహజ ప్రసవాలకు ప్రాధాన్యం

సిరిసిల్ల : గర్భిణులకు తొలి కాన్పులో సహజ ప్రసవాలను పెంచేందుకు వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ చేస్తున్న ప్రయత్నంలో ఒక ముందడుగు పడింది. దీనికోసం ప్రయోగాత్మకంగా 2017 నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల్లోని నర్సులకు ప్రైవేటు కళాశాలలో ప్రత్యేకంగా మిడ్‌వైఫరీ శిక్షణ ఇచ్చారు. వీరు ఆసుపత్రుల్లో స్త్రీ వైద్యనిపుణులతో కలిసి సహజ ప్రసవాల చేయడంతో మంచి ఫలితాలు వచ్చాయి. ప్రభుత్వమే పూర్తిస్థాయిలో ఈ శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించింది. దీనికోసం టీజీఎన్‌ఎంసీ (రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్) రెండేళ్లుగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. రాష్ట్రంలో మిడ్‌వైఫరీ శిక్షణకు అనువుగా ఉన్న కళాశాలలు, వాటిలోని వసతులను ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో రెండు సార్లు తనిఖీ చేశారు. గతేడాది ఐఎన్‌సీ (ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్) సిరిసిల్ల, సికింద్రాబాద్, హైదరాబాద్ కళాశాల్లో శిక్షణకు అనుమతినిచ్చింది. ఇవి మూడు వరంగల్ కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్‌సైన్స్‌కు అనుబంధంగా గుర్తింపు లభించింది. ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

**18 నెలల పాటు..**

హైదరాబాద్‌లోని ఫెర్నాండేజ్ నర్సింగ్ కళాశాలలో మాత్రమే మిడ్‌వైఫరీలకు శిక్షణ ఇచ్చేవారు. ప్రభుత్వమే ఈ శిక్షణను అందించేందుకు ప్రణాళికలు చేసింది. దానిలో భాగంగా కోర్సుకు అవసరమైన పాఠ్యాంశాల ప్రణాళికను రూపొందించారు. కాగా శిక్షణనిచ్చేందుకు



నిపుణుల కొరత ఉంది. దీనికోసం ఇప్పటికే మిడ్‌వైఫరీ శిక్షణ పూర్తిచేసుకున్న వారు హైదరాబాద్ నర్సింగ్ కళాశాలలో బోధకులుగా శిక్షణనిస్తూనే.. సికింద్రాబాద్, సిరిసిల్లలో మిడ్‌వైఫరీలకు శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు.

బీఎస్సీ నర్సింగ్, డిప్లొమా పూర్తిచేసుకుని వృత్తిలో రెండేళ్ల అనుభవం ఉన్నవారు శిక్షణకు అర్హులు. ఒక్కో కళాశాలలో 30 మంది శిక్షణ ఇచ్చే అవకాశం ఉంది. నర్సింగ్ విధుల్లో ఉన్నవారికి వేతనంతోపాటు ప్రత్యేకంగా 18 నెలల శిక్షణా కాలానికి ఉపకార వేతనం అందజేస్తారు. : కళాశాలల్లో శిక్షణకోసం ప్రత్యేకంగా రెండు తరగది గదులు, వసతిని సమకూర్చారు.

**శస్త్రచికిత్సలకు అడ్డుకట్ట**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల కోసం నమోదు చేయించుకునేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రసవ కోతలు (సిజేరియన్)జిల్లాలో 71 శాతం ఉండగా ప్రైవేటు ఆసుపత్రుల్లో 89 శాతం సిజేరియన్లు జరుగుతుండటం ఆందోళన కలిగించే విషయం. వీటివల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం పెరుగుతోంది. ప్రభుత్వాసుపత్రుల్లో సహజ ప్రసవాలను ప్రోత్సహించడం ద్వారా శస్త్రచికిత్సలకు అడ్డుకట్ట వేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. దీనికోసమే నర్సింగ్ కళాశాలల్లో ప్రత్యేకంగా మిడ్‌వైఫరీ శిక్షణకు ప్రభుత్వం సిద్ధమైంది. దీనికి ప్రవేశపరీక్షలో అర్హత సాధించిన వారికి ప్రవేశాల కోసం ముఖాముఖి జరుగుతోంది. త్వరలోనే సిరిసిల్ల నర్సింగ్ కళాశాలలో మిడ్‌వైఫరీలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

# పేరుకుపోతున్న ధాన్యం నిల్వలు

ఎల్లారెడ్డిపేట : యాసంగి సీజన్‌లో వరి సాగుచేసిన రైతులు కోతలు ముగించుకొని ధాన్యాన్ని విక్రయించేందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రా లకు తరలిస్తున్నారు. ఎండల తీవ్రత కారణంగా తూకాల్లో జాప్యం చోటుచేసుకుంటోంది. దీంతో కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. మరోవైపు తూకం వేసిన ధాన్యం బస్తాలను రైస్‌మిల్లులు, గోదాంలకు తరలించడంలోనూ ఆలస్యమవుతోంది. జిల్లాలో ఈనెల 3 వరకు రూ.205.96 కోట్ల విలువైన 88775.01 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. అందులో నుంచి 4870.84 మెట్రిక్ టన్నుల ధాన్యం బస్తాలను మిల్లులు, గోదాంలకు తరలించారు. 917 మంది రైతులకు రూ.10.09 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు.

**లక్ష్యం నెరవేరేనా!**

జిల్లాలో యాసంగి సీజన్‌లో 1,78,350 ఎకరాల్లో రైతులు వరిపంట సాగుచేశారు. ఇందులో 17505 ఎకరాల్లో సన్నరకాలున్నాయి. 402112 మెట్రిక్ టన్నుల దొడ్డురకం, 36760 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. దీనిప్రకారం జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేసి, అత్యధిక కేంద్రాలను ఐకేపీ మహిళా సంఘాలకు కేటాయించారు. సుమారు 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని లక్ష్యంగా పెట్టుకు న్నారు. అయితే అకాల వర్షాల భయంతో ఇప్పటికే చాలా మంది రైతులు దొడ్డు రకం ధాన్యాన్ని నేరుగా మిల్లర్లకు విక్రయించారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తుండటంతో ఎక్కువ శాతం సన్నరకాలను కొనుగోలు కేంద్రాలకు తరలించారు. అనేక కేంద్రాల్లో నిబంధనల మేరకు తేమశాతం రావడంతో



కుప్పగా పోసి, వాటిపై ప్లాస్టిక్ కవర్లను కప్పి ఉంచారు. తమవంతు క్రమ సంఖ్య కోసం నిరీక్షిస్తున్నారు. ఇటీవల జిల్లాలో ఎండల తీవ్రత పెరిగిపోయింది. మధ్యాహ్నం సమయంలో ధాన్యం తూకం వేయడం, లారీల్లో చేర్చడం హమాలీ కూలీలకు ఇబ్బందిగా మారుతోంది. ఈ నేపథ్యంలో ఉదయం, సాయంత్రం, రాత్రి సమయాల్లో మాత్రమే వారు పనిచేయాల్సి వస్తోంది. అత్యధిక మంది రైతులు తక్కువ ధరకే ధాన్యాన్ని మిల్లర్లకు అమ్మడం వల్ల ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ లక్ష్యం నెరవేరుతుందా అనేది ప్రశ్నార్థకమే. ఆకాశం మేఘావృతం కావడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంటోంది.

**సేకరించిన సన్నరకం వడ్లు 369.30 మెట్రిక్ టన్నులు**

జిల్లాలో ధాన్యం సేకరణకు 246 కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రతిపాదించి, 244 కేంద్రాలను ప్రారంభించారు. అందులో 240 కేంద్రాల ద్వారా 88405.71 మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం, 369.30 మెట్రిక్ టన్నుల సన్న వడ్లను సేకరించారు. 2955 మంది రైతులకు సంబంధించి రూ. 43.58 కోట్ల విలువైన 18784.52 మెట్రిక్ టన్నుల ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. 21 శాతం ఆన్‌లైన్ నమోదు, 45 శాతం ట్రక్‌షీట్ అందజేత ప్రక్రియలను పూర్తిచేశారు. అకాల వర్షాలు పొంచి ఉన్న ప్రస్తుత తరుణంలో కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం కుప్పల తూకాలు, బస్తాల తరలింపు ప్రక్రియను వేగవంతం చేస్తే అన్నదాతలకు మేలు చేకూరనుంది.

# ఇంకేం చేద్దాం.. ఇంకిద్దాం



హైదరాబాద్: నగరంలో భూగర్భ జలాలు వేగంగా పడిపోతుండటమే కాకుండా నీరు ఇంకే పరిస్థితులు తగ్గుముఖం పడుతున్నాయి. మరోవైపు వర్షాకాలంలో భూమిలో ఇంకే జలాల శాతం తక్కువగా ఉండటం సమస్య తీవ్రతను మరింత పెంచుతోంది.

**ఇంకుడుగుంతలపై నిర్లక్ష్యం**

భవనాలు లేదా అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం పూర్తయిన తర్వాత నగరపాలక సంస్థ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చే ముందు విధిగా ఇంకుడు గుంత నిర్మాణం చేశారా? లేదా? అని పరిశీలించాలి. దీంతో సంబంధం లేకుండానే సర్టిఫికెట్‌ను జారీ చేస్తున్నారు. గతేడాది సెప్టెంబరులో జలమండలి 300 చదరపు మీటర్లు అంతకంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న 42,784 నివాసాలను తనిఖీ చేసింది. ఇందులో సగం ఇళ్లలోనూ ఇంకుడు గుంతలు లేవని గుర్తించారు.

గ్రేటర్ పరిధిలో నైరుతి రుతుపవనాల్లో సాధారణ వర్షపాతం 615.4 మిల్లీమీటర్లు కాగా ఈ సారి 825.5 మి.మీ.లు. కురిసింది. 30 శాతానికిపైగా సాధారణం కంటే ఎక్కువ వర్షం కురిసినా జనవరి నుంచే జలాలు అడుగంటాయి.

**నిర్వహణ లేక నిరుపయోగంగా మారి**

ఐదు నుంచి పదేళ్ల కిందట ఏర్పాటు చేసుకున్న ఇంకుడుగుంతలను పునర్నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని భూగర్భజల శాఖ అధికారులు సూచిస్తున్నారు. చాలాచోట్ల ఇవి మట్టి, ఇతర వ్యర్థాలతో ఆనవాళ్లు లేకుండాపోయాయి. గతంలో పార్కులు, ఖాళీ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో ఇంకుడు గుంతలను భారీగా ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణను పూర్తిగా విస్మరించడంతో అవి కూడా పూడిపోయి నిరుపయోగంగా మారాయి.

**వీరే ఆదర్శం..**నగరంలో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకున్న కాలనీల్లో భూగర్భజలాలు పెరిగి వేసవిలోనూ బోర్లలో నీరు పుష్కలంగా ఉండటం గమనార్హం. నగరంలో కొండాపూర్‌లోని గౌతమి ఎన్‌క్లేవ్, ముషీరాబాద్‌లోని పద్మశాలీ కాలనీలే ఇందుకు నిదర్శనం. కాలనీవాసులు ఇంకుడుగుంతల ఏర్పాటుపై కొన్నేళ్ల క్రితం చేపట్టిన కార్యక్రమం చక్కటి ఫలితాలను ఇస్తోంది.

# ఆహ్లాదం ఆవిరి.. నిర్వహణ గాలికి



హైదరాబాద్: గ్రేటర్‌లో పార్కుల నిర్వహణ అధ్వానంగా మారింది. నీటి వసతి లేక మొక్కలు ఎండుతున్నాయి. విరిగిన కుర్చీలు, పిల్లల ఆట వస్తువులు, కాలిబాటలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. పచ్చదనం, బోరుబావుల పేరుతో పలువురు అధికారులు ప్రజా ధనాన్ని దోచేస్తున్నారు. ఫలితంగా.. కాలనీ పార్కులు, రెండు ఎకరాల విస్తీర్ణానికి మించిన ఉద్యానాలు వెలవెలబోతున్నాయి. కాలనీ సంఘాల నిర్వహణలోని పార్కులనూ సమస్యలు వెంటాడుతున్నాయి. ఇంత జరుగుతున్నా.. బల్దియా కేంద్ర కార్యాలయం నిద్రమత్తు వీడట్లేదు. ఉన్నతాధికారులు కాలక్షేపానికే పరిమితమవుతున్నారనే విమర్శలొస్తున్నాయి.

మల్కాజిగిరి సర్కిల్ జ్యోతినగర్‌లో సుమారు రూ.3.75లక్షల జీహెచ్‌ఎంసీ నిధులతో 2016లో అన్ని హంగులు సమకూర్చుకున్న ఉద్యానం నేడు నిర్వహణ లోపంతో కొట్టుమిట్టాడుతోంది. దాదాపు 350 గజాల స్థలంలో జీహెచ్‌ఎంసీ, ఉద్యానశాఖ విభాగం అధికారులు దీనిని సుందరంగా తీర్చిదిద్దారు. చిన్నారులు ఆడుకునేందుకు పరికరాలు ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం అవన్నీ విరిగిమూలన పడ్డాయి.

కూకట్‌పల్లిలోని రంగధాముని చెరువు కట్టపై రూ.9.50కోట్లతో అభివృద్ధి చేసిన పార్కు ప్రధాన ద్వారం గేటు మాయమైంది. లోపల విద్యుత్ దీపాల ఫ్యూజ్‌బాక్సులకు మూతలు లేక ప్రమాదక పరిస్థితులు నెలకొన్నాయి. మొక్కలు, పచ్చనిగడ్డి ఎండిపోతోంది. హెచ్‌ఎండీఏ అధికారులు సర్కిల్ యూబీడీ వారికి అప్పగించడంతో నిర్వహణ గాలికొదిలేశారు. బాలాజీనగర్‌లోని మహిళా, పిల్లల పార్కులో వ్యాయామ పరికరాలు ఒక్కొక్కటిగా పడకేస్తున్నాయి.

రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లి పెద్దతాళ్లకుంట పార్కును 2016లో రూ.63 లక్షలతో అభివృద్ధి చేశారు. మొక్కలు నాటారు. వాకింగ్ ట్రాక్, విద్యుద్దీపాలు పెట్టారు. అధికారులు ఒకవైపు పూర్తిగా అభివృద్ధి చేయడానికి యత్నించగా స్థల సమస్య ఏర్పడింది. దీంతో అభివృద్ధికి నోచుకోలేదు. గతంలో పెట్టిన దీపాలు పాడైపోయాయి.

ఏఎస్‌రావునగర్ డివిజన్ జమ్మిగడ్డ బీజేఆర్ కాలనీ పార్కు అస్తవ్యస్తంగా మారింది. అర ఎకరంలో దీన్ని ఏర్పాటు చేశారు. కనీసం నడకదారులు, దీపాలు, మరుగుదొడ్లు, బోరు సౌకర్యం, మొక్కలూ నాటలేదు. స్థానికులు చెత్తను రిక్షాకు వేయకుండా పార్కులో వేస్తున్నారు. డంపింగ్ యార్డుల తయారైంది. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది.

సనతనగర్‌లోని ఎస్‌ఎన్‌ఆర్ పార్కు దారుణంగా ఉంది. ఆహ్లాదంగా కనిపించాల్సిన ఈ ఉద్యానంలో ప్రస్తుతం కాలు మోపే అవకాశం లేకుండా పోయింది. పార్కులో ఊడ్చిన చెత్తను అక్కడే కుప్పగా పోస్తున్నారు. చేతిపంపు పాడైపోయింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ఉద్యానంలో ఎక్కడ చూసినా మద్యం సీసాలు కనిపిస్తున్నాయి.ఆసిఫ్‌నగర్ జిర్రా రోడ్డులోని హుడాకాలనీ(సీటీ డైమండ్ హోటల్ వెనక) ఉద్యానం గతంలో పచ్చదనంతో కళకళలాడేది. ప్రస్తుతం నిర్వహణ లేక ఎండిపోయింది. కొందరు పార్కు స్థలాన్ని కబ్జాకు యత్నించగా.. స్థానికుడు అడ్డుకొని కాపాడారు. చుట్టూ ప్రహరీ నిర్మించి, మొక్కలు నాటి, బెంచీలు ఏర్పాటు చేశారు. పార్కు స్థలంపై కన్నేసిన కొందరు మొక్కలు తొలగించి పనిచేయకుండా చేశారు.

నగరంలో జీహెచ్‌ఎంసీ నర్సరీలు: 600

కాలనీ పార్కులు: 1032

రెండెకరాలకు మించినవి: 19

ట్రీ పార్కులు: 528

కేటాయింపులే

బడ్జెట్‌లో ఏటా రూ.350కోట్ల మేర హరిత పద్దుకు కేటాయింపు జరుగుతోంది. ఆర్థిక సంవత్సరం చివర్లో.. జరిగిన ఖర్చులు చూస్తే రూ.90కోట్లకు మించట్లేదు. రెవెన్యూ వ్యయంలో కనీసం 10శాతం నిధులు ఖర్చు చేయాలని మున్సిపల్ చట్టం చెబుతుండగా.. జీహెచ్‌ఎంసీ 3-4శాతం నిధులనే వెచ్చిస్తోంది.

**నిధుల దుర్వినియోగం**

పార్కుల్లో మొక్కలు నాటడానికి నర్సరీల నిర్వహణ పేరుతో రూ.కోట్లు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మూణ్నాళ్లకే వాకింగ్ ట్రాక్, పిల్లల ఆట వస్తువులు, ఓపెన్ జిమ్ పరికరాలు దెబ్బతింటున్నాయి. ఆరున్నర అంగుళాల వ్యాసంతో 800 అడుగుల లోతున బోరుబావి తవ్వేందుకు బల్దియా రూ.7లక్షల నుంచి రూ.8లక్షలు ఖర్చు చేస్తోంది. మార్కెట్లో దాని విలువ రూ.4 లక్షలు. చెట్లకు ట్యాంకర్లతో నీరు పడుతున్నామని, మరమ్మతుల పేరుతో కొందరు అధికారులు ప్రజాధనాన్ని దోచేస్తున్నారు.

# సుందరయ్య 'విజ్ఞాన' కేంద్రం

హైదరాబాద్: నగరంలోని బాగ్‌లింగంపల్లిలో ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య జ్ఞాపకార్థంగా 1988లో ఆయన పేరు మీదుగా సుందరయ్య విజ్ఞాన కేంద్రాన్ని(ఎస్‌వీకే) స్థాపించారు. ఆనాటి నుంచి ఈ కేంద్రంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. కాలక్రమేణా నగరంలోని యువత, మహిళలకు పలు కోర్సులు, నృత్యం, సంగీతం, చేతిరాతలో మెరుగుదల, గణితాన్ని సులభంగా చేయడం, సంభాషణా చాతుర్యం, మ్యాజిక్ లాంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఆయా కోర్సులకు నెలకు నామమాత్ర రుసుం చెల్లించి, నగరంలోని యువత సద్వినియోగం చేసుకోవచ్చని ఎస్‌వీకే మేనేజర్ రమణారావు సూచించారు.

**గ్రంథాలయం:** విద్యార్థులు ప్రశాంతంగా చదువుకోవడానికి కేంద్రంలో విశాలమైన గ్రంథాలయం అందుబాటులో ఉంది. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువత, విద్యార్థులు ఉచితంగా చదువుకోవచ్చు.

కూచిపూడి నృత్యం: ఆసక్తి ఉన్న బాలలకు కూచిపూడి నృత్యం నేర్పుతారు. నాలుగేళ్లు నుంచి పన్నెండేళ్ల వయసు వారు అర్హులు. శాస్త్రీయ సంగీతంపైనా తర్ఫీదునిస్తారు. వేసవి సెలవుల్లో కూచిపూడి నృత్యం కోసం ప్రత్యేక శిబిరం నిర్వహిస్తారు.

జూట్ బ్యాగులు కుట్టడం: ప్లాస్టిక్ సంచులు పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతో ఇక్కడ జూట్ బ్యాగులు కుట్టడంపై శిక్షణ ఇస్తారు. వ్యవధి మూడు నెలలు.

టైలరింగ్ : స్థానిక మహిళలకు టైలరింగ్‌పై శిక్షణ ఇస్తున్నారు. ఇది మధ్యాహ్నం 1.30 నుంచి 3.30 గంటలకు వరకు ఉంటుంది.



బ్యూటీషియన్ శిక్షణ : మహిళల కోసం బ్యూటీషియన్ శిక్షణలో ప్రాథమిక అంశాలపై ఇక్కడ శిక్షణ ఇస్తారు. 3 నెలల కాలవ్యవధి ఉంటుంది. ఇందులో ఐబ్రోస్, మెహందీ, పెడిక్యూర్, ఫేషియల్, మేకప్ తదితర వాటిపై నిపుణుల ద్వారా శిక్షణ ఇస్తారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు నేర్చుకోవచ్చు.

పిల్లలకు సమ్మర్ క్యాంపులు: వేసవి సెలవుల్లో పిల్లలు చరవాణి చెరలో చిక్కుకోకుండా సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు సోమయ్య తెలిపారు. పిల్లలకు సైన్స్ ప్రయోగాలు, నాటకాలు, కథలు చెప్పడం, భాషా నైపుణ్యం లాంటి 8అంశాలను నేర్పిస్తారు.

# సేవల్లో కూర్పు కరవు

వెల్గటూరు : పరిపాలన సౌలభ్యం కోసం కొత్త మండలాల ఏర్పాటు ఆ మూడు గ్రామాలకు కొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. ఆయా గ్రామస్థులు రెండు జిల్లాలు.. మూడు మండలాల పరిధిలో సేవలు పొందుతూ రెండున్నరేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పోలీస్‌స్టేషన్ దూరంగా ఉండటంతో తక్షణ సేవలు పొందలేని పరిస్థితి నెలకొంది. దీంతోపాటు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో తంటాలు తప్పడం లేదు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని ముంజంపల్లి, మారేడుపల్లి,

**ఆరేళ్లలో రెండు సార్లు మార్పు**

2016లో జిల్లాల పునర్విభజనప్పుడు వెల్గటూరు మండలంలోని ముంజంపల్లి, మారేడుపల్లి, ఉండెడ గ్రామాలను విడదీసి కొత్తగా ఏర్పాటు చేసిన పెద్దపల్లి జిల్లాలోని పాలకుర్తి మండలంలో కలిపారు. అన్ని సర్దుకునేలోపే 2022లో మరోసారి కొత్త మండలాల ఏర్పాటు.. ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా ఈ మూడు గ్రామాలను తిరిగి జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలో చేర్చారు. దీంతో సమస్యలు తలెత్తుతున్నాయి.

**పోలీసు సేవలకు దూరాభారం**

ఆ మూడు గ్రామాలు వెల్గటూరు నుంచి పాలకుర్తి మండలంలో చేరిన తర్వాత పోలీస్‌స్టేషన్ పరిధి బసంత్‌నగర్‌లోకి వచ్చింది. వెల్గటూరు



పోలీస్‌స్టేషన్ సుమారు 15 కి.మీ దూరంలో ఉండగా ఈ మార్పుతో 25 కి.మీ దూరాభారం పెరిగింది. కేసులు నమోదైతే గోదావరిఖని, పెద్దపల్లి న్యాయస్థానాలకు వెళ్లాల్సి వస్తోంది. కొత్తగా ప్రతిపాదించిన ఎండపల్లి ఠాణాను త్వరగా ఏర్పాటు చేస్తే కేవలం 10 కిలోమీటర్ల లోపే పోలీస్ సేవలు అందుబాటులోకి వస్తాయి. పైగా ధర్మపురి, మేడారం న్యాయస్థానాలకు దీని పరిధి మారడం వల్ల మెరుగైన రవాణా సౌకర్యంతో ఇబ్బందులు తీరే అవకాశం ఉంది.

**రెండు జిల్లాలు.. మూడు మండలాలతో సతమతం**

ఉపాధిహామీకి సంబంధించి సేవలు పాలకుర్తిలోనే కొనసాగుతున్నాయి. దీంతో కూలీలకు ముందస్తు పనుల గుర్తింపునకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ గ్రామాల పంచాయతీ కార్యదర్శులను పెద్దపల్లి జిల్లాలో సర్దుబాటు చేసుకున్నారు. దీంతో ఎండపల్లి మండల పరిధిలోని కార్యదర్శులకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఏడాదిలో ముగ్గురు కార్యదర్శులు మారడం వల్ల గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రతిబంధకాలు ఏర్పడుతున్నాయి. స్వశక్తి మహిళా సంఘాలకు సంబంధించి పనులకు పాలకుర్తికి వెళ్లాల్సి వస్తుంది. సెర్ప్‌లో విభజన జరగకపోవడం వల్ల అక్కడే సేవలు కొనసాగుతున్నాయి.

మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు పాత మండలం నుంచే జరుగుతున్నాయి. కానీ నివేదికలు మాత్రం రెండు మండలాలకు పంపించాల్సిన పరిస్థితి. యూడైస్ పరంగా పెద్దపల్లి జిల్లా పరిధిలోనే ఉండటం వల్ల పాఠశాల నిర్వహణ గ్రాంటులు మంజూరులో జాప్యం జరిగి ఒకే విడత నిధులు వచ్చాయి. రామగుండం ఎస్టీవో పరిధిలో ఉండటం వల్ల ఉపాధ్యాయుల జీతాలకు సంబంధించి 2024 ఏప్రిల్‌లో ఆడిటర్ మ్యాపింగ్ జరిగే వరకు హైదరాబాద్ ట్రెజరీల ద్వారా సమస్య పరిష్కరించుకోవాల్సి వచ్చింది.రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల సమయంలో సైతం ఈ గ్రామాలకు బ్యాంకుల ఎంపిక విషయంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ చొరవతో సమస్య పరిష్కారం అయింది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో ఈ మూడు గ్రామాల్లో జాప్యం జరిగింది. చివరికి ఎండపల్లి అధికారులు ప్రక్రియ పూర్తి చేశారు.

# 42 ఏళ్ల కల సాకారం..!

నల్గొండ : ఎలిమినేటి మాధవరెడ్డి ఎస్‌ఎల్‌బీసీ(ఏఎమ్మార్పీ) ప్రాజెక్టు కాలువ లైనింగ్‌కు మోక్షం లభించింది. 42 ఏళ్ల పోరాట ఫలితం కాల్వ కాంక్రీటు లైనింగ్ నిర్మించాలని ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా రూ.442 కోట్ల నిధులను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రభుత్వ యంత్రాంగం పనులు ప్రారంభించేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు.

**కాలువ లైనింగ్‌కు నిధులు మంజూరు**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలైన 516 గ్రామాలకు తాగునీరు అందించాలనే లక్ష్యంతో నలభై ఏళ్ల కిందట అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఎలిమినేటి మాధవరెడ్డి ఎస్‌ఎల్‌బీసీ(ఏఎమ్మార్పీ) ప్రాజెక్టు నిర్మించాలని నిర్ణయించింది. పుట్టగండి నుంచి 136 కి.మీ. మేర ప్రధాన కాల్వ తవ్వించారు. కానీ ప్రధాన కాల్వకు లైనింగ్ నిర్మించకపోవడంతో నీరు భారీగా వృథా అవుతోంది. కాల్వకు ఇరువైపులా ముళ్ల పొదలు ఏపుగా పెరిగి, గట్లు కోతకు గురై చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. దీనిని అధిగమించేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఏటా లైనింగ్ నిర్మించాలని



ప్రభుత్వాలకు ప్రతిపాద నలు పంపిస్తున్నా ప్రాధాన్యం ఇవ్వకపోడంతో ప్రాజెక్టు పరిధిలోని రైతులు ఆందోళన చెందారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించారు. కాల్వకు 112.65కి.మీ. మేర ఇరువైపులా కాంక్రీటు లైనింగ్ నిర్మాణానికి ప్రభుత్వాన్ని ఒప్పించి నిధులు విడుదల చేయించారు. వారి చొరవతో 42ఏళ్ల కల సాకారం కానుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. **టెండర్ల ప్రక్రియకు కసరత్తు**జిల్లాలో కీలకమైన ఏఎమ్మార్పీ కాల్వ లైనింగ్ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అధికారులు ముమ్మరం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో టెండర్ల ప్రక్రియ ప్రారంభించేందుకు కసరత్తు ప్రారంభించారు. సాధ్యమైనంత వరకు ఈ ఏడాదిలోనే కాంక్రీటు పనులు పూర్తి నీటి వృథాను నివారించి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని ప్రయత్నాలు ప్రారంభించారు.

చురకలు



# ఆరోగ్యానికి మురిపాలు

కర్నూలు : కర్నూలు జిల్లాలో పాల ఉత్పత్తులు పెంచేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వివిధ రాయితీ పథకాలు అందజేస్తోంది. పేద కుటుంబాలకు ఆర్థిక చేయూతనిచ్చే ప్రణాళికలు రూపొందించింది. మరోవైపు విపణిని కల్తీ పాలు ముంచెత్తుతున్నాయి. చిక్కగా ఉండేందుకు.. వెన్న శాతం పెరిగేందుకు కొందరు అక్రమ పద్ధతులు అవలంబిస్తున్నారు. జనం ఆరోగ్యానికి ముప్పు కలిగిస్తున్నారు. నేడు ప్రపంచ పాల దినోత్సవం నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పరిస్థితిపై కథనం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 13.60 లక్షల కుటుంబాలున్నాయి. 20వ పశు గణనలో భాగంగా కర్నూలు జిల్లాలో 3,62,370, నంద్యాల జిల్లాలో 4,13,607 పశువులు ఉన్నట్లు అధికారులు లెక్క తేల్చారు. 35 శాతం కుటుంబాలు లూజు పాలు, 65 శాతం కుటుంబాలు ప్యాకెట్ పాలను వినియోగిస్తున్నట్లు అంచనా. పాల ఉత్పత్తి తక్కువగా ఉన్న నేపథ్యంలో ఇతర ప్రదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది.

**పలువురికి తోడ్పాటు**

పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అధికారులు ఇటీవల పీ4, ర్యాపిడో సర్వేలు నిర్వహించారు. మొదటి దఫాగా కర్నూలు జిల్లాలో 2,961, నంద్యాల జిల్లాలో 3,477 కలిపి మొత్తం 6,438 కుటుంబాలను గుర్తించారు. దాతల సహకారంతో వారిని పాడి పరిశ్రమ రంగం వైపు తీసుకెళ్లాలని.. పాడి గేదెలు ఇప్పించాలని నిర్ణయించారు. ఫలితంగా ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందించారు.



**వినియోగం పెంచేలా..**

ఒక వ్యక్తికి సగటున రోజుకు 600 మిల్లీలీటర్ల పాలు తీసుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పరిశీలిస్తే రోజుకు 100 ఎంఎల్ కూడా తీసుకోవడం లేదు. పట్టణ ప్రాంతాల్లోనివారు.. ఆర్థికంగా ఉన్నవారు మాత్రమే తమ పిల్లలకు పౌష్టికాహారంగా పాలు ఇస్తున్నారు. కర్నూలు జిల్లాలో పత్తికొండ, మంత్రాలయం, ఎమ్మిగనూరు, హోల్వి ప్రాంతాల్లో మాత్రమే పాల సేకరణ కేంద్రాలున్నాయి. నంద్యాల జిల్లాలో ప్రతి మండలంలో కనీసం నాలుగైదు పాల సేకరణ కేంద్రాలున్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రజల ఆరోగ్యం పెంపొందించేలా.. పాల వినియోగం పెంచేలా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోంది.

**6.50 లక్షల లీటర్ల కొరత**

ఉమ్మడి జిల్లాలో రోజుకు 13 లక్షల లీటర్ల పాలు అవసరం కాగా.. ప్రస్తుతం 6.50 లక్షల లీటర్లు మాత్రమే ఉత్పత్తి అవుతోంది. సగానికి సగం కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలతోపాటు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రైవేటు డెయిరీ పాలను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఇదే అవకాశంగా కొందరు కృత్రిమ పాలను తయారుచేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

**పశు పోషకులకు ప్రోత్సాహం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పశు పోషకులకు రాయితీపై మినీ గోకులం షెడ్లను మంజూరు చేసింది. ఉపాధి హామీ పథకం కింద వంద శాతం రాయితీపై పశుగ్రాసం పెంపకానికి సాయం అందిస్తోంది. తాజాగా 50 శాతం రాయితీతో సమీకృత పశుదాణా పంపిణీ చేస్తున్నారు. అవసరమైన రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాల్సి ఉంది. భారత్ పశుధన్ యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవడంతోపాటు పశువులకు టీకాలు వేయించి ఉండాలి. తెల్లరేషన్‌కార్డు కలిగినవారు అర్హులు. సమీకృత దాణాతో పశువుల్లో పోషకాలు పెరిగి పాల దిగుబడులు మెరుగవుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

**ఇష్టానుసారంగా కల్తీ**

పాల కొరత నేపథ్యంలో ప్రైవేటు పాల వ్యాపారం పెద్దఎత్తున సాగుతోంది. పాలు ఎక్కువగా ఉన్న సమయంలో కొన్ని డెయిరీలు పొడిగా తయారు చేసుకుంటాయి. కొరత సమయంలో పొడిని పాలుగా మార్చి అమ్ముతున్నాయి. పాల ఉత్పత్తి చేసే రైతులకు లీటరుకు రూ.2, రూ.3 ఆదాయం మాత్రమే వస్తుంది. కొందరు పాల వ్యాపారులు కల్తీ చేయడం ద్వారా లీటరుకు రూ.10కు పైగా లాభం పొందుతున్నారు. కల్తీ పాలతో జనం అనారోగ్యం పాలవుతున్నారు.

# బంగారు భవితకు కిశోరి వికాసం..!

శ్రీకాకుళం : జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో కిశోరి వికాసం అవగాహన తరగతులు జరుగుతున్నాయి. మే 2న ప్రారంభమైన కార్యక్రమాలు ఈ నెల 10 వరకు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కిశోరి బాలికలకు 10 అంశాలు వివరిస్తున్నారు. 11 నుంచి 18 ఏళ్లలోపు వయసు గల అమ్మాయిలు, 11 నుంచి 14 ఏళ్ల లోపు బడి బయట ఉన్న బాలికలను సమావేశపరుస్తున్నారు. కౌమార వయసులో బాలికలు ఎలా నడుచుకోవాలి.. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఏం చేయాలనేది సూచిస్తున్నారు.

జిల్లాలో ఇప్పటి వరకు 11 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు ఉన్న బాలికలకు విద్య, లక్ష్యం, నైపుణ్యాలు, ఆహారం, లింగ సమానత్వం, రుతుక్రమం వంటి 14 అంశాల గురించి వివరిస్తున్నారు. ఈ నెల 3న ఆడపిల్లల్లో నాయకత్వం లక్షణాలు పెంపొందించే తరగతులు, స్వయం సమృద్ధి సాధించేందుకు దోహదపడే అంశాలు, 6న క్రీడల ఆవశ్యకత, వ్యాయామం, వారిలో ఉండే ప్రతిభను గుర్తించేందుకు తరగతులు జరగనున్నాయి. శిబిరం ముగింపు రోజున బాల్య వివాహాల విషయంలో చైతన్య పరుస్తారు.

**చాలా విషయాలు తెలుసుకున్నాను..**

ఈ శిబిరం ద్వారా చాలా విషయాలు తెలుసుకున్నాను. వేసవి సెలవుల్లో జరగడంతో సద్వినియోగం చేసుకోగలిగాను. ఆరోగ్యం, విద్య, సమాజంలో బాలికలు నడవడిక, అప్రమత్తంగా వ్యవహరించడం అర్థమైంది. భవిష్యత్తులో ఎలాంటి లక్ష్యం నిర్ణయించుకోవాలి.. దాన్ని అధిగమించేందుకు ఎలా ముందుకు సాగాలనే దానిపై స్పష్టత వచ్చింది.– పి.శైలజ, 10వ తరగతి, రణస్థలం

**ప్రత్యేక కమిటీల ఏర్పాటు..**వివిధ శాఖల సమన్వయంతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి బాలికలకు అన్ని అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. అందులో అంగన్‌వాడీ కార్యకర్త, బహుళార్థ సార్థక ఆరోగ్య కార్యకర్త, గ్రామ, వార్డు సచివాలయ సహాయకులు, గుర్తింపు పొందిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఉంటారు. సంరక్షణ అధికారులుగా సచివాలయం సిబ్బంది కొనసాగుతారు. కార్యక్రమాన్ని జిల్లాలో పక్కాగా ప్రణాళికతో అమలు చేస్తున్నాం.– బి.శాంతిశ్రీ, పీడీ, శ్రీకాకుళం

# భద్రత ఇక బలోపేతం..



సింధియా : ఆపరేషన్ సింధూర్ తర్వాత భద్రతపై కేంద్ర ప్రభుత్వం ఎక్కువ దృష్టిపెట్టింది. కీలకమైన నగరాలు, అక్కడి ప్రజలు, సంస్థల భద్రతకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. ముఖ్యంగా తూర్పు తీరం వెంట ఉన్న జాతి సంపద కాపాడటమే ధ్యేయంగా కొన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు. పోలీసు వెరిఫికేషన్ సర్టిఫికెట్ (పీవీసీ) సరిగా అమలు జరగడం లేదని గుర్తించారు. దాన్ని కచ్చితంగా అమలయ్యేలా చూస్తున్నారు.

తూర్పు కనుమల్లో పేరొందిన విశాఖ–డాల్ఫిన్‌హిల్స్ పరిసరాల్లోనే అత్యంత విలువైన, ముఖ్యమైన సంస్థలు ఉన్నాయి. భూగర్భ ప్రాజెక్టులైన 'దక్షిణాసియా ద్రవీకృత పెట్రోలియం వాయువు' (ఎస్ఏఎల్పీజీ), 'భారత వ్యూహాత్మక పెట్రోలియం నిల్వ సంస్థ' (ఐఎస్పీఆర్ఎల్) ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. అత్యవసర సమయాల్లో దేశ చమురు అవసరాలను ఈ సంస్థలు తీరుస్తుంటాయి. వీటికి సమీపంలోనే రక్షణ నౌకల స్థావరం, సరకు రవాణాకు సంబంధించిన పోర్టు, ఈస్టర్న్ నేవల్ కమాండ్, నేవల్ బేస్, హెచ్‌పీసీఎల్ చమురు శుద్ధి కర్మాగారం, ఐఓసీ, బీపీసీఎల్‌కు చెందిన ఇంధన నిల్వ భారీ ట్యాంకుల వంటివి ముఖ్య సంస్థలు, పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో పెద్దసంఖ్యలో కార్మికులు పనిచేస్తుంటారు.

**పీవీసీ లోపాలపై నిఘా..:** అయితే ప్రముఖ సంస్థల్లో పనిచేసే కార్మికులకు పోలీసు వెరిఫికేషన్ సర్టిఫికెట్ (పీవీసీ) సరిగా అమలు జరగని విషయాన్ని నిఘా సంస్థలు గుర్తించాయి. ఇతర రాష్ట్రాల నుంచి గుత్తేదారులు పెద్దఎత్తున ఒప్పంద కార్మికులను తీసుకొచ్చి ఇక్కడ పనులను నిర్వహిస్తుంటారు. వీరికి సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అనుమతి పాసులను జారీ చేస్తుంటారు. అయితే ఇలా పాసులు పొందిన వారిలో ఎవరైనా నేర స్వభావం కలిగి ఉన్నారా? నేర చరిత్ర ఉందా అనే విషయాలు తెలుసుకోకుండా పాసులు జారిచేస్తుండటాన్ని నిఘా సంస్థలు ప్రశ్నిస్తున్నాయి. దీంతో ప్రధాన కంపెనీలకు పోలీసులు లేఖలు పంపి పీవీసీ పక్కాగా జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**లేఖలు జారీచేశాం.**

ఇటీవల పహల్గాం ఉగ్రదాడి అనంతరం చోటుచేసుకున్న పరిణామాల దృష్ట్యా నగర పౌరులతో పాటు ప్రముఖ సంస్థల భద్రతకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చే వారికి పాసుల జారీలో పారదర్శకత పాటిస్తున్నాం. పీవీసీ కచ్చితంగా అమలు చేస్తాం. ఇప్పటికే కంపెనీలకు లేఖలు జారీచేశాం. గొలగాని అప్పారావు, సీఐ–మల్కాపురం

# కలవారికి కాదు.. కలలుగనే మధ్యతరగతికి!!



విశాఖపట్నం: విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మధ్యతరగతి ప్రజలకు అపార్ట్‌మెంట్లు నిర్మించడానికి ప్రణాళిక చేస్తోంది. వాటిని నగరం నడిబొడ్డున నిర్మించాలనుకుంటోంది. ఇందుకు డిమాండు సర్వే చేస్తోంది. ప్రజాభిప్రాయం ఆధారంగా ముందుకు వెళ్లనున్నారు. మిథిలాపురి కాలనీ, మారికవలస, మధురవాడ శ్రీకన్య, వేపగుంటలో నిర్మించాలన్నది ప్రణాళిక. ప్రస్తుతం విశాఖ నగరం మధ్యలో మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో ఫ్లాట్లు కొనుగోలు చేయడం కలగా మిగిలింది. డిమాండున్నప్పటికీ దొరకని పరిస్థితి. ఈ నేపథ్యంలో వీఎంఆర్‌డీఏకు నగరంలో ఖాళీగా ఉన్న స్థలాలను ఆదాయ వనరుగా మార్చాలనుకున్నారు. ఆయా ప్రాంతాల్లో బహుళ అంతస్తులు నిర్మిస్తే అటు ప్రజలకు ఉపయోగపడడంతో పాటు వీఎంఆర్‌డీఏకు రెవెన్యూ వస్తుందని భావిస్తున్నారు. సర్వేలో వ్యక్తిగత, కుటుంబ సభ్యుల వివరాలను పేర్కొనాలి. అలాగే ఆదాయం, విశాఖలో ఉంటున్నారా, స్థానికేతరులా, స్థానికేతరులైతే ఎక్కడ అనేవీ నమోదు చేయాలి. కొత్త ఫ్లాటు కొనాలనుకుంటుంటే సూచించిన పేర్లలో నచ్చింది ఎంపిక చేయాలి. కొత్త ఫ్లాట్ ఆరు నెలల్లో కొంటారా, ఏడాదిలో కొంటారా అనేది తెలపాలి. రెండు పడకలా, మూడు పడకలా, ఏ అంతస్తులో కొనాలనుకుంటున్నారో కూడా పొందుపరచాలి.

887, 945 చదరపు అడుగులతో రెండు పడక గదుల ఫ్లాట్లు, 1,238, 1,294 చ.అడుగుల ఫ్లాట్లు, 1,458 చ.అడుగుల ఫ్లాట్లు నిర్మించాలనుకుంటున్నారు.

ధర ఎంతలో ఉండాలనేదీ సర్వేలో పేర్కొన్నారు. రూ.45 లక్షల వరకు, రూ.45 లక్షల నుంచి రూ.55 లక్షల వరకు, రూ.56 లక్షల నుంచి రూ.65 లక్షల వరకు, రూ.65 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు, రూ.75 లక్షల పైన ఉండాలా అనే వివరాలు ఆరా తీస్తున్నారు.

క్లబ్‌హౌస్, పార్కులు, లిఫ్టులు, నడక మార్గం, గ్యాస్ లైన్, సీసీటీవీ ఇతర సౌకర్యాలలో ఏవేవి కల్పించాలో సర్వేలో అడిగారు. ఇప్పటికే ఇందులో వేలమంది పాల్గొని వారి అభిప్రాయాలు తెలియజేస్తున్నారు. అధికారులు వాటన్నింటినీ క్రోడీకరిస్తున్నారు. వాటి ఆధారంగా ఎక్కడ ఏవిధంగా నిర్మించాలో అంచనాలు తయారు చేస్తున్నారు.

డిమాండు సర్వే: నగరంలో ప్రజలు ఎక్కడ కొనుగోలు చేస్తారు, ఎన్ని చదరపు అడుగుల్లోని ఫ్లాట్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు వంటి వివరాలు తెలుసుకునేందుకు డిమాండు సర్వే సాగిస్తున్నారు. ఈ వివరాలు పొందుపరిచిన వివరాల క్యూఆర్ కోడ్‌ను నగరంలో అనేక చోట్ల ఏర్పాటు చేశారు. స్కాన్ చేసి ప్రజలు వారి అభిప్రాయం తెలిపేలా వాటిని ఉంచారు. అందులో సలహాలు, మెరుగైన నిర్మాణాల గురించి తెలిపేందుకు కూడా అవకాశం కల్పించారు.

రెండు చోట్ల: ఎంపిక చేసిన అన్ని చోట్ల అపార్ట్‌మెంట్లు నిర్మించాలని మొదట భావించినప్పటికీ అవి పూర్తయ్యేసరికి ఆలస్యమవుతుందని రెండు చోట్ల తొలుత చేపట్టాలనుకుంటున్నారు. నాలుగు చోట్ల ప్రారంభించి నెమ్మదిగా పూర్తిచేయడం కన్నా రెండు చోట్ల గడువులోగా పూర్తయ్యేలా చేస్తే బాగుంటుందనేది ఆలోచన. ఈ నేపథ్యంలో వేపగుంట, మధురవాడలో ఒక్కొక్కటి నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు కమిషనర్ విశ్వనాథన్ పేర్కొన్నారు.

# జైకా.. పనులు సాగక!



చిత్తూరు: వైకాపా హయాంలో సాగునీటి ప్రాజెక్టులను గాలికొదిలేశారు. ఆ పార్టీ నేతల జేబులు నింపుకొనే పనులు ప్రాధాన్య జాబితాలో చేర్చడం తప్ప సాధించిన పురోగతి శూన్యం. జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జైకా) నుంచి నిధులు వచ్చే అవకాశం ఉన్నా నిర్లక్ష్యం చూపారు. దీంతో కీలకమైన జలాశయాలు, చెరువుల మరమ్మతులకు గ్రహణం పట్టుకుంది. నెల రోజుల్లో జైకా ప్రాజెక్టు గడువు ముగుస్తుంది. 2014–19లో తెదేపా అధికారంలో ఉన్న సమయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 65 చెరువులు, పిచ్చాటూరు మండలం అరణియార్, కార్వేటినగరం మండలం కృష్ణాపురం రిజర్వాయర్ల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. తద్వారా 24,034.56 ఎకరాలకు సాగునీరందుతుందని భావించారు. తెదేపా పాలన చివర్లో జైకా నిధులు మంజూరయ్యాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా వీటిని పట్టించుకోలేదు. అరణియార్, కృష్ణాపురం జలాశయాలకు తొలుత ఒప్పందం చేసుకున్న గుత్తేదారు చురుగ్గా పనులు చేశారు. బిల్లులు రాకపోవడంతో అర్ధాంతరంగా నిలిపేశారు. ఇలా అరణియార్‌కు రూ.35 కోట్లు, కృష్ణాపురానికి రూ.28 కోట్లు మంజూరైనా ఫలితం లేకుండా పోయింది.

**ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటేనే..**కూటమి ప్రభుత్వం వచ్చాక జైకా పనుల పురోగతిపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో అసలు ప్రారంభించని 17 చెరువుల పనులు రద్దు చేశారు. 38 పనులు పురోగతిలో ఉండగా పూర్తి చేసేందుకు నెలాఖరు వరకు గడువు ఉంది. చిత్తూరు, గంగాధరనెల్లూరు, పెనుమూరు, ఐరాల మండలాల్లోనే కొంతవరకు పూర్తయ్యాయి. ఈ క్రమంలోనే ఓ కొలిక్కి వచ్చిన చెరువులకు సంబంధించిన నిర్మాణాలు మాత్రం వేగవంతం చేయాలని జలవనరుల శాఖ అధికారులు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని కనీసం మరో రెండేళ్లు గడువు పెంచితేనే పనులు పూర్తవుతాయి.

**సీఎఫ్ఎంఎస్‌లో రూ.3 కోట్లు పెండింగ్**

మరోవైపు కృష్ణాపురం, అరణియార్ ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులు విడుదలవ్వాలి. దాదాపు రూ.3 కోట్ల బకాయిలు ఉన్నాయని జలవనరుల శాఖ అధికారులు నివేదించారు. ఇవి విడుదల చేస్తే గుత్తేదారులకు ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు.

జైకా నిధులతో ఆధునికీకరించే చెరువులు: 65

ఆయకట్టు: 24,034.56

ఎకరాలురద్దు చేసిన పనులు: 17

పూర్తయినవి: 10ప్రభుత్వ ఆదేశాల కోసం వేచి చూస్తున్నాం

జైకా నిధులతో చేపట్టిన చెరువులు, రిజర్వాయర్ల పనులు పూర్తి చేసేందుకు మరికొంత సమయం అవసరం. గడువు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరాం. వచ్చే ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.వెంకటేశ్వరరాజు, ఎస్ఈ, జలవనరుల శాఖ

# దున్నేద్దాం.. విత్తు వేసేద్దాం

విజయనగరం : ఈ ఏడాది ముందస్తుగా కురుస్తున్న వానలు ఖరీఫ్‌కు శుభారంభం పలికాయి. రైతులు వ్యవసాయ పనులకు సిద్ధం అవుతున్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరగనుంది. దీనికి అనుగుణంగా వ్యవసాయ శాఖాధికారులు విత్తనాలు సిద్ధం చేశారు.

విజయనగరం జిల్లాలో లక్ష హెక్టార్లు, మన్యం జిల్లాలో 72 వేల హెక్టార్లలో వరి సాగు అవుతుందని అంచనా వేశారు. విజయనగరానికి 50 వేల క్వింటాళ్లు, మన్యానికి 35 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం. విజయనగరంలో 16,952 క్వింటాళ్ల విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో సిద్ధం చేశారు. క్వింటా రూ.300 రాయితీపై రూ.వెయ్యికి రైతులకు అందజేస్తారు. ఎకరానికి 20 కిలోల చొప్పున గరిష్ఠంగా ఒక్కొక్కరికీ క్వింటా ఇస్తారు. మన్యం జిల్లాలో 26,470 క్వింటాళ్ల వరి విత్తనాలు రాయితీపై సరఫరా చేస్తారు. ఇందులో గిరిజనులకు 9,092 క్వింటాళు 90 శాతం, మిగిలిన 17,378 క్వింటాళ్లు రూ.300 రాయితీపై పంపిణీ చేస్తారు.

**తొలి వారంలో నారు పోత**

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువులు, ఇతర జల వనరుల్లోకి నీరు చేరుతోంది. వీటి ఆధారంగా జూన్ తొలి వారంలో వరి నారుమళ్లలో విత్తనాలు చల్లుతారు. 25–30 రోజుల్లో వరి నారు సిద్ధమైన తర్వాత జులై తొలి వారం నుంచి నాట్లు ప్రారంభిస్తారు.



విజయనగరం జిల్లాలో 1121 రకం విత్తనాలు, మన్యం జిల్లాలో ఎంటీయూ 1064, ఆర్‌జీఎల్ 2537 రకాల విత్తనాలు అత్యధికంగా వినియోగిస్తారు. ఈ రకాలన్నీ 135 నుంచి 140 రోజుల్లో పండుతుంది. వాతావరణం కలిసొచ్చి, ప్రకృతి కరుణిస్తే ఈ ఏడాది అక్టోబరు తొలి పక్షానికి పంట రైతుల చేతికి అందుతుంది.

**వెద సాగుకు ప్రాధాన్యం**

విజయనగరం జిల్లాలో సుమారు 5 వేల హెక్టార్లు, మన్యం జిల్లాలో సుమారు 12 వేల హెక్టార్ల వరకు వెద విధానంలో వరి పండిస్తారు. సకాలంలో కలుపు తొలగించకపోతే పంట ఉత్పత్తి పడిపోతుంది. రైతులకు తీవ్ర నష్టం కలుగుతుంది. ఈ కారణంగా అత్యధిక విస్తీర్ణంలో రైతులు వరి నాట్లు వేస్తారు.

**ప్రణాళిక ప్రకారం ముందుకు**

సాధారణ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించిన ఖరీఫ్ సాగు ప్రణాళిక అమలుకు యంత్రాంగం సిద్ధంగా ఉంది. విత్తనాలతో పాటు ఎరువులు సిద్ధం చేశాం. విత్తనాల కొనుగోళ్లు పూర్తయిన తర్వాత రైతు సేవా కేంద్రాల్లోని గిడ్డంగులకు ఎరువులు పంపిస్తాం. ప్రస్తుతం వసతి ఉన్న ఆర్ఎస్‌కేలకు విత్తనాలతో పాటు ఎరువులు చేరవేస్తున్నాం. ఖరీఫ్‌లో మన్యం జిల్లాలో కాస్త భిన్నంగా పంటల సాగు ఉంటుంది. వరి సహా రాగులు, కొర్రలు, సామ, పెసర, మినుము, కందులు, వేరుసెనగ, పొద్దుతిరుగుడు వంటి మెట్ట పంటలు పండిస్తారు. 15 వేల ఎకరాల్లో చిరుధాన్యాల సాగుకు ప్రణాళిక రూపొందించారు. 30 వేల ఎకరాల్లో వరి పండించే పొలాల గట్లపై కంది సాగు చేయాలని నిర్ణయించారు. గత నెలలో రైతులకు విత్తనాలు సరఫరా చేశారు. చిరుధాన్యాల విత్తనాలు రాయితీపై త్వరలో పంపిణీ చేస్తాం.

వి.టి.రామారావు, రాబర్ట్‌పాల్, జిల్లాల వ్యవసాయాధికారులు

# ధైర్యమే.. పునర్జన్మ

విజయనగరం :పార్వతీపురానికి చెందిన నాలుగేళ్ల చిన్నారికి క్యాన్సర్ ఉందని వైద్యులు తేల్చారు. దీంతో తల్లిదండ్రులు కొన్నాళ్లపాటు కాకినాడ మకాం మార్చి.. బిడ్డకు చికిత్స అందించగా క్యాన్సర్‌ను జయించింది. నాలుగేళ్లుగా ఇబ్బంది లేకుండా చక్కగా చదువుకుంటోంది. భయపడకుండా క్రమం తప్పకుండా మందులు వాడితే నయం అవుతుందని ఆ తల్లిదండ్రులు అంటున్నారు.

బెలగాం ప్రాంతానికి చెందిన ఓ గృహిణి 25 ఏళ్ల క్రితం క్యాన్సర్ బారినపడ్డారు. మనోధైర్యంతో వైద్యుల సూచన మేరకు మందులు వాడుతూ.. మంచి ఆహారం తీసుకోవడంతో పూర్తిగా నయం చేసుకోగలిగారు.క్యాన్సర్ అనే పదం చెవిలో పడగానే వణుకు మొదలవుతుంది. ఈ మహమ్మారి బారిన పడితే ప్రాణాంతకమని భయం. కానీ ఆరోగ్యంపై కాస్త శ్రద్ధ, కొంచెం అవగాహన ఉంటే ప్రాథమిక దశలోనే గుర్తించొచ్చు. సరైన చికిత్సతో జయించి.. ఆత్మీయులతో ఆనందంగా జీవించొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. నేడు 'క్యాన్సర్ సర్వైవర్స్ డే' సందర్భంగా ప్రత్యేక కథనం.

శరీరంలోని మార్పుల్ని గమనిస్తూ.. ఆరంభ దశలోనే గుర్తిస్తే మందులు మరింత ప్రభావంతంగా పనిచేసి, వ్యాధి నయం అవుతుందని వైద్యులు చెబుతున్నారు. క్యాన్సర్‌ను జయించి, బయట పడిన రోగులు చాలా మందే ఉన్నారు. కేవలం సీబీసీ రక్త పరీక్ష ద్వారా చాలా వరకు క్యాన్సర్ లక్షణాలను పట్టేయొచ్చు. విజయనగరం మహారాజా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఇందుకు సంబంధించిన విభాగం 2024 అక్టోబరులో ఏర్పాటైంది. ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తించి, అవసరమైన చికిత్స అందేలా చూస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో నెలకు 20 నుంచి 25 మంది వరకు మహిళలు గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ బారినపడుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. పార్వతీపురం జిల్లాలో ఎన్‌సీడీ సర్వేలో 5,34,057 మందిని పరీక్షించగా అనుమానిత క్యాన్సర్ కేసులు 4,237, నిర్ధారణ అయినవి 335 ఉన్నట్లు వైద్యులు గుర్తించారు.

**అమ్మాయిలూ.. టీకా వేసుకున్నారా?**

గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్లు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఇది ఇన్‌ఫెక్షన్ల వల్ల సోకుతుంది. ఇందులో హెచ్‌పీవీ వైరస్ వల్ల సోకే వ్యాధికి టీకా ఉంది. 9–24 ఏళ్లలోపు పెళ్లి కాని అమ్మాయిలు వేసుకోవడం వల్ల క్యాన్సర్ బారిన పడే అవకాశం చాలా తక్కువ. విజయనగరం సర్వజన ఆసుపత్రికి చేరుకుని, వైద్యుల్ని సంప్రదిస్తే వ్యాక్సిన్ వేస్తారు.

**లక్షణాలు**అతిగా బరువు తగ్గిపోవడం, బాగా జుట్టు ఊడటం, జ్వరం, అలసట, శరీరం ఎర్రగా, నల్లగా మారి, దురద రావడం, కళ్లు పసుపుగా మారడం, మూత్రాశయ తీరులో మార్పులు, గాయాలు మానకపోవడం, మలం నుంచి రక్తస్రావం, మింగడం కష్టమవ్వడం, విపరీతమైన దగ్గు.**వీటికి దూరంగా..**మద్యపానం, ధూమపానం, కృత్రిమ రంగులు, నిల్వ పదార్థాలు, ప్లాస్టిక్ పాత్రలు, కలుషితమైన వాతావరణం.

ఎన్టీఆర్ వైద్య సేవలో ఉచితం: ఎన్టీఆర్ వైద్య సేవలో ఉచితంగా చికిత్స అందుతుంది. విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో మొదటి, రెండో దశల్లో క్యాన్సర్ ఉంటే శస్త్రచికిత్సతో నియంత్రిస్తాం. మూడు, నాలుగు దశల్లో ఉంటే రేడియో థెరపీ, కీమోథెరపీ అవసరం.

# కదిరి మల్లెల గుబాళింపు

కదిరి : పరిమళాలు గుబాళించే మల్లెలంటే మహిళలకు మక్కువ. అందులో కదిరి మల్లెలంటే మరింతగా ఇష్టపడతారు. సువాసన, అలంకరణలో ప్రత్యేక ఆకర్షణ కదిరి మల్లెల సొంతం. అందుకే అతివలు ధర ఎంతైనా వెనుకాడకుండా కొనుగోలు చేస్తారు. శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా వందల ఎకరాల్లో కదిరి మల్లెలు సాగులో ఉన్నాయి. ప్రధానంగా బుక్కపట్నం మండలం అగ్రహారం, పాముదుర్తిల్లో 49 ఎకరాలు, కదిరి ప్రాంతంలో 20 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో సుమారు 200 మంది రైతులు మల్లెతోటల సాగు చేపట్టారు.



రోజుకు రెండున్నర టన్నుల దిగుబడి సాధిస్తున్నారు. ధర్మవరం, అనంతపురం, మదనపల్లి తదితర పట్టణాల్లోని మార్కెట్లకు తరలిస్తున్నారు. కిలో రూ.200 పలుకుతోంది. మాలలుగా అల్లితే ఒక్కోటి రూ.500కు పైగా అమ్ముతున్నారు. వివాహాలు, పండగల సీజన్‌లో కిలో రూ.1000కి తగ్గదు. గతంలో చెన్నై, బెంగళూరు నగరాలకు ఎగుమతి అయ్యేవి.

**మగువలకు పండగే..**

వేసవిలో మగువలకు మల్లెపూల పండగే. పెళ్లిళ్లు, పండుగలు, ఇతర శుభకార్యాల్లో మహిళలు పూల అలంకరణ చేసుకుంటారు. పూలజడ, కొప్పుల జడ వంటివి అల్లుతారు. ఇక పెళ్లిళ్లలో పూల వాలుజడ తప్పనిసరి. అట్టముక్కపై పూలు కుట్టి వాలుజడకు అమర్చుతారు. కురుల మధ్య పూలను పెట్టి అల్లటంతో వాలుజడను అలంకరిస్తారు.

# జలవనరుల శాఖలో ఖాళీల వెక్కిరింత!

రాజమహేంద్రవరం: ఉభయ గోదావరి జిల్లాలకు అత్యంత కీలకమైన జలవనరుల శాఖలో కీలకమైన పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. అదనపు బాధ్యతలతో అధికారులు రెండేసి చోట్ల విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. వైకాపా ప్రభుత్వ హయాంలో గత అయిదేళ్లలో ఈ రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవగా.. కూటమి ప్రభుత్వమైనా చక్కదిద్దాలని రైతులంతా కోరుతున్నారు. అనేకమంది అధికారులు క్షేత్రస్థాయి బాధ్యతల కంటే పైరవీలు చేసి నాణ్యతా పరిశీలన విభాగంలో పనిచేసేందుకే ఆసక్తి చూపుతున్న పరిస్థితి. వచ్చేది వరదల కాలం. కీలకమైన ధవళేశ్వరం



బ్యారేజీ నిర్వహణ, పర్యవేక్షణకు 261 మంది అధికారులు, సిబ్బంది అవసరం కాగా కేవల్య 20 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో నలుగురు ఆగస్టులోగా ఉద్యోగ విరమణ చేస్తారు. వరదల సమయంలో కనీసం 50 శాతం మంది విశ్రాంత ఉద్యోగుల నియామకానికి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

**ఈఈలు ఇద్దరే..** ఉమ్మడి జిల్లాలో తూర్పు, మధ్య డెల్టాతోపాటు హెడ్‌వర్క్స్, డ్రెయినేజీ, ఏలేరు ప్రాజెక్టు, ఏలేరు డివిజన్, ఎఎస్ఎంఎల్ ప్రాజెక్టులున్నాయి. కార్యనిర్వాహక ఇంజినీర్ల (ఈఈ) మెజార్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏడుగురు ఈఈలకు ఇద్దరు ఉండగా, అయిదుగురు అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) నిర్వర్తిస్తున్నారు. 25 మంది డిప్యూటీ ఇంజినీర్లకు 19 మంది ఉన్నారు. రెండు డివిజన్లలో ఎఫ్ఏసీలు బాధ్యతల్లో ఉన్నారు. ఏఈఈ స్థాయి పోస్టుల్లోనూ ఖాళీలు వెక్కిరిస్తున్నాయి.

# పచ్చి కొబ్బరికాయకు డిమాండ్

అంబాజీపేట: తమిళనాడు, కేరళ, కర్ణాటకలో కొబ్బరి కాయల దిగుబడి తగ్గడంతో కోనసీమ మార్కెట్ పుంజుకుంది. టన్నుకు ఎక్కువ కాయలు తూగుతుండటంతో కోనసీమ పచ్చికొబ్బరి కాయలకు డిమాండ్ ఏర్పడింది. ఇక్కడ కాయలు లెక్కన టోకున కొని ఇతర రాష్ట్రాల్లో టన్నుల లెక్కన విక్రయిస్తున్నారు. టన్నుకు సుమారు 3000 కాయలు వరకు తూగుతాయి. అక్కడ చిల్లర వ్యాపారులు కిలోల లెక్కన తూకం చేసి అమ్ముతుంటారు. ఇతర రాష్ట్రాల్లో కాయలు పెద్ద పరిమాణంలో ఉండటంతో కిలోకు రెండు, మూడు వస్తుండగా



ఆంధ్రప్రదేశ్ నుంచి కొనుగోలు చేసిన కాయలు నాలుగు వరకు తూగుతున్నాయి. ప్రస్తుతం సీజన్ కాకపోయినప్పటికీ ఇక్కడ వెయ్యి పచ్చి కొబ్బరి కాయల ధర రూ. 17 వేల నుంచి రూ. 17,500 వరకు పలుకుతోందని కొబ్బరి మార్కెట్ విశ్లేషకుడు పరసా సత్తిబాబు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. నిన్న మొన్నటి వరకూ వెయ్యి కొబ్బరికాయలు రూ.14 వేల నుంచి రూ.16 వేల వరకు ధర ఉంది. చిన్నకాయలకు డిమాండు ఉండటంతో కొరత ఏర్పడిందని అంటున్నారు. రైతుల నుంచి కాయలు కొనుగోలు చేసి తరలించేందుకు ట్రాక్టర్ల సమస్య కూడా ఉందంటున్నారు.

# కుటీర పరిశ్రమల ఏర్పాటు.. ఉపాధికి తోడ్పాటు



మడకశిర : కరోనా అనంతరం చాలా రంగాలు కుదేలయ్యాయి. వివిధ రంగాల్లో ఉపాధి కోల్పోయిన వారు ఇతర ఆదాయ మార్గాలను ఎంచుకుంటూ కొంతమంది యువత, మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. విభిన్నమైన కుటీర పరిశ్రమలు నెలకొల్పి స్వయంగా తయారీ, మార్కెటింగ్ వంటివి చేస్తున్నారు. మడకశిర నియోజకవర్గంలో పలువురు స్థానికంగానే కాకుండా బెంగళూరు, తుమకూరులోనూ చిన్నచిన్న పరిశ్రమలు స్థాపించుకుని నెలనెలా మంచి ఆదాయాన్ని పొందుతున్నారు.

**రోజుకు 4 గంటలు.. నెలకు రూ.35 వేల ఆదాయం**

చంద్రకళ భర్త కోదండరామిరెడ్డితో కలిసి గతంలో పాలు కొనుగోలు ప్యాకెట్లు తయారు చేసే పరిశ్రమలను స్థాపించారు. మార్కెట్లో పోటీ ఎక్కువ కావడంతో గిట్టుబాటు కాక నష్టపోయారు. కుంగిపోకుండా పాల డెయిరీని ఏర్పాటు చేసుకున్నారు. అలుపనపల్లి గ్రామ చుట్టు పక్కల గ్రామాల నుంచి పాడి రైతులు రోజూ రెండు పూటలా పాలను తీసుకొచ్చి ఈ డెయిరీలో పోస్తుంటారు. రోజూ దాదాపుగా 1200 లీటర్ల పాలను సేకరించి మడకశిరలోని విజయ డెయిరీకి సరఫరా చేస్తున్నారు. కమీషన్ ద్వారా రూ.1200 వచ్చేలా ప్రణాళిక చేసుకున్నారు. నెలకు రూ.35వేల వరకు ఎలాంటి ఖర్చులు లేకుండా నికర ఆదాయాన్ని సంపాదిస్తున్నారు.

**పనికిరాని వక్క పట్టలతో ..**

అమరాపురం మండలం గౌడనకుంట గ్రామంలో ఆనంద్‌కుమార్ రోజూ కూలీగా వక్కను కోసేందుకు వెళ్లేవాడు. తోటలో నేలరాలి వృథాగా పడి ఉన్న ఆకులతో ప్లేట్ల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు సంకల్పించుకున్నాడు. దీంతో పలువురితో విచారించుకుని రూ.5లక్షలు పెట్టుబడిగా పెట్టి 2019లో తమిళనాడు నుంచి యంత్రాలు తీసుకొచ్చి చిన్న పరిశ్రమ ఏర్పాటు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులతో పాటు మరో 5మంది ఇందులో పనిచేస్తుంటారు. వక్క ఆకులను నిల్వ చేసుకుని రోజూ వెయ్యి ప్లేట్లు తయారు చేస్తాడు. సగటున ఒక ప్లేటును రూ.3కు విక్రయించి ప్రతి నెలా దాదాపు రూ.లక్ష వరకు వస్తుండగా కూలీ ఖర్చులు పోనూ రూ.60వేలు, ఏడాదికి రూ.7లక్షల వరకు ఆదాయాన్ని ఆర్జిస్తున్నాడు. తయారు చేసిన వక్క ప్లేట్లు స్థానికంగానే కాకుండా బెంగళూరు, తుమకూరు, విజయవాడ, గుంటూరు, తమిళనాడుకు ఎగుమతి చేస్తారు.

**పది మందికి ఉపాధి..**

స్వయం సహాయక సభ్యురాలిగా చేరి సంఘంలో రుణం తీసుకుని చిరుతిళ్ల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసుకుంది. బ్యాంకు ద్వారా రూ.2లక్షలు రుణం తీసుకుని పదేళ్లుగా చిరుతిళ్ల తయారీ, స్వయంగా మార్కెటింగ్ చేసుకుంటోంది. నెలకు రూ.70వేలు ఆదాయం సంపాదిస్తూ మరో 10మందికి ఉపాధి కల్పిస్తోంది. సంఘంలో తీసుకున్న రుణాన్ని వృథా చేయకుండా ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ఈ పరిశ్రమ స్థాపించి బాగా స్థిరపడ్డారు. రాజమ్మ, స్వయం సహాయక సభ్యురాలు, మడకశిర

# పోలీసుకు తోడుగా కృత్రిమ మేధ




అనంతపురం: కేసుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో వాటికి సంబంధించిన నివేదికలు రూపొందించడం పోలీసులకు భారంగా మారుతోంది. ఛార్జిషీటు దాఖలు, కోర్టులకు నివేదికల సమర్పణ.. కత్తిమీద సాములా మారాయి. పని ఒత్తిడితో నేర విచారణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అనంతపురం జిల్లా పోలీసులు సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకెళ్తున్నారు. ఫిర్యాదుల నమోదు, నేర విచారణకు సంబంధించిన నివేదికల తయారీలో కృత్రిమ మేధ (ఏఐ)ను సమర్థవంతంగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఏఐ టూల్స్‌ను తమకు కావాల్సిన రీతిలో ఉపయోగించుకుంటూ నేర విచారణలో వేగం పెంచుతున్నారు. గతంతో పోలిస్తే కేసుల డ్రాఫ్టింగ్‌లో తప్పులు 90 శాతానికి పైగా తగ్గడంతో పాటు కచ్చితత్వం పెరిగినట్లు చెబుతున్నారు. సమయం ఆదాతో పాటు మంచి ఫలితాలు వస్తుండటంతో కిందిస్థాయి సిబ్బందికి ఏఐపై అవగాహన కల్పిస్తున్నారు.

**సెక్షన్లు చెప్పేస్తోంది**

ఫిర్యాదులో పేర్కొన్న అంశాల ఆధారంగా ఏయే సెక్షన్లను పొందుపరచాలో ఏఐ సూచిస్తోంది. విచారణ తీరు, ఆధారాల సేకరణ వివరాలను ఒక క్రమపద్ధతిలో సూచిస్తుంది. తద్వారా విచారణ వేగవంతంగా చేసేందుకు వీలవుతుందని పోలీసులు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన నిందితుల విచారణ సమయంలో భాషానువాదం సమస్య లేకుండా పూర్తి కచ్చితత్వంతో అవగాహన కలిగేలా పోలీసులకు సహకారం అందిస్తుంది.

**తప్పులను ఎత్తి చూపుతూ..**

ఎఫ్ఐఆర్ నమోదు తర్వాత ఏ కోణంలో విచారించాలో ఏఐ సూచిస్తోంది. విచారణ అనంతరం పోలీసులు దాఖలు చేసే ఛార్జిషీటు ఏఐ పరిశీలించి తగిన సూచనలు చేస్తుంది. ఛార్జిషీటులో దొర్లిన తప్పులను ఎత్తి చూపడంతో పాటు అదనపు సమాచారం అవసరమైతే.. పొందుపరచాలని చెబుతుంది. కోర్టులో వాదనల సమయంలో ఎలాంటి అంశాలు ప్రస్తావించాలి? డిఫెన్స్ లాయర్ నుంచి ఎలాంటి ప్రశ్నలు ఎదురుకావచ్చు? తదితర అంశాలను ముందుగానే అంచనా వేస్తుంది. సమర్థవంతంగా వాదనలు వినిపించేందుకు ఎలా సిద్ధం కావాలో సూచిస్తుంది. కోర్టులో ఏ సందర్భాల్లో ఎలా నడుచుకోవాలో చెబుతుంది.

**చెబితే రాసేస్తుంది..**

ఫిర్యాదుల నమోదుకు సంబంధించి బాధితులు చెప్పే విషయాలను రాసుకోవడం.. కంప్యూటర్‌లో నమోదు ప్రక్రియ కొన్ని సందర్భాల్లో కష్టంగా మారుతోంది. దీన్ని సులభతరం చేయడానికి ఏఐ విధానంలో బాధితులు సమస్యలు చెబుతుంటే అక్కడికక్కడే రికార్డ్ చేసి.. ఫిర్యాదును సిద్ధం చేస్తుంది. అక్షర జ్ఞానం లేనివారు, వృద్ధులు, ఫిర్యాదులు రాయలేని వారికి ఎక్కువగా ఉపయోగపడుతుంది. ఈ విధానంలో ప్రయోగాత్మకంగా ఇప్పటివరకు 54 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

**సమయం ఆదాతోపాటు కచ్చితత్వం**

జగదీశ్, జిల్లా ఎస్పీ, అనంతపురం

నేర విచారణలో ఏఐను వినియోగించడంతో సమయం ఆదా అవుతోంది. నివేదికల తయారీలో వేగంతో పాటు కచ్చితత్వం పెరుగుతుంది. తద్వారా శిక్షల శాతం పెంచేందుకు ఏఐ ఉపయోగపడుతోంది. ప్రస్తుతం జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లో నూతన సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తున్నారు. త్వరలోనే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు నమోదు చేసేందుకు ఏఐను వినియోగిస్తాం.

# పంచాయతీలో అవినీతి రాజ్

ఒంగోలు : పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి(పీఆర్ ఆర్డీ) శాఖ.. గత ప్రభుత్వంలో వైకాపా నేతల జేబు సంస్థగా మారింది. అప్పట్లో కొన్ని గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలను ఇష్టారీతిన నిర్మించినా అడ్డుకోలేదు. నిబంధనలకు నీళ్లొదిలినా కిమ్మనలేదు. ఇసుకను అమ్మేసుకున్నా పట్టించుకోలేదు. తీరా విచారించి చర్యలు చేపట్టాలని ఇప్పుడు ఆదేశిస్తున్నా.. ఇంకా కదలడం లేదు.

**వై.పాలెంలో**

గత ప్రభుత్వంలో వైకాపా నేతలు రెచ్చిపోయారు. వై.పాలెం సబ్ డివిజన్ పరిధిలో ప్రభుత్వ పనులకు కేటాయించిన ఇసుకను ఇష్టారాజ్యంగా దారి మళ్లించి అమ్మేసుకున్నారు. రూ.65 లక్షల విలువైన 17,333 మెట్రిక్ టన్నుల ఇసుకను దుర్వినియోగం చేసినట్లు విజిలెన్స్ అధికారులు రెండేళ్ల క్రితమే తేల్చారు. దీంతో కూటమి ప్రభుత్వం స్పందించింది. అప్పటి డీఈఈ జి.రతన్‌బాబు(ప్రస్తుత ఒంగోలు పీఐయూ ఈఈ), త్రిపురాంతకం మండల సైట్ ఇంజినీర్ ఎన్.వెంకటేశ్వర్లు, వై.పాలెం ఏఈ పి.మహంకాళయ్య, పుల్లలచెరువు ఏఈ టి.నాగప్పలపై విచారణకు ఆదేశిస్తూ గత నెల 20న ఉత్తర్వులు జారీ చేసింది.

**కొండపిలో కొల్లగొట్టారు** కొండపి నియోజకవర్గంలోని గుండ్లసముద్రం నుంచి చిలంకూరు మధ్య ఐదు వంతెనలు నిర్మించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. నిర్మాణ పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు నిర్ధారించి 2024 జులై 22న నివేదిక సమర్పించారు. బాధ్యులైన అప్పటి సింగరాయకొండ ఏఈఈ సి.శ్రీధర్‌రెడ్డితో పాటు డీఈఈ(పీఐయూ ఎస్డీ) జి.గంగయ్య, ఈఈ(పీఐయూ ఒంగోలు) వి.మారుతీరాంపై చర్యలు తీసుకోవాలని, మూడు గుత్తేదారుల సంస్థల నుంచి రూ.2.96 లక్షలు రికవరీ చేయాలని సిఫార్సు చేశారు. ఆ మేరకు గత నెలలో ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు.

**ప్చ్.. ఆదేశించినా కదలిక లేదు**

రోడ్లు, భవనాల శాఖ కార్యాలయ ఖర్చుల నిమిత్తం సర్కారు విడుదల చేసిన రూ.21.29 లక్షలకు లెక్కలు సరిగా లేవని అకౌంటెంట్ జనరల్ ఆఫీస్(ఏజీ) ఆడిట్ అధికారులు గుర్తించారు. మెమోలు జారీ చేసినా లెక్కలు సమర్పించని సంబంధిత సీనియర్ అసిస్టెంట్‌పై క్రిమినల్ చర్యలకు ఆదేశించారు. అయినా పంచాయతీ రాజ్ శాఖలో మాత్రం ఎలాంటి కదలిక లేదు. అక్రమాలు గుర్తించిన వెంటనే ఉన్నతాధికారులు విచారణ పేరిట చర్యలు తీసుకోకుండా జాప్యం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్కారు సొమ్ము దుర్వినియోగం చేసిన వారిపై పక్కా చర్యలు తీసుకుంటేనే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పీఆర్‌ఆర్డీ ఎస్ఈ నిశాంత్ హుస్సేన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక్కొక్కటిగా విచారణ చేస్తున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# మామిడి.. మిగలని దమ్మిడి

పాకాల : మామిడి రైతుల బతుకులు వీధిన పడుతున్నాయి. కాయలను అడిగేవారు లేక, గిట్టుబాటు ధరలు దక్కక, ఆదాయం రాక, అప్పులు తీర్చలేని దుస్థితి వారిని మరింత కష్టాల్లోకి నెడుతోంది. సీజన్ సగం ముగుస్తున్నా గుజ్జు పరిశ్రమలు దాష్టీకాన్ని ప్రదర్శిస్తున్నాయి. మండీల్లో ఎటుచూసినా కాయలతో నిండిపోవడంతో ఇక వద్దంటూ పంటను తీసుకోవడం లేదు. దీంతో ఇప్పటికీ తోటల్లో ఉన్న పంటను కోసి అమ్ముకోలేని దారుణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. మామిడిని నమ్ముకున్న చిరు వ్యాపారులు సైతం ఏళ్లుగా కూడబెట్టుకున్న సొమ్ము పోయి రోడ్డున పడుతున్నారు.

**పదిహేను ఎకరాల తోట.. పెట్టుబడీ రాక**

దామలచెరువు పంచాయతీ నల్లానివారిపల్లికి చెందిన రైతు నారా బాబునాయుడు కుటుంబానికి సుమారు 15 ఎకరాల మామిడి తోట ఉంది. గతేడాది రూ.8 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది రూ.3 లక్షలు ఖర్చు పెట్టారు. పంట చేతికొచ్చింది. పక్వానికి వచ్చిన కాయలు మాగి రాలుతున్నాయి. ఏదో ఒక ధరకైనా కాయలను కోసి అమ్మేద్దామంటే అడిగేవారు లేరు. పెట్టుబడి ఖర్చులైనా వస్తాయనే



నమ్మకం పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కమ్మిన దైన్యం**

పులిచెర్ల మండలం మంగళంపేటకు చెందిన షేక్ ఇస్మాయిల్‌కు 5 ఎకరాల మామిడి తోటతోనే జీవనం. నీటి కొరత రావడంతో రూ.3 లక్షలు అప్పుచేసి బోరు తవ్వాడు. విద్యుత్ సర్వీసుకు రూ.60 వేలు ఖర్చు పెట్టాడు. కనీసం 15 టన్నుల దిగుబడి వస్తుందని, కష్టాలు గట్టెక్కవచ్చని ఆశపడ్డాడు. ధరలు పడిపోవడంతో అప్పులెలా తీర్చాలో తెలియక సతమతమౌతున్నాడు.

**పదేళ్ల సంపాదన ఆవిరి**

దామలచెరువుకు చెందిన కోవూరు చిన్నబ్బసాహెబ్ పదేళ్లుగా చిన్న చిన్న తోటల్లో పంట కొంటూ వ్యాపారం చేస్తున్నారు. ఈ సారి రూ.15 లక్షలు పెట్టి పాతిక మంది రైతుల తోటలను లీజుకు తీసుకున్నారు. ఇప్పటి వరకు రూ.3 లక్షల రాబడి వచ్చింది. ఇంకా తోటల్లో మిగిలిన పంటను పూర్తిగా కోసి అమ్ముకున్నా మరో రూ.2 లక్షలకు మించి వచ్చేలా లేదు. ఈ మొత్తం కోత కూలీలు, రవాణా ఖర్చులకు సరిపోతోంది. రైతుల వద్దకు వెళ్లి తగ్గించుకోమని ప్రాధేయపడినా స్పందన కరవైంది. పదేళ్ల సంపాదన పూర్తిగా పోయిందని కుంగిపోతున్నాడు.

# కన్నీటి గాయం.. ఆపదలో సాయం

కర్నూలు : రహదారి ప్రమాదాల్లో గాయపడిన, ప్రాణాలు కోల్పోయిన బాధితులకు కేంద్రం చేయూతనిస్తోంది. ఆయా కుటుంబాలకు అండగా ఉండేందుకు సాయమందిస్తోంది. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన సందర్భంలో సదరు వాహనాన్ని పోలీసులు గుర్తించే వరకు ప్రమాద బీమా వర్తించదు. ఇలాంటి ఘటనల్లో క్షతగాత్రులు లేదా చనిపోయినవారి కుటుంబాలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. హిట్ అండ్ రన్ పథకం కింద ఆర్థిక సాయం అందిస్తూ కొండంత అండగా నిలుస్తోంది. ఈ పథకం కింద మృతి చెందిన వారికి సంబంధించి బాధిత కుటుంబ సభ్యులకు రూ.2 లక్షలు, గాయపడినవారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందుతుంది. కానీ చాలామంది బాధితులకు దీనిపై అవగాహన లేదు. ఫలితంగా పథకాన్ని సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి.

**అక్కడే ఆలస్యం**

హిట్ అండ్ రన్ పథకానికి సంబంధించి ఆర్డీవో నోడల్ అధికారిగా ఉంటారు. ప్రమాదానికి సంబంధించి బాధితులు ఎఫ్ఐఆర్‌తో పాటు ఆధార్ పత్రాలు, సమగ్ర సమాచారాన్ని నివేదిక రూపంలో అందించాలి.



ఆర్డీవో దీనిని పరిశీలించి కలెక్టర్‌కు సిఫారసు చేస్తారు. పోలీసు శాఖ నుంచి నివేదిక అందిన తర్వాత 15 రోజుల్లో పరిహారాన్ని బాధితుల ఖాతాలో జమ చేస్తారు. కాగా పోలీసులు, ఆర్డీవో ఇచ్చే నివేదికలపైనే పరిహారం ఆధారపడి ఉంటుంది.

**జిల్లా న్యాయసేవాధికార సంస్థ చొరవ**

హిట్ అండ్ రన్ కేసులపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రత్యేక దృష్టి సారించి నిత్యం సమీక్షిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ 30న నగరంలోని న్యాయసేవాసదన్‌లో రెవెన్యూ, పోలీసు అధికారులతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి పలు కేసులపై చర్చించారు. కర్నూలు జిల్లాలో 76, నంద్యాల జిల్లాలో 38 హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి నివేదికలు సిద్ధమవుతున్నట్లు తెలుసుకున్నారు. బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

**దరఖాస్తు ఇలా..** రహదారి ప్రమాదాల్లో గాయపడినవారు, మృతి చెందిన వారికి సంబం ధించి బాధితుల కుటుంబసభ్యులు హిట్ అండ్ రన్ కింద పరిహారం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. క్షతగాత్రులు ఫారం-1లో వ్యక్తిగత వివరాలతోపాటు ప్రమాద స్థలం, జరిగిన సమయం, గాయాల వివరాలు, ఎఫ్ఐఆర్ కాపీ, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు జత చేయాల్సి ఉంటుంది. మృతి చెందితే వారి తల్లిదండ్రులు గానీ.. భార్య ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, చనిపోయిన వ్యక్తి మరణ ధ్రువీకరణ పత్రాన్ని జత చేసి అందించాలి. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది పరిహారం పొందాలనుకుంటే ఫారం-4 దరఖాస్తు పూరించి ఆసుపత్రి బిల్లులు జత చేయాల్సి ఉంటుంది. అధికారులు దరఖాస్తును పరిశీలించి ఫారం-2, ఫారం-3 నమోదు చేసి కలెక్టరేట్ లోని సి.సెక్షన్‌కు పంపుతారు. అక్కడినుంచి కలెక్టర్‌కు దరఖాస్తు చేరుతుంది.

చురకలు



# అకాల వర్షం.. అపార నష్టం

చిత్తూరు : ప్రకృతి వైపరీత్యాలు రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి.. వేసవి వచ్చిందంటే ఈదురు గాలులు ఎప్పుడు వీస్తాయోనన్న భయం వెంటాడుతోంది.. అసలే ఈ ఏడాది మామిడి పూత ఆలస్యం.. ఆపై అంతంత మాత్రంగానే మామిడి పంట.. కాయలు పక్వానికి వచ్చేదశ.. మరో నెలరోజుల్లో చేతికొచ్చే సమయంలో పెనుగాలుల వర్షంతో తోటల్లోని పంట నేల రాలడంతో ఉద్యాన రైతులకు తీరని నష్టం వాటిల్లింది.

**550 టన్నులు నేలపాలు**

జిల్లాలో గాలివాన బీభత్సానికి చిత్తూరు గ్రామీణ మండలం, యాదమరి, గంగాధరనెల్లూరు, పెనుమూరు, తవణంపల్లె, బంగారుపాళ్యం తదితర



ప్రాంతాల్లో 550 టన్నుల కాయలు నేల రాలినట్లు ఉద్యానశాఖ అంచనా. గాలుల తీవ్రతకు 10-15 ఏళ్ల వయసుగల చెట్లు సైతం కూలిపోయినట్లు చిత్తూరు గ్రామీణ మండలం సిద్ధంపల్లెకు చెందిన ఉద్యాన రైతు సాంబశివనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా వందకు పైగానే మామిడి చెట్లు కూలిపోయాయని అధికారులు చెబుతున్నారు.

**టన్ను రూ.5 వేలు..:** రాలిన మామిడి కాయలను రైతులు ట్రాక్టర్లు తదితర వాహనాల్లో పెద్దఎత్తున చిత్తూరు మామిడి యార్డుకు తరలించారు. టన్ను రూ.5 వేలకు వ్యాపారులు కొనుగోలు చేశారని, కనీసం కూలి, రవాణా ఖర్చులు రాలేదని రైతులు వాపోతున్నారు.

**ఈదురు గాలుల వర్షబీభత్సం**

జిల్లాలో ఈదురుగాలుల వర్షం కురిసింది. చిత్తూరు నగరంలోని పలు పాంతాల్లో చెట్లు కూలిపోవడం, విద్యుత్తు లైన్లు తెగిపోవడంతో రాకపోకలు, విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నగర వీధులు జలమయమయ్యాయి. శనివారం రాత్రి జిల్లాలోని నాలుగు మండలాల్లో అకాల వర్షం కురిసింది. వెదురుకుప్పం మండలంలో 17.4 మి.మీటర్లు, పులిచెర్ల 11.2, సదుం 5.2, రొంపిచెర్ల మండలంలో 1.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.

**నేలకూలిన 15 విద్యుత్తు స్తంభాలు**

చిత్తూరు నగరంలో 15 విద్యుత్తు స్తంభాలు నేలకూలాయి. సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తక్షణమే ఈఈ మునిచంద్ర పర్యవేక్షణలో సరఫరా పునరుద్ధరించారు.

# మట్టి వేసి.. కనికట్టు చేసి

నంద్యాల : నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి, ప్రకాశం, నెల్లూరు జిల్లాల తాగు, సాగునీటి అవసరాలు తీర్చడంతో పాటు చెన్నై నగరవాసుల దాహార్తి తీర్చే వెలుగోడు జలాశయం నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇటీవల చేసిన పనుల్లో నాణ్యత కరవైంది. పైపైన చేసి మమ అనిపించేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరవైందన్న విమర్శలున్నాయి. వెలుగోడు జలాశయాన్ని దశాబ్దాల కిందట 476 హెక్టార్లలో 16.323 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఒక్క పైసా కేటాయించ లేదు. కనీసం నిర్వహణ నిధులు కూడా మంజూరుచేయకపోవడంతో నిర్వహణ అధ్వానంగా మారింది. 11.64 కి.మీ పొడవున్న ఆనకట్టపై అడుగడుగునా గుంతలు పడ్డాయి. కంపచెట్లు ఏపుగా పెరిగిపోయాయి. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం కొంతమేర నిధులు కేటాయించింది. పనులపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో నాసిరకంగా జరిగాయి. ఫలితంగా నిధులు ఖర్చయినా ప్రయోజనం లేకపోయిందన్న విమర్శలున్నాయి.

**ప్రమాదకరంగా మారి..** జలాశయం కట్టపై 3.2 కి.మీ నుంచి 11 కి.మీ వరకు గుంతలు పూడ్చేందుకు వేసిన మట్టి ఇటీవల కురిసిన వర్షాలకు చాలాచోట్ల జారిపోయి గుంతలు పడ్డాయి. కట్ట 4.5-5.2 మీటర్ల వెడల్పు ఉండగా కొన్నిచోట్ల 3.5 మీటర్ల వరకే మట్టి వేశారు. దీంతో కట్టకు ఒకవైపు ప్రయాణించాలంటే ప్రమాదకరంగా మారింది. కొన్నిచోట్ల కోతకు గురైంది. కొన్నిచోట్ల ముళ్లపొదలను తొలగించకుండా తగులబె ట్టారు. రాతికట్టలోకి వెళ్లిన చెట్ల వేర్లను పూర్తిగా తొలగించకుండా వదిలేశారు.

**కొన్నాళ్లకే నాణ్యత జారి..**

జలాశయం కట్టపై వాహనాలు తిరిగేందుకుగాను రహదారి ఏర్పాటుకు నిధులు అవసరమని ప్రతిపాదించారు. కట్టపై గుంతలు పడ్డాయి. 0.3 కి.మీ నుంచి 0.6 కి.మీ వరకు మొరుసుతో గుంతలు పూడ్చి చదును చేయడంతోపాటు మట్టి పేర్చే పనులకు ఎస్‌డీఎంఎఫ్ కింద రూ.19 లక్షలు మంజూరయ్యాయి. 3.2 కి.మీ నుంచి 11 కి.మీ వరకు పడిన గుంతలను పూడ్చడంతో పాటు కంపచెట్లు తొలగించేందుకు రూ.9 లక్షలు ఇచ్చారు. రెండు ప్యాకేజీలుగా చేసి రూ.28 లక్షల అంచనాతో చేపట్టి మార్చిలో ప్రారంభించి పూర్తి చేశారు. కట్టపై వేసిన మట్టి అప్పుడే కిందకు జారిపోతుండటం గమనార్హం.

**రూ.21 లక్షలే మంజూరు** జలాశయం కట్ట పటిష్టత, నిర్వహణకు రెండు ప్యాకేజీల కింద రూ.28 లక్షలు మంజూరు చేసినట్లు దస్త్రాలు చెబుతున్నా విడుదలైంది మాత్రం రూ.21 లక్షలే. మొదటి ప్యాకేజీలో భాగంగా రూ.19 లక్షలు మంజూరు చేసినా జీఎస్టీ, సీనరేజీ ఛార్జీలు, మినరల్ ఫండ్ తదితరాలు పోగా రూ.14 లక్షలు మాత్రమే గుత్తేదారుకు చెల్లించారు. రెండో ప్యాకేజీలో రూ.9 లక్షలు మంజూరైనా వాస్తవంగా వచ్చింది రూ.7 లక్షలే. రూ.28 లక్షలకు ప్రతిపాదించి రూ.21 లక్షలు మాత్రమే మంజూరు చేయడంతో పనుల నాణ్యతపై ప్రభావం చూపింది.**కానరాని పర్యవేక్షణ**

స్పిల్‌వే గేట్ల మరమ్మతులు, నీటి నియంత్రణ పనులు, గేర్ బాక్సులు మార్చేందుకు మరో రూ.35 లక్షలు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఈ పనులు జరుగుతున్నాయి. గత కొన్నేళ్లుగా స్పిల్‌వేకు సంబంధించి గేర్ బాక్సులు సరిగా పనిచేయడం లేదు. వాటిని మార్చేందుకు వైకాపా ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. ప్రస్తుతం నిధులు వచ్చినా పనులపై సరైన పర్యవేక్షణ కరవైంది. గతంలో ఇదే ప్రాంతంలో ఆనకట్ట తెగిపోయింది.మరోవైపు 1ఆర్ తూము వద్ద తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయి. వీటిని నియంత్రించేందుకు ప్రస్తుతం రూ.10 లక్షలు విడుదల చేశారు. కట్టకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలంటే పెద్ద మొత్తంలో నిధులు అవసరమవుతాయి. ప్రస్తుతం కొంతమాత్రమే ఇచ్చారు. ఈ పనులు సైతం నాసిరకంగా జరుగుతుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# నడిరోడ్డుపై విగ్రహాలు.. అరచేతిలో ప్రాణాలు



కొత్తచెరువు : నడిరోడ్డుపై విగ్రహాలు ప్రజలకు దినదినగండంగా మారుతున్నాయి. ప్రయాణ సమయంలో పెనుముప్పుగా పరిణమిస్తున్నాయి. వాటిని తగిలి చాలామంది గాయాలపాలవుతున్నా అధికారులు తీసేయకుండా మొద్దునిద్ర వీడటం లేదు. కొత్తచెరువులో ప్రధాన రహదారి మధ్యలో ఎలాంటి అనుమతులు లేని విగ్రహాలు పెనుముప్పులు తెచ్చిపెడుతున్నాయి. పుట్టపర్తికి చెందిన విద్యార్థిని సాయివర్షిణి ఆదివారం నీట్ పరీక్ష రాయడానికి బస్సులో అనంతపురం వెళుతూ విగ్రహం దిమ్మె తగిలి తీవ్రంగా గాయపడిన ఘటన పలువురిని తీవ్రంగా కలచివేసింది. ఇరుకు రహదారుల్లో విగ్రహాలున్న ప్రదేశాల్లో అప్రమత్తత చర్యలు తీసుకోవాలనే హెచ్చరికల ఆవశ్యకత చెప్పకనే చెబుతున్నాయి. అనంతపురం, కదిరి, హిందూపురం, గోరంట్లకు వెళ్లే మార్గాలు కొత్తచెరువులో కలుస్తాయి. నిత్యం ఈ కూడలి మీదుగా వాహనాల రద్దీ ఉంటుంది. నడిరోడ్డులో ఏర్పాటు చేసిన విగ్రహాలు ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారాయి. ఎటువైపు నుంచి వచ్చినా మండల కేంద్రంలో దాదాపు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు ప్రయాణించాల్సి ఉంది. ఐదారు దశాబ్దాల కిందట నాలుగు రోడ్లు కలిసే చోట కూడలిలో నెహ్రూ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ధర్మవరం రోడ్డులో రెండు, పుట్టపర్తి రోడ్డులో రెండు, బుక్కపట్నం రోడ్డులో మూడు విగ్రహాలను నడిరోడ్డుపై దిమ్మెలు నిర్మించి ఏర్పాటు చేశారు. వీటికి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులు కనీసం స్పందించకపోవడం గమనార్హం. మూడు దశాబ్దాలుగా రోడ్ల ఆక్రమణల తొలగింపునకు పలుమార్లు సర్వేలు చేసి మార్కింగ్ వేసినా చర్యలు శూన్యం.

**ఆక్రమణలతో ఇరుకుగా మారి**

కొత్తచెరువులో నాలుగు ప్రధాన రహదారులు ఇరువైపులా ఆక్రమణకు గురయ్యాయి. కొంతమేర శాశ్వత నిర్మాణాలు, దుకాణాల ముందు తాత్కాలిక షెడ్లతోపాటు ఎత్తుగా మట్టి వేసుకోవడంతో రోడ్డు ఇరుకుగా మారాయి. ఆటోలను అడ్డదిడ్డంగా నిలుపుతుండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తప్పడం లేదు. దుకాణాల ముందు అన్‌లోడింగ్, లోడింగ్ పేరుతో గంటల తరబడి వాహనాలు నిలుపుతున్నారు. ఇప్పటికే ఇరుకు దారుల్లో జరిగిన ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. కూడలిలో కనీసం ట్రాఫిక్ నియంత్రణ చర్యలు కనిపించడం లేదన్న విమర్శలు వ్యక్తవుతున్నాయి.

**ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులకు నివేదిస్తాం: ఇన్‌ఛార్జి సీఐ సురేశ్, కొత్తచెరువు**

కూడలిలో ప్రధాన రహదారులు ఇరుకుగా ఉన్నాయి. రోడ్ల మధ్యలో విగ్రహాలు ప్రమాదకరంగా మారాయి. ప్రతిరోజూ దుకాణాలు, రోడ్లపై నిలిపిన వాహనదారులపై చర్యలు తీసుకుని హెచ్చరిస్తున్నాం. రోడ్ల మధ్యలో విగ్రహాల ఏర్పాటుపై ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులకు నివేదిస్తాం. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతాం.

# క్యూఆర్ కోడ్‌కు 'రైట్‌రైట్'



నర్సీపట్నం : ఆర్టీసీ బస్టాండుల్లో క్యూఆర్ కోడ్‌తో సమస్యలు పరిష్కారమవుతున్నాయి. ఆర్టీసీ సేవలపై ప్రయాణికుల అభిప్రాయం తెలుసుకునేందుకు కోసం ఇటీవల ప్రవేశపెట్టిన దీనికి స్పందన బాగుంది. ప్రయాణికులు తమ ఎదురైన ఇబ్బందులకు తోడు సంతృప్తికర సేవల సమాచారాన్ని తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లగలుగుతున్నారు. ప్రభుత్వ సంస్థలు తదితర వాటిలో ఇప్పటికే క్యూఆర్ కోడ్‌తో వినియోగదారుల ఫీడ్‌బ్యాక్‌ను ఆహ్వానిస్తున్నారు. ఆర్టీసీలోనూ నెల రోజుల కిందట ఇది అమల్లోకి వచ్చింది.

**సేవల్లో పారదర్శకతకు..** ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర సంస్థల్లో పారదర్శకత కోసం క్యూఆర్ కోడ్ అమలవుతోంది. ప్రస్తుతం జిల్లా కేంద్రాల్లోనే ఆర్టీసీ వీటిని ప్రవేశపెట్టింది. తొలి దశలో అనకాపల్లి, నర్సీపట్నం డిపోలోనూ ఇవి అందుబాటులోకి వచ్చాయి. బస్టాండుల్లోని పలుచోట్ల, దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లోనూ ఉన్నాయి. కోడ్ స్కాన్ చేయగానే తాగునీరు, పరిశుభ్రతకు సంబంధించిన పలు అంశాలు సెల్‌ఫోన్ తెరపై కనిపిస్తాయి. వాటికి ఎదురుగా ఉన్న అవును, కాదు అనేచోట తాకడం ద్వారా మన అభిప్రాయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్తుంది. జిల్లాలోని రెండు డిపోల్లో నెల రోజుల్లోనే 250 మంది స్కాన్ చేసినట్లు సమాచారం.

**పరిష్కారమైన సమస్యలివీ..**

: బస్సుల రాకపోకల వేళలు తెలియక ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఓ ప్రయాణికుడు ఫిర్యాదు చేయగా.. అన్ని ప్లాట్‌ఫాంలపై పాఠశాల యాజమాన్యాల సహకారంతో బోర్డులను ఏర్పాటు చేశారు.

: బస్టాండులో ఫ్యాన్లు తిరగడం లేదంటూ గతంలో ఫిర్యాదులు వచ్చేవి. క్యూఆర్ కోడ్‌లో ఈ విషయాన్ని ప్రస్తావించడగా అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు.

నర్సీపట్నం బస్టాండులో గతంలో సీఎంఆర్ సంస్థ ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు కాలక్రమంలో మూలకుచేరింది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన ఓ ప్రయాణికుడు ఈ అంశాన్ని ప్రస్తావించడంతో దాతల సాయంతో వినియోగంలోకి తీసుకువచ్చారు.

**ఫిర్యాదూ చేయవచ్చు...** నర్సీపట్నం బస్టాండులో క్యూఆర్ కోడ్ ద్వారా నెల రోజుల్లో 105 మంది పలు సమస్యలను ప్రస్తావించారు. వాటన్నింటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాం. అభిప్రాయాల తోపాటు ఫిర్యాదులూ చేయవచ్చు. సేవలు బాగుంటే బాగున్నాయని, లేకుంటే లేదని నిర్మొహమాటంగా తెలియజేయవచ్చు.

ధీరజ్, ఆర్టీసీ డీఎం, నర్సీపట్నం

# 'పురిట్లోనే' పుట్టెడు శోకం



అనకాపల్లి : మాతా, శిశు మరణాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. గత మూడు నెలల్లో జిల్లాలో నలుగురు తల్లులు ప్రసవ సమయంలో మృతి చెందగా, పురిట్లోనే 29 మంది శిశువులు మరణించారు. ఒక్క మరణమూ సంభవించకూడదని ప్రభుత్వం రూ.కోట్లలో నిధులు ఖర్చు చేస్తున్నా.. ఆశించిన ఫలితాలు ఉండటం లేదు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలకు మెరుగైన సదుపాయాలున్నా.. కొంతమంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. చివరి నిమిషంలో సరైన వైద్యం అందక తురకలపూడి, మాకవరం గ్రామాలకు చెందిన ఇద్దరు తల్లులు ప్రసవ సమయంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు సంబంధించి విశాఖపట్నంలోని సూర్య ఆసుపత్రి, ఆరాధ్య సంతాన సాఫల్య కేంద్రంపై కలెక్టర్ విజయకృష్ణన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తొలిసారిగా రెండు ప్రైవేటు ఆసుపత్రులపై కేసు నమోదు చేసేందుకు వైద్యారోగ్య శాఖాధికారులు సన్నద్ధమయ్యారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్యం.. సదుపాయాలపై పర్యవేక్షించాల్సిన వైద్యారోగ్య శాఖాధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్ల సంఖ్య పెరిగేందుకు ఇదో కారణంగా కనిపిస్తోంది. నెలలు నిండాక ఏదోఒక కారణం చెప్పి సిజేరియన్ చేస్తూ రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు బిల్లు వేస్తున్నారు. దీంతో అవసరం లేకపోయినా ఆపరేషన్లు చేస్తున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్సకు వచ్చే గర్భిణులకు నెలవారీగా అందించే చికిత్సతోపాటుగా వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. బిడ్డ ఎదుగుదలతోపాటు తల్లి ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పరిశీస్తున్నారు. సాధారణ ప్రసవం కోసం ఫిజియోథెరపిస్టుతో వ్యాయామం చేయిస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇదేమీ కానరావడం లేదు. రూ.వేలల్లో బిల్లుల రూపేణా దండుకోవాలన్నదే తప్ప.. తల్లీబిడ్డ క్షేమం గురించి ఆలోచన చేయడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.సిజేరియన్ చేయాల్సి వచ్చినా, ప్రసవ సమయంలో మాతా, శిశు మరణాలు సంభవించినా కారణమేంటని ప్రభుత్వ వైద్యులు ఉన్నతాధికా రులకు నివేదిక ఇవ్వాలి. ప్రైవేటు ఆసుపత్రులకు ఇవేమీ లేవు, ఇటీవల కాలంలో పిల్లలు పుట్టక చాలామంది సంతాన సాఫల్య కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. మందుల నుంచి డెలివరీ వరకు ప్యాకేజీ మాట్లాడు కుని చికిత్స అందిస్తున్నారు. ప్రసవ సమయంలో ఏదైనా తేడా వస్తే రిఫర్ చేస్తున్నారు.గ్రామాలు, పట్టణాల్లో గర్భిణులు ప్రసవమయ్యే వరకు వారికి ఆరోగ్య సలహాలు, సూచనలు అందించడం ఆశా కార్యకర్తల పని. వీరిలో కొందరు ప్రోత్సాహకాలకు ఆశపడి ప్రైవేటు ఆసుపత్రులకు పంపుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ సిజేరియన్లు జరిగేలా వైద్యులతో మాట్లాడుతున్నారన్న ఫిర్యాదులున్నాయి. అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో వైద్యురాలు ప్రసూతి శస్త్రచికిత్సలకు డబ్బులు తీసుకుం టున్నారని ఫిర్యాదు రావడంతో కలెక్టర్ ఆమెను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.**రెండు ఆసుపత్రు లపై కేసులు..:** సక్రమంగా వైద్యం అందించక మాతృ మరణాలకు కారణమైన విశాఖపట్నంలోని రెండు ప్రైవేటు ఆసుపత్రు లపై తురకలపూడి, మాకవరం పీహెచ్‌సీ వైద్యులతో పోలీసులకు ఫిర్యా దు చేయించనునా నం. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు, సిబ్బం ది ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవు. మాతా, శిశు మరణాలపై మూడు నెలలకోసారి సమీక్ష నిర్వహిస్తున్నాం. అనవ సరంగా శస్త్రచికిత్సలు చేస్తున్నారని తేలితే కఠినంగా వ్యవహ రిస్తాం. నిఘా కొనసాగుతుంది. డాక్టర్ శాంతిప్రభ, ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌వో

# కూరగాయలు దరిచేరవా..?

పుత్తూరు : ఉద్యోగ, ఉపాధి కోసం పిల్లల చదువుల నిమిత్తం పట్టణాలకు వచ్చి నివసిస్తున్న, స్థిరపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నా సరిపడా రైతుబజార్లు అందుబాటులో లేవు. ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చిత్తూరు, తిరుపతి, పలమనేరు, గూడూరులో తప్ప మరెక్కడా ఇవి లేవు. గత ప్రభుత్వ హయాంలో పుత్తూరు, నగరి, పలమనేరు, తిరుచానూరు, చంద్రగిరిలో వీటి ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. పలమనేరులో పూర్తిచేసి ప్రారంభించారు. తిరుచానూరులో నిర్మాణం పూర్తయినా నేటికీ ప్రారంభించ లేదు. ప్రస్తుతం వాటి ప్రాంగణాల్లో పిచ్చిమొక్కలు మొలుస్తున్నాయి. చంద్రగిరిలో పునాదుల దశలోనే వదిలేశారు. పుత్తూరులో స్థల పరిశీలన చేశారు. నగరిలో స్థలం కూడా చూపలేదు. ప్రజాప్రతినిధులు చొరవ చూపకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.

**ప్రజలకు ఒనగూరే మేలు..**

మార్కెటింగ్ శాఖ నిధులతో నిర్మించే ఈ రైతుబజార్లలో నామమాత్రపు అద్దెలకు రైతులు, స్వయం సహాయక సంఘాలకు దుకాణాలు కేటాయిస్తారు. వీటి నిర్వహణకు ఎస్టేట్ ఆఫీసర్, ఒక అటెండర్ ఉంటారు. జేసీ, డీఎస్వో, మార్కెటింగ్, ఉద్యానశాఖల అధికారులతో కమిటీ ఉంటుంది. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే కిలోకి రూ.5 నుంచి రూ.10 తక్కువ ధరకు ఇక్కడ కూరగాయలు లభ్యమవుతాయి.



టమాటా, ఉల్లిపాయలు తదితరాల ధరలు పెరిగినపుడు రాయితీపై ఆయా ఉత్పత్తులు ప్రజలకు అందించే వెసులుబాటు ఉంటుంది.

**నిధుల కొరతతోనే..**

ప్రభుత్వం మార్కెట్ యార్డుల నిర్మాణాలకు పచ్చజెండా ఊపింది. అయితే సీఎంఎఫ్ ద్వారా బ్యాంకు రుణాలు తీసుకుని నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో మంజూరు అయినా నిర్మాణాలు పూర్తి చేయలేదు. ఈ నేపథ్యంలో వీటి నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని నిధులు మంజూరయ్యేలా కృషిచేస్తేనే ఆయా ప్రాంతాల్లో రైతుబజార్లు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.

ఉమ్మడి జిల్లాలో నగరపాలక సంస్థలు: 2

పురపాలికలు: 10

ప్రస్తుతం ఉన్న రైతుబజార్లు: 4

నిత్యం వినియోగదారులు: 2 వేలకు పైచిలుకు

అవసరమైన ప్రదేశాలు: శ్రీకాళహస్తి, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట, కుప్పం, పుంగనూరు, పుత్తూరు, నగరి

# ఉపాధి.. సంతృప్తి

కర్నూలు : నలుగురు మహిళా సభ్యులను ఒక యూనిట్‌గా ఏర్పాటుచేసి తృప్తి క్యాంటీన్లు అప్పగిస్తారు. దీనిని నడిపేందుకుగాను 20 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో కంటెయినర్‌ను ప్రభుత్వం సమకూరుస్తుంది. వంట, నిర్వహణ అంశాలపై శిక్షణ ఇస్తుంది. పర్యావరణ హితాన్ని కాంక్షిస్తూ ఎలక్ట్రిక్ పరికరాలు అందిస్తారు. సౌరశక్తిని ఉపయోగిస్తారు. ప్రస్తుతం విపణిలో ఆహార పదార్థాలకు మంచి డిమాండు ఉంది. ఉమ్మడి జిల్లాలో ప్రతిరోజూ రూ.కోట్లల్లో వ్యాపారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మహిళలకు ఉపాధి చూపేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పట్టణ ప్రాంతాల్లో 'తృప్తి' క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఏపీ మెప్మా, ఓ సంస్థ ఉమ్మడి భాగస్వామ్యంతో వీటిని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థ, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, గూడూరు పురపాలక సంఘాలతోపాటు బేతంచెర్ల నగర పంచాయతీలో కలిపి 25,300 స్వయం సహాయక పొదుపు సంఘాలున్నాయి. 2,58,823 మంది మహిళలున్నారు.

**ఒక్కొక్కరు రూ.3.10 లక్షల చొప్పున..**

క్యాంటీన్ నిర్వహణకు పెట్టుబడి రూ.16.40 లక్షలుగా నిర్ణయించారు. ఒక్కో క్యాంటీన్‌కు సంబంధించి నలుగురు స్వయం సహాయక సంఘాల సభ్యులుంటే ఒక్కొక్కరు రూ.3.10 లక్షల చొప్పున రూ.12.40 లక్షలు పెట్టుబడి పెట్టాలి. మిగతా పెట్టుబడి మొత్తం.. కంటెయినర్, యంత్ర పరికరాలు, సౌర విద్యుత్తు, ఇతర అవసరాల రూపంలో మెప్మా, ఓ



సంస్థ ప్రతినిధులు చేయూతనిస్తారు. ఒక్కో క్యాంటీన్ నెలవారీ టర్నోవర్ రూ.6.39 లక్షలు ఉండేలా.. ప్రతినెలా లాభం రూ.2.46 లక్షలు వచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది.

**కాలుష్య రహితంగా..**

వంట కోసం వంద శాతం ఎలక్ట్రిక్, పీఎం సూర్యఘర్ కింద సౌర విద్యుత్తు వినియోగిస్తారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజన సదుపాయం ఉంటుంది. అనుభవజ్ఞులైన చెఫ్‌లు, ఎప్పటికప్పుడు అధికారుల ఆహార తనిఖీలు నిర్వహించి పలు సూచనలు అందిస్తారు. ఎప్పటికప్పుడు ఖాతాదారుల అభిప్రాయాలు తెలుసుకుని క్యాంటీన్లను సమర్థంగా నడిపిస్తారు. సంతృప్తి చెందేలా ఆహారం అందిస్తారు.

**24 గంటలు పనిచేసేలా..**

ఈ ఏడాది మార్చి 8 నుంచి జూన్ 8వ తేదీలోగా కర్నూలులో 10, ఆదోని 02, ఎమ్మిగనూరు 01 తృప్తి క్యాంటీన్లను స్వయం సహాయక పొదుపు మహిళలతో ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నంద్యాల జిల్లాలోనూ పది వరకు ఏర్పాటు చేయనున్నారు. వీటిని నగరంతోపాటు పట్టణ ప్రాంతాల్లోని ముఖ్యమైన ప్రధాన కూడళ్లు, హైవేను ఆనుకుని ఉన్న ప్రదేశాలను ఎంపిక చేయడంతోపాటు 24 గంటలు పనిచేసేలా చూస్తారు.

# చెరువు మట్టి దోచేస్తున్నారు!

తాడిపత్రి : వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రకృతి వనరులను కొల్లగొట్టేశారు.. కొండలనే కాకుండా చెరువులనూ చెరబట్టి మట్టిని అక్రమంగా తరలించి కోట్లాది రుపాయలు సంపాదించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వారి ఆగడాలు కొనసాగు తూనే ఉన్నాయి. యాడికి మండలంలోని రాయలచెరువు గ్రామంలోని చెరువు మట్టిని కొంతమంది అక్రమార్కులు యథేచ్ఛగా భారీ వాహనాలతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

**500 ఎకరాల్లో దోపిడీ**

గ్రామ పరిసరాల్లో సుమారు 500 ఎకరాల్లో చెరువు విస్తరించి ఉ ంది. ఇందులోని మట్టిని తవ్వి కొందరు అక్రమార్కులు భారీ వాహనా లలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వైకాపా ప్రభుత్వం నుంచే ఈ అక్రమ మట్టి వ్యాపారం కొనసాగుతూ వస్తోంది. ప్రస్తుతం చెరువులో నలుగురు మట్టి వ్యాపారులు రెండు ఇటాచీలు, 30 టిప్పర్లతో రోజూ మట్టిని తవ్వుతూ తరలిస్తున్నారు. మట్టిని స్థానికంగా ఉన్న రైతులకు, నంద్యాల జిల్లాలోని పలు గ్రామాల్లోని రైతుల పొలాల్లోకి ఇతర పనుల నిమిత్తం తరలిస్తున్నారు. నంద్యాల జిల్లాకు తరలిస్తే టిప్పర్‌కు రూ. 6



నుంచి 10వేల వరకు ధర పలుకుతోంది. అంతేకాకుండా యాడికి ప్రాంతంలోని రైతుల పొలాల్లోకి మట్టిని తరలిస్తే రూ. 3 నుంచి 6వేల వరకు విక్రయిస్తున్నారు. రోజుకి సుమారు వంద ట్రిప్పులకుపైగా ఇతర ప్రాంతాలకు తరలిపోతోంది.

**గ్రామీణ రహదారులు అధ్వానం**

గ్రామీణ రహదారులు గుండా తరలించడంతో మార్గాలన్నీ అధ్వానంగా మారాయని స్థానికులు వాపోతున్నారు.దీనిపై యాడికి తహసీల్దారు కె.ప్రతాప్‌రెడ్డిని వివరణ కోరగా చెరువులో మట్టి తవ్వకాలకు ఎవరికీ అనుమతులు లేవన్నారు. ఇటీవల కొందరు రైతులు అనుమతులు కోరగా కలెక్టర్, ఇరిగేషన్ శాఖ అధికారులకు నివేదిక పంపామన్నారు.

# ఖజానా శాఖకు కొత్త భవనాలు

నక్కపల్లి : జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఉప ఖజానా కార్యాలయ భవనాల పనులు తుదిదశకు చేరాయి. ఇవి పూర్తయితే దీర్ఘకాలంగా ఆయా శాఖల ఉద్యోగులు పడుతున్న కష్టాలకు తెరపడనుంది. పాయకరా వుపేట, కోటవురట్ల, నర్సీపట్నంలో ప్రస్తుతం ఉన్న ఉప ఖజానా కార్యాలయాల స్థానే నూతన భవనాలను గతేడాది ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కో దానికి రూ.75 లక్షల చొప్పున కేటాయించారు. పాయకరావుపేట ఖజానా కార్యాలయ భవనాన్ని నక్కపల్లిలో నిర్మించాలని నిర్ణయించారు. పూర్వం ఈ కార్యాలయం నక్కపల్లిలోనే ఉండగా, పదేళ్ల కిందట 'పేట'కు తరలించారు. తిరిగి నక్కపల్లిలో నిర్మించేలా మంత్రి అనిత ఆదేశాలిచ్చారు. దీంతో స్థల



సేకరణ పనులు మొదలు కాలేదు. మిగిలిన రెండు భవనాల పనులను ప్రారంభించారు. నర్సీపట్నంలో కార్యాలయ భవనాన్ని ప్రస్తుతం ఉ న్న కార్యాలయానికి సమీపంలోనే నిర్మిస్తుండగా, కోటవురట్లలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ స్థలంలో చేపట్టారు. ప్రతి చోటా రెండంతస్తుల్లో విశాలమైన గదులతో నిర్మిస్తున్నారు. వీటిలో కార్యాలయ ఆవరణ, ముఖ్య అధికారి గది, స్ట్రాంగ్ రూం, కారిడార్, మరుగుదొడ్లు తదితర సదుపాయాలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులన్నీ తుదిదశకు చేరాయి. కోటవురట్ల భవనం ప్లాస్టింగులు పూర్తిచేసి, సున్నం వేశారు. మరికొన్ని పనులు పూర్తి చేస్తే వినియోగానికి సిద్ధమవుతుంది. నర్సీపట్నంలో నిర్మాణం కొనసాగుతోంది.త్వరలోనే పూర్తి.. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భవనాలు తుది దశకు చేరాయి. గుత్తేదారుకు బిల్లుల చెల్లింపులు చేయాల్సి ఉంది. త్వరలోనే బిల్లులు జమవుతాయి. పనులు పూర్తిచేసి త్వరలోనే అందుబాటులోకి తెస్తాం. నక్కపల్లిలో భవన నిర్మాణానికి గతంలో ఉన్న ఖజానా కార్యాలయ స్థలాన్నే పరిశీలించాం. తహసీల్దారు అనుమతు లు ఇచ్చారు. టెండర్లు పూర్తికాగానే పనులు చేపడతాం. ప్రసాద్, డీఈఈ

# స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల వెల్లువ

సూర్యాపేట : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వాటిని అభ్యంతరం లేకుంటే క్రమబద్ధీకరించాలని తలచింది. ప్రత్యేకంగా జీవో 30 విడుదల చేసింది. క్రమబద్ధీకరణ పథకం-2025కు సూళ్లూరుపేట, గూడూరు డివిజన్లలో ఎక్కువమంది దరఖాస్తు చేసుకుంటున్నారు. వీటిని క్షేత్రస్థాయిలో వీఆర్వోలు విచారిస్తున్నారు. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూముల్లో చాలామంది స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో క్రమబద్ధీకరణ పథకం-2025 కింద అక్రమణలేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు కట్టుకున్నవారు పట్టా కోసం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. అయితే 2019 అక్టోబరు 15వ తేదీకి ముందు ప్రభుత్వ స్థలంలో నిర్మించుకుని ఉండాలి.

మూడు రకాలుగా విభజన పథకం కింద 150 చదరపు గజాల లోపు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని ఇల్లు కట్టుకుంటే అలాంటి వాటిని ఉచితంగా క్రమబద్ధీకరణ చేసి, పట్టా మంజూరు చేస్తారు.151 నుంచి 300 చదరపు గజాల ప్రభుత్వ స్థలంలో ఇల్లు ఉంటే బీపీఎల్ అయితే 15 శాతం బేసిక్ వాల్యూ(బీవీ), 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు (ఆర్ఎఫ్) చెల్లించాలి. మిగిలవాళ్లైతే 15 శాతం బేసిక్ వాల్యూ, యథావిధిగా రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. 301 నుంచి 450 చదరపు గజాల్లో అయితే బీపీఎల్ లబ్ధిదారులు పండితాం బీవీ, 50 శాతం ఆర్ఎఫ్, ఏపీఎల్ 200 శాతం బీవీ, ఆర్ఎఫ్ చెల్లించాలి.

451 చదరపు గజాలపైన అయితే బీపీపై ఐదు రెట్లు, ఆర్ఎఫ్ చెల్లిస్తే క్రమబద్ధీకరణ చేస్తారు. ఈ అవకాశం ఐదేళ్లపాటు ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరణకు ఈ ఏడాది చివరిలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. వీఆర్వో, సచివాలయ సిబ్బంది వాటిని విచారించి తహసీల్దార్, పుర కమిషనర్, ఆర్డీవోలకు నివేదిస్తారు. వారు సబ్ డివిజన్ కమిటీలో ఆమోదించి, అర్హులకు పట్టాలు మంజూరు చేయనున్నారు.

**వీటిని చేయరు**మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలు, లేఅవుట్ స్థలాలు, కాలువలు, నదీ పరివాహక ప్రాంతాలు, చెరువులు, గుంతలు, తదితర వాటిల్లో ఇల్లు నిర్మించిన వాటిని క్రమబద్ధీకరించరు.

# నిఘా నీడలో.. రైల్వే డివిజన్




గుంతకల్లు : ప్రయాణికుల భద్రత, సంఘ వ్యతిరేక శక్తులను కట్టడి చేయడానికి గుంతకల్లు రైల్వే డివిజన్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దొంగలనే కాకుండా రకరకాల నేరాలు చేసే వారి కదలికలను గుర్తించి వారి చిత్రాలను నిక్షిప్తం చేసే దిశగా సౌర సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని స్టేషన్లలో విద్యుత్తు సాయంతో పనిచేసే కెమెరాలను ఏర్పాటు చేశారు.

**ఒక్కో కెమెరాకు రూ.25 వేలు వ్యయం**

విద్యుత్తు సరఫరా లేని సమయంలో దొంగలు, సంఘ వ్యతిరేక శక్తులను కెమెరాలు గుర్తించలేక పోతుండటంతో తాజాగా అధికారులు సౌరశక్తితో పని చేసే కెమెరాలను ఏర్పాటు చేసే పనులు చేపట్టారు. దీనికిగాను సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ అధికారులు డివిజన్‌లో సౌర సీసీ కెమెరాలను రూ.2 కోట్లతో ఏర్పాటు చేస్తున్నారు. ఒక కెమెరాకు రూ.25 వేలు ఖర్చు చేస్తున్నారు.

చకచకా పనులు: రైల్వే డివిజన్‌లో మొత్తం 160 రైల్వే స్టేషన్లున్నాయి. ఇందులో మొదటి విడత కింద 90 రైల్వే స్టేషన్లతో పాటు డీఆర్ఎం కార్యాలయం, రైల్వే డివిజనల్ ఆసుపత్రి, డీజిల్ లోకో షెడ్లలో కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే డీఆర్ఎం కార్యాలయం, ఆసుపత్రిలో కెమెరాలు అమర్చారు. రైల్వే జంక్షన్‌లో పనులు కొనసాగుతున్నాయి. ఒక్క గుంతకల్లులోనే 90 సౌర కెమెరాలు ఏర్పాటు చేయగా డివిజన్‌లోని 90 స్టేషన్లలో దాదాపు 500 కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు.

**2026 మార్చి నాటికి పూర్తి చేస్తాం**

ప్రస్తుతం సౌరశక్తి ఆధారంతో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలు నాలుగు రోజులు ఎండ లేకపోయినా పని చేస్తాయి. కెమెరాలకు బ్యాటరీలను అనుసంధానం చేస్తున్నాం. సౌరశక్తి తగ్గిపోగానే బ్యాటరీల సాయంతో పని చేస్తాయి. విద్యుత్తు సరఫరా లేని సమయంలో ఇంతకు ముందు ఏర్పాటు చేసిన కెమెరాలు పనిచేయలేక పోతున్నాయి. డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా, ఏడీఆర్ఎం సుధాకర్ ఆధ్వర్యంలో సౌర కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. 2026 మార్చి నాటికి పనులు పూర్తి చేస్తాం.చంద్రశేఖర్, సీనియర్ డివిజనల్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజినీరు

# కేంద్రం ప్రారంభించినా... ధాన్యం కొనుగోళ్లలో జాప్యం



కణేకల్లు: ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కేంద్రాన్ని ప్రారంభించి వారం రోజులు గడిచినా.. క్షేత్రస్థాయిలో కొనుగోళ్లు చేయడం లేదు. వర్షం భయంతో అన్నదాతలు బహిరంగ విపణిలో తక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 30 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంతో పౌరసరఫరాల శాఖ అధికారులు గత నెల 25న కణేకల్లులో ఆదర్శ భారతి సొసైటీ నిర్వహణలో కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ మద్దతు ధర ఏ గ్రేడు రూ.2,320, కామన్ రకం రూ.2,300 చొప్పున కొనుగోలు చేస్తామన్నారు. గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయని చెప్పినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. మిల్లర్ల బ్యాంకు గ్యారెంటీ, కొనుగోలు కేంద్రానికి ఐడీ కేటాయింపు వంటి ప్రక్రియ పూర్తైనప్పటికీ, ధాన్యం తరలించే వాహనాలకు జీపీఎస్ తప్పనిసరిగా ఉండాలన్న ప్రభుత్వ నిబంధనతో నేటికీ వాహనాలు సిద్ధం కాకపోవడం గమనార్హం. దీనికితోడు వ్యవసాయ శాఖ నిర్లక్ష్యంతో ఆన్‌లైన్‌లో నమోదు కాని ఈ పంటతో రైతుల్లో గందరగోళం నెలకొని కొనుగోళ్లపై ప్రభావం చూపింది. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రత్యేక చొరవ తీసుకొని వ్యవసాయ అధికారులతో రైతుల వివరాలు సేకరించారు. 524 మంది రైతుల 1,486 ఎకరాల వరి పంటను కొనుగోలు చేసేలా అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించారు. అయినా కొనుగోళ్లు ప్రారంభించడంలో ఎడతెగని జాప్యం నెలకొంటోంది.

**బహిరంగ విపణిలో తక్కువ ధరకు అమ్మకం**

వర్షం భయం, నిల్వ చేసే చోటు లేక రైతులు ధాన్యాన్ని బహిరంగ విపణిలో తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. దళారులు వ్యాపారులతో కుమ్మక్కై నాణ్యత పేరిట క్వింటాలు రూ.1,800–1,900 లోపు కొనుగోలు చేస్తున్నారు. అధికారులు వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

**వర్షం భయంతో అమ్మేశా: నాగరాజు, రైతు, 43ఉడేగోళం**

నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశా. కేంద్రంలో ధాన్యం విక్రయించాలని వారం రోజులుగా ఎదురు చూశా. వర్షం భయంతో దళారులను ఆశ్రయించి వ్యాపారులకు క్వింటాలు రూ.1,930 చొప్పున అమ్మేశా. క్వింటాకు రూ.400 వరకు నష్టపోయాను. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి.

**వెంటనే ప్రారంభిస్తాం: రమేశ్‌రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజరు**

ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. రవాణా వాహనాల ట్రాకింగ్‌కు జీపీఎస్ కలిగిన లారీలను సమకూర్చుతున్నాం. సోమ లేదా మంగళవారం క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించేలా చర్యలు తీసుకొంటాం. రైతులు దళారులకు విక్రయించి నష్టపోవద్దు.

# మెగా సప్లిమెంటరీ ఫలితాలు ఎప్పుడో?

ధర్మవరం : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన మెగా సప్లిమెంటరీ ఫలితాల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అభ్యర్థులు ఫలితాల కోసం ఆరు నెలలుగా ఎదురు చూస్తున్నారు. ఎస్కేయూ పరిధిలో 68 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. డిగ్రీ కోర్సు మూడు సంవత్సరాల్లో పూర్తవుతుంది. పరీక్షలు తప్పితే ఆ తరువాత మూడు సంవత్సరాల్లో ఉత్తీర్ణులు కావాలి. చాలా మంది విద్యార్థులు సకాలంలో పరీక్షలు రాయకపోవడంతో డిగ్రీ మానేశారు. అలాంటి వారి కోసం ఎస్కేయూ అధికారులు మెగా సప్లిమెంటరీ పరీక్షలకు ప్రకటన జారీ చేశారు. 1994–95 నుంచి 2013 సంవత్స రాల మధ్యలో పరీక్షలు తప్పిన అభ్యర్థుల కోసం ఈ మెగా సప్లిమెంటరీ గత సంవత్సరం ప్రకటించారు. అప్పట్లో ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల డిగ్రీ కళాశాలలు ఎస్కేయూ పరిధిలోనే ఉండేవి. ఆయా జిల్లాల నుంచి సుమారు 6 వేల మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేశారు. వారికి గతేడాది అక్టోబరు, నవంబరు నెలల్లో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. నేటికీ ఫలితాలు విడుదల చేయకపోవడంతో అభ్యర్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**అవకాశాలు కోల్పోతున్న పరిస్థితి**

డిగ్రీ ఉంటేనే పీజీ, బీఈడీ, లా తదితర కోర్సులు చేయడానికి అవకాశ ముంటుంది. ఇప్పటికే వయసు పైబడిన అభ్యర్థులు ప్రైవేటుగానైనా ఉన్నత విద్య అభ్యసించవచ్చనే భావనతో డిగ్రీ పరీక్షలు రాశారు. కొన్ని రిజర్వేషన్ వర్గాల అభ్యర్థులు ఉద్యోగాలు వస్తాయని ఆశతో పరీక్షలకు దరఖాస్తు చేశారు. ఉమ్మడి ప్రవేశ పరీక్షల ప్రకటనలు వెలువడ్డాయి. ఉద్యోగ ప్రకటనలు కూడా వెలువడుతున్నాయి. ఎస్కేయూ నుంచి డిగ్రీ ఫలితాలు రాకపోవడంతో ఉన్నత విద్య, ఉ ద్యోగావకాశాలు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




ధర్మవరం మండలానికి చెందిన ఓ అభ్యర్థి 1999లో డిగ్రీ పరీక్ష తప్పారు. రెండు, మూడు సార్లు ప్రయత్నించినా ఉత్తీర్ణత కాలేదు. దీంతో డిగ్రీ వదిలేశారు. ఇలా పరీక్షలు తప్పిన వారి కోసం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మెగా సప్లిమెంటరీ నిర్వహించింది. డిగ్రీ పూర్తి చేస్తే ఏదైనా ఉద్యోగం వస్తుందని ఆ అభ్యర్థి గత సంవత్సరం అక్టోబరులో సప్లిమెంటరీ పరీక్షలు రాశారు. ఆరు నెలలు గడిచినా ఫలితాలు విడుదల చేయలేదని వాపోయారు.

వారం రోజుల్లో విడుదలకు చర్యలు: లోకేశ్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామి నేషన్, ఎస్కేయూ

మెగా సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు సాంకేతిక కారణాలతో ఆలస్యమ య్యాయి. వరుసగా వివిధ పరీక్షలు, మూల్యాంకనం నిర్వహించడంలో నిమగ్నమయ్యాం. వారం రోజుల్లో ఫలితాలు విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

# వరి దిగుబడుల్లో నాతవరం ముందంజ

అనకాపల్లి : జిల్లాలో ఈ ఏడాది వరి దిగుబడుల్లో నాతవరం మండలం ముందుండగా దేవరాపల్లి వెనుకబడింది. గత సీజన్ కంటే 818 కేజీల ధాన్యం అదనంగా పండింది. ఖరీఫ్‌లో హెక్టారుకు 5,331 కేజీలు ధాన్యం రాగా, 2023–24 సీజన్‌లో 4,513 కేజీల దిగుబడి వచ్చింది. నాతవరంలో హెక్టారుకు 6,022 కేజీల దిగుబడులొచ్చాయి. గత సీజన్‌లోనూ ఈ మండలంలోనే అధిక దిగుబడులు వచ్చాయి. అన్ని మండలాల కంటే ఇక్కడే సాగు విస్తీర్ణం ఎక్కువ. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 55,985 హెక్టార్లలో వరి సాగు చేయగా నాతవరం మండలంలో 6,492 హెక్టార్లలో సాగైంది. ఏదాదిలో 120 రోజులు అంటే వరి సాగు చేసినన్ని రోజులు తాండవ జలాశయం నుంచి పంటలకు నీరు విడుదలైంది.

**హెక్టారుకు 71 బస్తాలు...** ఖరీఫ్‌లో అన్ని పంటలు కలిపి 63,286 హెక్టార్లలో సాగు చేయగా.. వరి ఒక్కటే 55,985 హెక్టార్లలో సాగైంది. ఎక్కువగా వర్షాధారంగానే సాగు చేశారు. వాతావరణం అనుకూలిం చడంతో సగటున హెక్టారుకు 71 బస్తాల దిగుబడి వచ్చింది. గత సీజన్‌లో సరాసరి దిగుబడి హెక్టారుకు 60 బస్తాలే.నాతవరం తర్వాత పాయకరావుపేట మండలంలో అధిక దిగుబడులు వచ్చాయి. ఇక్కడ



హెక్టారుకు 5,877 కేజీల ధాన్యం దిగుబడి వచ్చింది. ఇక్కడ పలు ఆనకట్టలు ఉండటంతో పొలాలకు నీరు పుష్కలంగా అందుతోంది. ఎస్.రాయవరం, గొలుగొండ, కోటవురట్ల, మునగపాక, నక్కపల్లి, రావికమతం, ఎలమంచిలి, బుచ్చెయ్యపేట మండలాల్లోనూ వరి దిగుబడులు ఆశాజనకంగానే ఉన్నాయి. ఇక్కడ 5,400 కేజీలకు పైగా దిగుబడులు వచ్చాయి. నీటి ఎద్దడితోపాటు పంటకు చీడపీడలు సోకడంతో దేవరాపల్లి మండలంలో హెక్టారుకు 4,710 కేజీల దిగుబడే వచ్చింది. సుడిదోమ అధికంగా సోకడంతో కొన్ని మండలాల్లో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. మాడుగుల, రోలుగుంట మండలా ల్లో ఐదు వేల కేజీల కంటే తక్కువ దిగుబడులు వచ్చాయి.

దిగుబడులు బాగున్నాయి... రెండు ఎకరాల్లో వరి సాగు చేశా. ఎకరాకు 32 బస్తాల దిగుబడి వచ్చింది. నారు నుంచి కోత వరకు వాతావరణం అనుకూలంగా ఉంది. కోత సమయంలో వర్షం వస్తే భయపడ్డాం. పెద్దగా ఇబ్బంది పడలేదు. గత ఏడాది 25 బస్తాలకు మించి రాలేదు.పిట్ల శ్రీనివాసరావు, నాగవరం, రైతు

# నిగ్గు తేల్చండి.. పరిహారం ఇవ్వండి

అచ్యుతాపురం : ఏపీఐఐసీ పైపులైన్ ప్యాకేజీ పంపిణీలో అవకతవకలు జరిగాయని నిర్ధారించి ఏళ్లు గడుస్తున్నా బాధ్యులపై చర్యల్లేవు. ప్యాకేజీ పంపిణీలో చోటుచేసుకున్న అవినీతిపై అప్పట్లో మత్స్యకారులు నిలదీసినా పాలకులు పట్టించుకోలేదు. అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో ఏర్పాటు చేసిన రసాయన పరిశ్రమల వ్యర్థాలను శుద్ధి చేసిన తర్వాతే సముద్రంలోకి విడుదల చేయాలని, పూడిమడక మత్స్యకారుల్లో 18 ఏళ్లు నిండిన వారికి ఒక్కొక్కరికి రూ.1.25 లక్షల చొప్పున పరిహారం ఇచ్చేందుకు గతంలో అంగీకారం కుదిరింది. దీన్ని అవకాశంగా మార్చుకునేందుకు పెదకొంకాడ దళారులుగా అవతారమెత్తారు.

రెవెన్యూ అధికారులతో లాలూచీ పడి 485 మందికి ప్యాకేజీ అందకుం డా చేశారు. ఒకే పేరుతో రెండు ప్యాకేజీలు, ఆడపిల్లల పేరుతో కొంత, అత్తవారి ఇంట్లోనూ, పుట్టింట్లోనూ ఒకే పేరుతో ఉన్న వారికి ప్యాకేజీ అందజేశారు. ఇలా దళారులు రూ.4 కోట్ల వరకు అవినీతికి



పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి.

280 మంది సింగిల్ యానిట్ రేషన్ కార్డులు, 40 మందికి వయసు లేకపోయినా 18 ఏళ్లు నిండినట్లు చూపి పరిహారం పొందారని రెవెన్యూ అధికారులు నివేదిక అందజేసినా ఇప్పటికీ అతీగతి లేదు. ప్యాకేజీ పంపిణీకి ముందు గుర్తించిన జాబితాలో పేర్లు లేని 30 మందికి పరిహారాన్ని అందించారు. రాజకీయ నాయకుల సిఫార్సులతో 280 మంది ప్యాకేజీ పొందినట్లు సమాచారం.

బ్రాండిక్స్ పైపులైను ఏర్పాటు సమయంలో 2,700 మందికి ప్యాకేజీ ఇవ్వగా ఏపీఐఐసీ ప్యాకేజీ వచ్చే సమయానికి ఈ సంఖ్య 4,828కి పెరగడం గమనార్హం. ఇప్పటికే 4,331 మందికి ప్యాకేజీ అందించిన అధికారులు రూ. 2.5 కోట్ల మేర అవినీతి జరిగిందని ఉన్నతాధికారు లకు నివేదిక ఇచ్చారు.

కూటమి సర్కారు చర్యలు తీసుకోవాలి... న్యాయంగా రావాల్సిన ప్యాకేజీ ఇవ్వడంలో వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు కాలయాపన చేసింది. కూటమి ప్రభుత్వం న్యాయం చేసి ప్యాకేజీ ఇవ్వాలని మత్స్యకారులు కోరుతున్నారు. తెదేపా ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీని తీసుకోవద్దని గతంలో మోసగించి ఎన్నికల్లో లబ్ధి పొందిన జగన్.. అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో ఒక్కమాటా మాట్లాడలేదని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాడు మోసపోయిన వారంతా ఎన్నికల్లో కూటమికి మద్దతిచ్చామని, అవినీతిపై విచారణ చేపట్టి అర్హులందరికీ పరిహారం అందజేయాలని పూడిమడకకు చెందిన మత్స్యకారులు కోరుతున్నారు.

**ఐదేళ్లు కాళ్లరిగేలా తిరిగినా..** పరిహారం ఇవ్వాలని గత ఐదేళ్లు కాళ్లరిగే లా తిరిగినా అధికారులు పట్టించుకోలేదు. పంపిణీకి రూ.60 కోట్లు అవసరంకాగా ప్రభుత్వం రూ.68 కోట్లు విడుదల చేసినా అందరికీ అందలేదు. 31 మంది తక్కువ వయసు వారు, ఆరుగురు మూడుసార్లు ప్యాకేజీ తీసుకున్న వారు, 14 మంది భార్యాభర్తలు ఇద్దరూ ప్యాకేజీ పొందిన వారున్నా చర్యల్లేవు.వాసుపల్లి రాజేశ్, పూడిమడక

చురకలు



## కోలీవుడ్ హీరోతో పెళ్లిపై క్లారిటీ ఇచ్చిన హీరోయిన్

సౌత్ స్టార్ హీరోల్లో ఒకడిగా శింబు గత కొన్ని దశాబ్దాలుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నాడు. పలు బ్లాక్ బస్టర్ సినిమాలతో ఆడియన్స్ లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శింబు ఆల్రెడీ 47 సినిమాలు చేశాడు. మరో మూడు సినిమాలు త్వరలోనే ఆడియిన్స్ ముందుకు రానున్నాయి. ప్రస్తుతం కమల్ హాసన్ తో కలిసి మణిరత్నం దర్శకత్వంలో థగ్ లైఫ్ సినిమా చేశాడు. జూన్ 5న థగ్ లైఫ్ ప్రేక్షకుల ముందుకు రానుంది. థగ్ లైఫ్ లో శింబు చాలా కీలక పాత్రలో నటించినట్టు ఆల్రెడీ రిలీజైన ట్రైలర్ చూస్తుంటే తెలుస్తోంది. యాక్టర్ గా శింబు ఎంత మంచి పెర్ఫార్మర్ అనేది ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. అయినప్పటికీ శింబు సినిమాల్లో తన యాక్టింగ్ కంటే తన పర్సనల్ లైఫ్ లో వచ్చే రూమర్ల వల్లే ఎక్కువగా వార్తల్లో నిలుస్తూ ఉంటాడు. గత కొన్నాళ్లుగా టాలీవుడ్ హీరోయిన్ తో శింబు రిలేషన్‌లో ఉన్నాడని, త్వరలోనే వారిద్దరూ పెళ్లి చేసుకోనున్నారనే వార్త వినిపిస్తుంది. ఆ టాలీవుడ్ హీరోయిన్ మరెవరో కాదు, ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్. గతంలో శింబు తో కలిసి నిధి ఈశ్వరన్ అనే సినిమా చేసింది. ఆ



సినిమా షూటింగ్ టైమ్ లోనే వీరిద్దరి మధ్యా ఏర్పడిన స్నేహం ప్రేమగా మారిందని, త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారని అన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న ఈ వార్తలపై తాజాగా హరిహర వీరమల్లు ప్రమోషన్స్ లో పాల్గొన్న నిధి అగర్వాల్ స్పందించి వివరణ ఇచ్చింది. సినిమాల్లో నటించే హీరోయిన్ల గురించి చాలా పుకార్లొస్తాయని, మరీ ముఖ్యంగా వారి పర్సనల్ లైఫ్ గురించి అందరూ ఎక్కువగా ఫోకస్ చేస్తారని, ఏది అనిపిస్తే దాన్ని బయటకు అనేస్తారని, ఇదంతా చాలా కామన్ అని, ఎందుకంటే జనాలు నిజాల కంటే రూమర్లపైనే ఎక్కువ ఇంట్రెస్ట్ చూపిస్తారని, అందుకే తాను వాటిని పెద్దగా పట్టించుకోనని, తన గురించి ఎప్పుడూ ఏదో రూమర్ వినిపిస్తూనే ఉంటుందని నిధి తెలిపింది. నిధి మాటలతో తన పెళ్లిపై అందరికీ ఓ క్లారిటీ ఇచ్చేసింది. ప్రస్తుతం నిధి అగర్వాల్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన హరిహర వీరమల్లు జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఈ సినిమా ప్రమోషన్స్ లో యాక్టివ్ గా పాల్గొంటున్న నిధి, వీరమల్లు పై ఎన్నో ఆశలు పెట్టుకుంది.

## శ్రుతి హాసన్ 2025లోనూ చప్పగానే!

శ్రుతిహాసన్ వెండి తెరపై కనిపించి ఏడాదిన్నర పూర్తయింది. సలార్ సీజ్ ఫైర్ తర్వాత ఒక్క చిత్రం కూడా రిలీజ్ అవ్వలేదు. సలార్ కథలో శ్రుతి హాసన్ పాత్ర కీలకమైందే? అయినా అమ్మడు కొన్ని సన్నివేశాలకే పరిమితమైంది. ఆరంభం..ముగింపులో మాత్రమే హైలైట్ అయింది. మిగతా కథ అంతా ప్రభాస్- పృధ్వీరాజ్ సుకుమారన్...ఇతర పాత్రల చుట్టూనే తిరుగుతుంది. దీంతో శ్రుతి హాసన్ పాత్రకు ప్రాధాన్యత ఎక్కడ? అన్న అంశం అమ్మడికి ప్రతికూలంగా మారింది. గత ఏడాది ఒక్క సినిమా కూడా రిలీజ్ లో లేకుండా పోయింది. ఈ ఏడాది కూడా అమ్మడి కెరీర్ చప్పగానే సాగేలా ఉంది. సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తోన్న కూలీ చిత్రంలో శ్రుతి హాసన్ నటిస్తుంది. కానీ అందు లో శ్రుతి పాత్ర ఏ మేర ఉంటుంది? అన్నది సందేహమే.



అలాగే మిస్కిన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ట్రైన్ లోనూ నటిస్తుంది. విజయ్ సేతుపతి మెయిన్ లీడ్ పోషిస్తున్న చిత్రమిది. శ్రుతి హాసన్ హీరోయిన్ కాదు. ఓ పాత్రధారి మాత్రమే. ఈ సినిమా కూడా ఇదే ఏడాది రిలీజ్ అవుతుంది. ఈ రెండు సినిమాల్లో కూడా శ్రుతి హాసన్ పేరుకే తప్ప ఆమె పాత్ర బలంగా ఉంటుందా? అన్నది సందేహమే. అదే జరిగితే శ్రుతి కెరీర్ లో ఈ రెండేళ్లు పెద్దగా సాధించింది ఏం లేనట్లే. విజయ్ హీరోగా నటిస్తోన్న జననాయగన్ లో నటిస్తుంది. ఇందులో హీరోయిన్ పాత్ర పూజాహెగ్డే పోషిస్తుండగా ఓ కీలక రోల్ శ్రుతి హాసన్ పోషిస్తుంది. ఈ సినిమా వచ్చే ఏడాది రిలీజ్ అవుతుంది. సలార్ 2 చేతిలో ఉన్నా? అదెప్పుడు మొదలు పెడతారు? ఎప్పుడు పూర్తవుతుంది? అన్నది తెలియదు. ఇంకా కొత్త కమిట్ మెంట్లు ఏవైనా ఉన్నాయా? అంటే కనుచూపు మేరలో ఎక్కడా కనిపించలేదు. ఇతర భాషల్లో కూడా శ్రుతి హాసన్ ఎలాంటి సినిమాలకు అగ్రిమెంట్ చేసుకోలేదు. దీంతో శ్రుతి కెరీర్ పరంగా వీక్ గానే కనిపిస్తుంది.




## అనుష్క 'ఘాటి' నుంచి ఓ గుడ్ న్యూస్




వెండితెరకు అందరి కంటే కాస్త ఎక్కువ గ్యాప్ తీసుకుంటున్న సీనియర్ హీరోయిన్స్ లలో అనుష్క పేరు టాప్ లిస్ట్ లో ఉంది. చాలా కాలంగా పాత్రల కోసం ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు అనుష్క శెట్టి 'ఘాటి' సినిమాతో కచ్చితంగా ఆకర్షణీయమైన అనుభూతి ఇవ్వబోతోంది. కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే దర్శకుడు క్రిష్ జాగర్లమూడి ఈ సినిమాను డైరెక్ట్ చేస్తున్నారు. ఇది వీరిద్దరి కలయికలో 'వేదం' తర్వాత వస్తున్న సినిమా కావడంతో అంచనాలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ చిత్రంలో అనుష్క పాత్ర చాలా పవర్ఫుల్ గానూ, వైవిధ్యభరితంగానూ ఉండబోతోంది. గ్లింప్స్ లో లుక్ చూసినవాళ్లు ఆమె క్యారెక్టర్‌తో పాటు సినిమా కోసం కూడ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

విక్రమ్ ప్రభు కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో రమ్యకృష్ణ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇది కేవలం ప్రతీకారం కోసం నడిచే కథే కాదు, మానవ విలువల క్షీణత, కడుపు నింపడానికి చేసే పోరాటాన్ని చూపించే కథ అంటున్నారు మేకర్స్. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించారు. జూలై 11న పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను థియేటర్లలోకి తీసుకురానున్నారు. విడుదల పోస్టర్ లో ప్రధాన పాత్రధారులు తమ భుజాలపై బరువులు మోస్తూ, నీటిలో నడుస్తూ వెళ్తున్న దృశ్యం ఎంతో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది సినిమాకు సంబంధించిన కంటెంట్ ను హైలెట్ చేస్తోంది. మాస్ ఎంటర్టైనర్ కాదు కానీ, ఈ కథ హృదయాలను తాకేలా ఉంటుందట. 'ఘాటి' అనే టైటిల్ కేవలం పేరుకే కాదు, కథలోని ప్రతి మూమెంట్ కూడా అదే స్థాయిలో ఆసక్తిగా ఉండబోతుందని సమాచారం. నిర్మాతలు UV క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్ కలిసి ఈ సినిమాను అత్యున్నత స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇప్పటికే టెక్నికల్‌గా, విజువల్స్ పరంగా మంచి బజ్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమా ఆడియన్స్‌కు కొత్త అనుభూతిని ఇవ్వనుంది. దర్శకుడు క్రిష్ ఈ చిత్రంతో తన కెరీర్‌లో మరో బిగ్ హిట్ అందుకోవాలని చూస్తున్నాడు. వరుసగా డిఫరెంట్ సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న క్రిష్, ఈసారి అనుష్కను వినూత్నంగా చూపిస్తూ ప్రేక్షకులను శక్తివంతమైన కథలోకి తీసుకెళ్లనున్నాడు. మరి ఈ సినిమా అతనికి ఏ స్థాయిలో విజయాన్ని అందిస్తుందో చూడాలి.

## పవన్ మార్క్ అంటే ఇలా ఉంటుంది మరి!



పవన్ కళ్యాణ్.. ఆయనకు ఉన్న క్రేజే వేరు. రాజకీయాల్లో వచ్చి తన సత్తా ఏంటో నిరూపించుకున్నారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో పిఠాపురం నుంచి గెలిచి పెద్ద ఎత్తున వార్తల్లో నిలిచారు. ఆ తర్వాత డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజు నుంచే.. తన మార్క్ పాలన చూపించారు. అనేక విషయాలపై ఆరా తీశారు. ఇప్పుడు రీసెంట్ గా సినిమాల విషయంలో కీలక ఆదేశాలిచ్చిన విషయం తెలిసిందే. థియేటర్స్ లో తనిఖీలు నిర్వహించాలని, తినుబండారాల క్వాలిటీ తోపాటు రేట్లపై నిఘా పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. అంతకుముందు.. మూవీ టికెట్ రేట్లు, ఎక్స్ ట్రా షోల అనుమతులు కావాలంటే ఛాంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు. అది తన సినిమా అయినా.. అలాగే చేయాలని చెప్పారు. దాని ద్వారా క్లియర్ గా ఒక విషయం అర్థమయ్యేలా చేశారు. రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ తనకు కూడా వర్తిస్తాయని చెప్పారు. అదే సమయంలో ఇప్పుడు ఆయన.. హరిహర వీరమల్లు మూవీతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. జూన్ 12వ తేదీన సినిమా రిలీజ్ కానుంది. గ్యాప్ తర్వాత పవన్ స్క్రీన్ పై కనిపించనుండడంతో అంతా ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. మిడ్ నైట్ షోస్ కూడా కోరుకుంటున్నారు. కానీ ఇప్పుడు పవన్.. అందుకు ఒప్పుకోవడం లేదని తెలుస్తోంది. అర్ధరాత్రి సమయంలో షోస్ వేసే విషయంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారని సమాచారం. అస్సలు వేయొద్దని మేకర్స్ కు చెబుతున్నారట. ముఖ్యంగా రీసెంట్ గా ప్రీమియర్స్ షోలో జరిగిన విషయాలు గుర్తుంచుకుని పవన్ ఇప్పుడు అలా చేస్తున్నారని క్లియర్ గా తెలుస్తోంది. దీంతో పవన్ అన్ని విషయాల్లో మార్క్ చూపిస్తున్నట్లు క్లియర్ గా తెలుస్తోంది. అభిమానుల భద్రత గురించి ఆలోచించి ఆ నిర్ణయం తీసుకున్నారని ఇప్పుడు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. కాగా, అర్ధరాత్రి ప్రదర్శనలకు అనుమతి లభించకపోతే, తెల్లవారుజామున 4 గంటల ప్రదర్శనలు వేయవచ్చని జోరుగా ప్రచారం జరుగుతోంది. నిర్మాత రత్నం ఫిల్మ్ ఛాంబర్ తో ఆ విషయంపై చర్చించినట్లు సమాచారం. కానీ అభిమానులు మాత్రం ప్రీమియర్స్ ను డిమాండ్ చేస్తున్నారు. మరి చివరికి ఏం జరుగుతుందో వేచి చూడాలి.

## హీరోయిన్లను సాధారణ మహిళల్లా చూడట్లేదు

బాల నటిగా సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన మలయాళ భామ నిత్య మీనన్ తన మాతృభాషలోనే హీరోయిన్ గా కూడా పరిచయమైంది. మలయాళంతో పాటూ తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో కూడా ఎన్నో సినిమాలు చేసి తనకంటూ మంచి గుర్తింపును తెచ్చుకుంది నిత్యా మీనన్. తన కెరీర్ స్టార్టింగ్ నుంచి ఇప్పటి వరకు ఎంతో సెలెక్టివ్ గా సినిమాలు చేస్తూ వస్తున్న నిత్య మీనన్ అందరిలా కాదు చాలా డిఫరెంట్. ఎక్స్‌పోజింగ్, ఇంటిమేట్ సీన్స్ కు మొహమాటం లేకుండా నో చెప్తూ ఉంటుంది. అయినప్పటికీ అమ్మడికి ఆఫర్లు వస్తున్నాయంటే దానికి తన టాలెంటే కారణం. 180 సినిమాతో కోలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన నిత్యా ఆ తర్వాత వరుస పెట్టి అక్కడ సినిమాలు చేస్తూ వచ్చింది. మణిరత్నం తో చేసిన ఓకే కణ్మణి సినిమాతో నిత్యా బాగా పాపులరైన విషయం తెలిసిందే. అయితే నిత్య మీనన్ కు కాస్త పొగరు అనే మాట రెగ్యులర్ గా బయట వినిపిస్తూ ఉంటుంది. కొన్నాళ్ల కిందట ఓ ఈవెంట్ కు వెళ్లిన నిత్యామీనన్ కు అక్కడున్న ఓ ఫ్యాన్ షేక్ హ్యాండ్ ఇవ్వడానికి ట్రై చేసినప్పటికీ నిత్యా మాత్రం అతనికి



నమస్కారం చేసి తనకు జలుబు ఉందని చెప్పి లోపలికి వెళ్లి అదే ఈవెంట్ లో అక్కడున్న హీరోకు హగ్ ఇచ్చింది. ఈ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ నెటిజన్లు నిత్యామీనన్ ను బాగా ట్రోల్ చేయగా, తాజాగా ఈ విషయంపై నిత్యా క్లారిటీ ఇచ్చింది. చాలా మంది మగాళ్లు హీరోయిన్లను సగటు మహిళల్లాగా భావించరని నిత్యా మీనన్ చెప్పింది. హీరోయిన్లను ఈజీగా టచ్ చేయొచ్చని అనుకుంటారని, తాము ఎలాంటి ఈవెంట్ కు వెళ్లినా షేక్ హ్యాండ్ అంటూ తమను టచ్ చేయడానికి ఎగబడతారని, సాధారణ మహిళలను వాళ్లు షేక్ హ్యాండ్ అడక్కుండా తమను మాత్రమే ఎందుకు అడుగుతున్నారు? అలా ఈజీగా టచ్ చేయడానికి హీరోయిన్లు ఏమైనా ఆట బొమ్మలా అని నిత్యామీనన్ ఫైర్ అయింది. ప్రస్తుతం నిత్యా మీనన్ ఈ విషయంపై రెస్పాండ్ అయి మట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఇక నిత్యా కెరీర్ విషయానికొస్తే తిరుచ్చిట్రం ఫలం సినిమాలో ధనుష్ తో కలిసి నటించి ఆ సినిమాలో తన యాక్టింగ్ కు రీసెంట్ గా ఉత్తమ నటిగా నేషనల అవార్డ్ ను అందుకున్న నిత్యా మీనన్ ఇప్పుడు మరోసారి ధనుష్ తో కలిసి ఇడ్లీ కడై సినిమా చేస్తోంది. త్వరలోనే ఇడ్లీ కడై ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో పాటూ విజయ్ సేతుపతితో కలిసి తలైవన్ తలైవి సినిమాలో కూడా నిత్యా నటిస్తోంది.

## బుట్టలో శ్రీలీల.. పెళ్లి కాదు ఆ వేడుక అంట కద..!

టాలీవుడ్ యువ హీరోయిన్ శ్రీలీల ఏం చేసినా సరే సోషల్ మీడియాలో మంచి డిస్కషన్ పాయింట్ గా మారుతుంది. మొన్నటిదాకా తెలుగు, కన్నడ సినిమాలతోనే అలరించిన అమ్మడు ఇప్పుడు బాలీవుడ్ బాట పట్టింది. అక్కడ కార్తీక్ ఆర్యన్ తో ఒక క్రేజీ సినిమా చేస్తుంది శ్రీలీల. సౌత్ హీరోయిన్ కాస్త ఆ ప్రాజెక్ట్ చేస్తుంది కాబట్టి ముంబై మీడియా కూడా శ్రీలీల మీద ఫోకస్ పెట్టింది. ఆమె ఏం చేస్తుంది ఎవరిని కలుస్తుంది అంటూ నానా హంగామా చేస్తున్నారు. ఐతే లేటెస్ట్ గా శ్రీలీల ఇంట్లో ఒక సెలబ్రేషన్ మళ్లీ ఆమెను వార్తల్లో నిలబెట్టేలా చేసింది. శ్రీలీల అందంగా ముస్తాబయ్యి కట్టు బొట్టుతో పాటు గంధం కూడా పూసుకుని కనిపించింది. ఈ ఫోటోలు చూసి శ్రీలీల ఎంగేజ్మెంట్ అయ్యింది అంటూ సోషల్ మీడియాలో కొందరు హడావుడి మొదలు పెట్టారు. అసలు శ్రీలీల ఈ వేడుక వెనక రీజన్స్ ఏంటి అని తెలుసుకోవాలని తెగ ప్రయత్నిస్తున్నారు. ఐతే వాళ్లకి మరీ అంత టఫ్ ఇవ్వడం ఇష్టం లేని శ్రీలీల చిన్నగా తన ఇంట్లో వేడుక గురించి లీక్ చేసింది. మా ఇంట్లో బర్త్ డే వేడుకలు ఇలానే జరుగుతాయి అంటూ



ఆమెను బుట్టలో ఎత్తిన ఫోటోని తన ఇన్ స్టాగ్రాం లో షేర్ చేసింది శ్రీలీల. ఐతే నిజంగానే ఆ ఫోటో చూస్తే అది బర్త్ డే వేడుకల్లో భాగం అన్నట్టుగా లేదు నిజంగానే శ్రీలీలని పెళ్లి కూతురుగా చేసి బుట్టలో ఎత్తుకొస్తున్నట్టు ఉంది. మరి బర్త్ డేకి ఈ రేంజ్ హంగామా ఏంటో అనుకుంటే ఈ క్రెడిట్ అంతా కూడా తన మదర్ దే అంటూ చెప్పుకొచ్చింది శ్రీలీల. శ్రీలీల అంటే ఆమె మదర్ కి చాలా ఇష్టం. అదేంటి ఏ తల్లికైనా తన పిల్లలంటే ఇష్టమే అనుకోవచ్చు. అది నిజమే కానీ ఎవరికి వారు అలా ప్రత్యేకం అనుకుంటారు కద ఇది కూడా అలానే అన్నమాట. ఇక హీరోయిన్ గా రాణిస్తున్న శ్రీలీల ప్రస్తుతం తెలుగులో రవితేజతో మాస్ జాతర సినిమా చేస్తుంది. ఆ సినిమాతో పాటు తమిళ్ లో శివ కార్తికేయన్ తో పరాశక్తి సినిమా చేస్తుంది. ధమాకా తర్వాత రవితేజతో చేస్తున్న సినిమా అవ్వడం తో మాస్ జాతర మీద భారీ అంచనాలు ఉన్నాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536